ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



4 అణాలు

8-10-'52


పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
దమనకుడటు పోగానే - సంజీవకుడిట్లు తలచె:- "ఇపుడు మరొక అడవిలోకి - పారిపోయినప్పటికీ - ప్రయోజనము లేదు కనుక - పింగళకుని కడకె పోయి - క్షమించమని వేడుతాను."
ఛిన్నమైన మొగము తోడ, ఛిన్నమైన మనసు తోడ, సంజీవకుడల నల్లన మృగరాజును సమీపించె
దొంగ చూపు చూసుకుంటు నక్కి నక్కి దరియ వచ్చు సంజీవకుడగుపించగ
పింగళకుడు ముందువైపు కాళ్ళురెండు మీదికెత్తి తోకనెత్తి, నోరు తెరిచి గర్జిస్తూ నిలబడెను
సంజీవకుడా వైఖరి చూడగానే "ఇదో నను చంపుటకే పింగళకుడు వస్తున్నాడ"ని యెంచెను
అచ్చటనే పొంచి వున్న దమనకుండు పింగళకుని చెవిలో యిటు లూదినాడు "అడుగడుగో మీ శత్రువు వస్తున్నాడె దుర్మార్గుడు"
ప్రళయకాల రుద్రునివలె పింగళకుడు మిత్రునిపై కెగసి దూకి తలపడెను
ఇంతదాక వచ్చినాక - వెనుదీయుట తెలుగాక - వృషభేంద్రుడు కూడ ఎగసి - కొమ్ములతో మృగరాజును - కుమ్మికుమ్మి గాయపరచె
మిత్రులిట్లు పోరుచుండ దమనకుడూ కరటకుడూ దూరంగా నక్కి నక్కి చూస్తూ కూర్చున్నారు
కరటకుడు "అయ్యయ్యో, దమనకుడా! ఎంత ధూర్త బుద్ధి నీది! ఎంత మంచిష్టారికెంత శత్రుత్వం తెచ్చినావు? అయినా నాకెందుకులే! వెనుకటికో సూచీముఖి కవమానం అయినట్లే నాకూ అవుతుందేమో!"
"ఎవరా సూచీముఖి? ఏమా కథ?"
హిమవత్పర్వత ప్రాంతవనంలో కోతుల గుంపొకటుండేది
ఒక దినమున ఆ వనమున నెల్లెడ మంచువాన తెగకురిసింది చలిలో జడిలో నిలువనోపకా కోతులు గడ గడ వణికాయి

సంవత్సర చందా
రు 12-0-0
విడిప్రతిక 4 అ


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 7
8.10 52

నందన ఆశ్వయుజ బహుళ పంచమి బుధవారము



నీలగిరి: ఛాయా చిత్రకారుడు సినీయాక్టర్ శ్రీ వి. నాగేశ్వరావు

విషయానుక్రమణిక

సంక్రాంతికి కథల పోటీ

★

ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రిక రాబోయే సంక్రాంతికి ప్రత్యేకసంచికగా వెలువడు తుంది. ఆ సంచికలో కథానికల పోటీ ఏర్పాటు చేయదలచాము. ఈ పోటీలో యావన్మంది రచయితలు పాల్గొనవచ్చును. కథావస్తువు గ్రామీణ జీవితాన్ని ప్రదర్శించేదిగా ఉండాలి. రచన మా వారపత్రికలో ఆరు పేజీలకు మించకుండా ఉండాలి.

—సంపాదకుడు

బాపిరాజస్మృతి

సుమారు పాతిక ముప్ఫయ్యేళ్లపాటు ఆంధ్ర రసజ్ఞ లోకాన్ని పాటలతో, కథలతో, నవలలతో, చిత్ర లేఖనంతో ఉర్రూతలూగించిన శ్రీ అడివి బాపిరాజుగారు సెప్టెంబరు 22 వ తేదీన కాలధర్మం చెందారు. వారి మరణవార్త యావదాంధ్రానికీ తీవ్రాఘాతమై తగిలింది. ఆంధ్ర సాంస్కృతిక రంగంలో పూడ్చరాని అగడ్త మిగిలింది.

నిత్యమూ కలలు కంటూ, స్నేహితులకు, అభిమానులకు తన కలలు వినిపిస్తూ, ఆకలల కోసమే బ్రతికిన స్వప్నశీలి. స్నేహితుడనేవాడు కనిపిస్తే హృదయం విప్పి ఆప్యాయతనంతా వెల్లబోసుకునే స్నేహశీలి. ఛందో నియామాలను కళ్లగించుకుని ఝరీ వేగంతో వచ్చే భావపరంపరలను ఎక్కడఉన్నా, ఏం చేస్తున్నా, ఏ కాగితం దొరికితే దానిమీద అప్పటికప్పుడు పాటలు పాటలుగా రాసివేసే కావ్య తపస్వి. చక్కని వర్ణ చిత్రాలు, అసంఖ్యాకంగా రేఖా చిత్రాలు దేశంపై వరిపించిన చిత్రకారుడు. ఆయన "నారాయణరావు," "తుపాను" "హిమబిందు" మొదలైన నవలలు, ఎన్నో చిన్న కథలు చదవని సహృదయుడు ఆంధ్ర దేశంలో ఉండడు.

బాపిరాజుగారి మనస్సు ఒక కళమీద నుంచి మరొక కళమీదకు భ్రమరంలా నిత్య భ్రమణం చేసేది. చిత్రకళ, కవిత్వం, కథలు, సంగీతం, నృత్యం అన్నిటినీ ఆయన వరించారు. ఆఖరికి సినిమా కళను గూడా ఆయన వరించారు. కాని ఆ కళలో ఆయనకు తగిన అవకాశాలు రాకపోవటం ఒక దురదృష్టం. ఆయన కళకోసమే కలలుకంటూ జీవించారు. ఆ కలలన్నిటినీ ముద్దగాచేసి "శశికళ" అనే మూర్తిని సృష్టించుకున్నారు. ఆ శశికళను బొమ్మల్లో, పాటల్లో ప్రతిబింబించుకుని, చూసి, అందరికీ చూపించి మురిసిపోయేవారు. "ఎవరండీ ఆ శశికళ?" అని ఎవరన్నా అడిగితే "ప్రకృతిలోని సౌందర్యం, కళల్లోని సౌందర్యం, నా ఆశయాల్లోని సౌందర్యం అంతా మూర్తీభవించిన ఒకానొక దేవత" అనేవారు.

చిత్రకళారంగంలో బాపిరాజుగారు చాలా ప్రముఖమైన పాత్ర నిర్వహించారు. తనకు ఖ్యాతి నార్జించిపెట్టిన కొన్ని చిత్రాలు ఆయన చిత్రించటమే కాక, తెలుగుదేశంలో చిత్రకళకు, చిత్రకళను అభ్యసించేవారికి ఒక గౌరవనీయమైన స్థానం సంపాదించి పెట్టినవారు బాపిరాజుగారు. రాజమండ్రి ఆర్ట్సు కాలేజి ప్రిన్సిపాల్‌గా ఓ. జె. కూల్డ్రేగారు వచ్చి, దామెర్ల రామారావు, అడవి బాపిరాజుగార్లవంటి యువకులను ఆకర్షించి వారిచేత కళలో ప్రత్యేకమైన కృషి చేయించారన్నది అందరూ ఎరిగిన విషయమే. కూల్డ్రేగారి ఆగమనానికి పూర్వం తెలుగుదేశంలో చిత్రకళ ఏ స్థాయిలో వున్నదో తెలుసుకొంటే, యీనాటి సంఘంలో చిత్రకళకు యీమాత్రమైనా గౌరవం లభించటం అబ్బురమనిపిస్తుంది. ఎంత ప్రయత్నించి చూసినా రామారావు, బాపిరాజుగార్లు చిత్రకళారంగంలో ప్రవేశించక పూర్వం పేరెన్నికగన్న ఆంధ్ర చిత్రకారుడు ఎవరూ వున్నట్లు తోచటంలేదు. అంటే-చిత్రకళ అంతకుముందు స్తంభించిపోయింది అనలేము కానీ, ఆ రంగంలో జరుగుతున్న కృషిపట్ల సంఘంలో ఆదరణ లేకుండా పోయిందనిమాత్రం చెప్పగలం. రామారావు, బాపిరాజుగార్లు చిత్రకళారంగంలో ప్రవేశించకుండా వేరే రంగాలలోచేరి పొట్టలు పోసుకోవటంతో తృప్తిపడివున్నట్లయితే, తెలుగుదేశంలో చిత్రకళ ముచ్చెపనివాళ్ళ చేతుల్లోనుంచికూడా దిగజారిపోయి, అసలు రూపులేకుండా మాసిపోయేదే! అటువంటి హీనస్థితి రాకుండా వీరుభయులు మన సంఘాన్ని కాపాడారు. రామారావుగారు చిన్న వయస్సులోనే తనువును చాలించినా, తాను వెలిగించిన కళాజ్యోతి వెలుగులో మరికొందరు కళాకారులు తయారయ్యే కట్టుదిట్టం చేసిపోయారు. బాపిరాజుగారు చిత్రకళలోని మర్మాలను తాను తరచి తరచి, తనకు తోచిన ఆ విశేషాలు, తాను పొందిన ఆ ఆవేశాలు, తెలుగునాట అంతటా ప్రతి ఒక్కరికీ చెప్పి, ప్రతివారిచేతను చిత్రకళకుగల ప్రాశస్త్యాన్ని గుర్తింపచేశారు.



ముందు యుగాల్లో ఎవరైనా తెలుగుదేశపు చిత్రకళచరిత్రను వ్రాస్తే యీ 20 వ శతాబ్దంలో యిక్కడ చిత్రకళ అడుగంటిపోకుండా వుద్ధరించిన గౌరవం బాపిరాజుగారికే అంకితం చేస్తారనటం అతిశయోక్తి కాబోదు.

కళకోసం ఆయనకొరకు దుఃఖిస్తున్న కుటుంబానికి సానుభూతి తెలుపుతూ, ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక అని ఆశింతుదాం. ★

కాలక్షేపం

శిలమొన గూలమ్ముల్ చిదిమి-
చెన్నుగ వేణుకరీర కాంతిచే
లలితములైన దర్భకబ
ళంబుల లేళ్ళకు నిమ్ము కొనలో;
కలిత వయోంగనా విపుల
గండసుపాండుర నాగవల్లి కా
దళముల గోళ్ళ త్రుంచి వని
తా తతికేని నొసంగు మిమ్ములన్.

చక్కగా కాలక్షేపం చేయడానికి రెండేరెండు పద్ధతు లన్నాయి. కొనలో (అడవిలో) నిశ్చింతగా తపస్సు చేసికొనుచు అక్కడనే ఒక ఆశ్రమం ఏర్పరచుకొని పదునైన రాతిముక్కయొక్క అంచుమొనతో, నిగనిగలాడే కణుపులతో లేతగాఉన్న దర్భగడ్డిని కోసి చక్కని లేడిపిల్లలకు మేతపెట్టుతూ కాలక్షేపం చేయుము. లేదా, లేత తమలపాకులను యీ నెలుతీసి, ప్రక్కనున్న చక్కని పడుచుపడతుల నోటికి అందిస్తూ కాలక్షేపం చేయుము. చేతనైతే యోగిగా ఉండు. చేతకాకపోతే భోగిగా ఉండు. అంతే గాని, శుష్క వేదాంత తర్కములు చేస్తూ, సిల్కుచీరెలు షేరంచేయడం కూడదన్నాడు. చక్కని సినిమాతారల బొమ్మలన్నీ కత్తిరించి ట్రంకుపెట్టెలో పెట్టిదాచుకొని, ముచ్చటగా చూచుకొని ధ్యానంచేస్తూ, గదిలోని గోడలకు మాత్రము బుద్ధభగవానుడు, రామకృష్ణపరమహంస, వివేకానందస్వామి, రమణమహర్షి, శ్రీ సాయిబాబా మొదలైన మహాయోగుల పటములకు పూలమాలలు వేయడం ఎందుకు? చిత్తం శివునిమీద, భక్తి చెప్పులమీద అనే పద్ధతిగా ఉండకూడదంటాడు భర్తృహరి. నిజమే. అసంపూర్ణరామాయణం పనికిరాదు. దానినే తిరుపతి మంగలి క్షౌరం అంటారు. ఒకనికి తల కొంచెం క్షౌరం చేసి అది పూర్తిగా ముగించకుండా ఇంకొకని తలకు సగం క్షౌరం చేయడం అమంగళమైన మంగలిపని. ఏపనిచేసినా అందులో ఆసక్తిగాని, పట్టుదలగాని ఉంటేనే చెయ్యాలి. లోపల ఆసక్తి లేకపోయినా, పైకి ఆసక్తి ఉన్నట్లుగా నటించవద్దంటాడు. ఇది కపటవృత్తి అవుతుంది. చిత్తశుద్ధి లేని రిక్తజీవితం అవుతుంది. నిజమే.

అయితే ఒక్క ధర్మసందేహం మాత్రము కలుగుతూ ఉంటుంది. భోగాసక్తి కలిగినటువంటివాడు, వైరాగ్యమార్గంలో అభిలాష ఉన్నట్లుగా నటించడం చాలామంది విషయంలో కనిపిస్తూ ఉంటుంది. కాని, వైరాగ్యమార్గంలోనే నిజంగా మనస్సుఅంతా లగ్నమైపోయి, పైకిమాత్రము భోగాసక్తి కలిగియున్నట్లుగా కన్పించి, శృంగారపురుషునివలె నటించేవాళ్లు కూడా ఉంటారా? ఇదే సందేహం. ఐహికభోగములమీద తనకు మనస్ఫూర్తిగా సరదా ఏమిన్నీ లేకపోయినప్పటికీ, సంసార తాపత్రయములలో తనకు ఉత్సాహం ఉన్నట్లుగాను, స్త్రీవ్యామోహం ఉన్నట్లుగాను నటిస్తూ, శృంగారం రంగేళీరావులానుప మీసాలకు రంగు వేసికొని ఎవ్వడైనా రసికజనతిలకమువలె ప్రవర్తిస్తాడా? ఇది చాలా అపూర్వమైన విషయం. "అంగనా మంగనా మంతరే మాధవం - మాధవం మాధవం చాంతరే చాంగనా" అని శ్రీకృష్ణపరమాత్ముడు గోపికలతో రాసక్రీడ చేశాడు. ఒక్కొక్క గోపికకు ఒక్కొక్క కృష్ణుడు ప్రత్యేకంగా కన్పించాడు. అంగనకు అంగనకు మధ్య మాధవుడు ఉన్నాడు. మాధవునకు మాధవునకు మధ్య గోపిక ఉంది. ఈ విధంగా గోపికాలోలుడై రమించి మించిన గోపాలకృష్ణుడు విషయవాంఛాశూన్యుడై యోగమార్గనిరతుడై కర్మయోగమును, నిష్కామ కర్మయోగమును అత్యద్భుతంగా అర్జునునకు ఉపదేశించాడు. అటువంటి కృష్ణుడు యోగనిరతు డంటారా? భోగనిరతు డంటారా? ఏకకాలమందే భోగాభ్యాసమున్నూ, యోగాభ్యాసమున్నూ ఎవ్వడైనా చెయ్యగలడా? లేదా, ఒక కాలు హరిచందనంలోను, మరొక కాలు అగ్నిగుండంలోను పెట్టినట్లుగా మోహబద్ధుడై మోక్షసిద్ధి కూడా పొందగలడా?

ఇదంతా తవ్వినకొద్దీ అంతులేని అగాధంగా అగమ్యగోచర తత్త్వవిచారణగా ఉంది. ఎందుచేతనంటే, పరిపూర్ణమైన యింద్రియనిగ్రహం సంపాదించిన సిద్ధులు ఏదైనా తిని జీర్ణం చేసికోగలరు. ఏదీన్నీ తినకుండా నిర్వికల్పసమాధిలో కూడా ఉండగలరు. లోకంతో వారికి పనిలేకపోయినప్పటికీ, ఈ లోకంలో ఎందుకు ఉన్నారయ్యా అంటే, లోకసంగ్రహార్థం (అనగా లోకాన్ని బాగుచేయడానికి) వారు యీ లోకంలో ఉంటారు-ఇది సిద్ధి పొందినయోగిపుంగవుల జీవితరహస్యం - యోగవిద్యకు యీశ్వరుడు శ్రీకృష్ణుడు-కనుక, యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు ఎందుచేత ఐహిక విషయాసక్తునివలె ప్రవర్తించాడని ప్రశ్నిస్తే, ఆ విషయానికి జవాబు చెప్పడం సులభసాధ్యం కాదు-భాగవతం అంతా భావగతం చేసుకున్నవాడే చెప్పాలి. బమ్మెరపోతన్నగారే బోధించాలి. లేదా, వ్యాసుల వారే వివరించాలి.

మనకు అర్థంకాని యీ అవతారలీలావిశేషముల సంగతి అటుంచి, మనకు అర్థమైన సాటి సోదరమానవలీలలను అవగాహన చేసికొనుటకైనా యత్నించాలి. అదిన్నీ గాక, ఆనాటి అవతార లీలలకంటె యీ నాటి తారల లీలలు పగలు రాత్రి పారాయణం చేసే భక్తి పరాయణులు చాలామంది ఉన్నారు. ఒక్కొక్క తారకు ఒక్కొక్క దేవాలయం నిర్మించి ఆ తారయొక్క గర్భగుడిలో చక్కని విగ్రహం ప్రతిష్ఠించి "సుందరీ ముపాస్మహే"

(ఈ సుందరిని నేను ఉపాసన చేయుచున్నాను) అని ధ్యానశ్లోకాలు ఎందుకు చదువకూడదు? "అథ సర్వాంగాని పూజయామి" అని ఆ ప్రతిమయొక్క ప్రతి అవయవమును వరుసగా పుష్పములతోగాని, పత్రితోగాని ఎందుకు పూజచేయకూడదు? "నేత్రౌ పూజయామి, భుజౌపూజయామి, స్తనౌ పూజయామి, కటింపూజయామి, జంఘాపూజయామి" అని యీ విధంగా ఉపాసకుడు తాను ఉపాసన చేసేటటువంటి స్త్రీ విగ్రహాన్ని పూజిస్తే, అది అంతా సౌందర్యోపాసన కాదా? ఈ విధమైన సౌందర్యోపాసనచేసి మోక్షం పొందిన మహాయోగులు ఉన్నారు.

నికరమైన సౌందర్యోపాసన చేస్తే ఎవ్వరూ ఏమనరు. ఉద్యానవనంలో అనేక జాతుల పుష్పములు, ఫలములు ఎంతో మనోహరంగా ఉంటాయి. పనస, పోక, మామిడి, మల్లెలు, మొల్లలు, చామంతులు మొదలైనవి అనేకం నేత్రోత్సవంగా ఉంటాయి. చూచి ఆనందించవలసిన భగవచ్చిద్విలాసం అది. "తరణికరంబులన్ ధరణి తాకగనీక తనర్చు పల్లకీ! పరళ తమాల సాల పనస క్రముకామ్ర పటీర కేతకీ! కురువక కింశుకాది కుజకుంజ సమంచిత కాననంబులన్" (తరణి) సూర్యుని కిరణంబులు (ధరణి) భూమిమీద తాకనీయకుండా చేసేటటువంటి దట్టమైన అడవి. "కాంతా కనుగొనవే యిక్కాంతారము సొగసు" అని ప్రియసఖితో సహా విహరించవచ్చు అక్కడ ఆ సౌందర్యరాశి అంతా ఎంత మనోహరమైనదో, ఆకాశంలో జిగజిగలాడుతూ ప్రకాశించే తారాగణం కూడా అంత మనోహరమైనదే. ఈ తారాపథంలోఉన్న తారలను సృష్టిచేసినవాడే తెరజగత్తులోని తారలను కూడా సృష్టిచేశాడు. కనుక, భగవంతుని సృష్టిలోని కొన్ని రకాల తారలను చూడవచ్చుననియు మరికొన్ని రకాల తారలను చూడగూడదనియు ఆంక్ష విధించడానికి విరూపాక్ష పీఠానికి గాని కామకోటి పీఠానికి గాని అధికారం లేదు.

అయితే వచ్చిన తగాదా ఎక్కడ ఉందంటే, "పూజ" అనబడే కర్మ చేసేటప్పుడు కూడా నిష్కామంగా చెయ్యాలన్నాడు శ్రీకృష్ణ భగవానుడు. సౌందర్యోపాసన చేసేటప్పుడు కూడా నిష్కామంగా చెయ్యాలన్నాడు. మానవకోటికి ఇది ఒక నిష్కామకోటిపీఠ శ్రీముఖంగా తయారైంది. తారల బొమ్మలను కత్తిరించి దాచుకుంటే తప్పులేదు. కాని, ఆ పని కూడా నిష్కామంగా చెయ్యాలన్నాడు శ్రీకృష్ణుడు. అలాగయితే, అది మాకు సాధ్యం కాదంటారు సినిమా రసులు. సౌందర్యోపాసన చేసేవాళ్ళు నూనె, ఆవ, గుమ్మడి తినగూడదంటే, ఏదో విధంగా ఆకరిన పథ్యం అయినా చేస్తాం గాని, కామం లేకుండా నిష్కామంగా సౌందర్యోపాసన చెయ్యమంటే, అది అశక్యం, అసాధ్యం, అసంభవం అంటారు. ఆవకాయ తినకూడదనినప్పటికీ శిరసావహిస్తారు గాని, కామరహితంగా సౌందర్యోపాసన చెయ్యమంటే, అదంతా అర్థంలేని ఉపాసన అంటారు. అటువంటి ఉపాసన వజ్రయోగముద్రలు సాధించిన యోగులకు సాధ్యమేమో కాని, సామాన్య మానవులకు అనగా, యీ సంసారం అనే బురదలో నిమగ్నులైన మనవంటివారికి "కుటుంబ జంబాల పటల మగ్న మాదృశ గృహమేధి మండల"మునకు సాధ్యము కాదు. అందువల్ల అలవాటులేని ఔపాసనమూలంగా మూతి మీసాలు కాలిపోగలవనే భయం లోకానికి ఉంది.

ఆ లెక్కకు వస్తే ఔపాసనమే కాదు, వివాహం కూడా లోకసంగ్రహార్థమే చేసుకోవాలి గాని "నహి నహి కామ్యార్థం"- "అరయన్ వంశము నిల్పనే కద వివాహంబు" అనే సిద్ధాంతం పురాణకాలంలో ప్రమాణంగా స్వీకరించి ఉండవచ్చు. "వంశము నిల్పడమే తన కర్తవ్యం" అని వ్యాసమహర్షి పుత్రదానం చేశాడు. కౌరవ వంశం ఆయన మూలంగా నిలిచింది. ఆ వంశం నిలువబెట్టవలసిన డ్యూటీ నిజంగా ఆయనకు లేనేలేదు. ఆ డ్యూటీ వివాహం చేసికొన్న భర్తది. కాని, తల్లియైన సత్యవతి కోరితే, ఆమునిపుంగవుడు తన మరదళ్లు అయిన అంబికకు అంబాలికకు (విచిత్రవీర్యుని వితంతుభార్యలకు) పుత్రసంతానం యిచ్చి, అంతకుపైన ఆ రాజు భార్యలతో తన కేమీ సంబంధం లేదని, తామరాకుమీది నీటిబొట్టువలె, కావలసిన ఫోటోలు తన కామెరాతో తీసియిచ్చిన కామెరామాన్‌లాగున, నిష్కామంగా వ్యాసులవారు ప్రవర్తించారంటే అది నిజంగా మహాద్భుతమైన విషయంగాని మరొకటి కాదని మహాత్ముడు ప్రశంసించాడు.


కాని, యీ యోగవిద్యఅంతా కత్తిమీది సాము-అది కత్తి అంచునడక-దానినే అసిధారావ్రతచర్య అంటారు-ఏకశయ్యపై పవళించిన నూత్నదంపతులు కలియకుండా, వారిమధ్య నొక పదునైన ఖడ్గము నొకటి మూడురాత్రులు వారి నిగ్రహంకోసం, ఉంచడమే యీ అసిధారావ్రతం-అందుకనే "ఈయసిధారావ్రతచర్య

కాలక్షేపం

కెవ్వడు మహోర్వ్యశేణికిక్ దెల్పెనో” అని ధర్మనిర్వహణ సునిశితత్వమును గూర్చి భర్తృహరి అన్నాడు.

“ఇంద్రియములు దుర్జయములు;
హృదయము కడు
చంచలము; ధర్మగతి కత్తి
యంచునడక;”

ఇటువంటి సందర్భంలో ఏ ఆశ్రమధర్మం నిర్వహించడమైనా కత్తి యంచు నడకగానే ఉంది. గృహస్థాశ్రమధర్మం నిర్వహించడం తేలిక అనీన్నీ, అడవిలో తపస్సు చేయడం కష్టం అనీన్నీ భావించేవాళ్లు ఉన్నారు—అదేవిధంగా సంసార తాపత్రయాలు లేకుండా, హాయిగా అడవిలో తపస్సు చేసికోవడం తేలికపని అనీన్నీ సంసారయాతనలు అనుభవించడం కష్టమనీన్నీ భ్రమించేవాళ్లుకూడా ఉన్నారు—అడవిలో లేడికి మేత పెట్టడం ఎంత కష్టమో ఇంట్లో “లేడీ”ని (ఇల్లాలును) పోషించడంకూడా అంత కష్టమే—బైరాగులలో చేరి ముక్తికాంతను వరించాలని గంజాయిగ్రోగి భ్రష్టులైన వాళ్ళు, అడవులలోను కొండగుహలలోను చాలామంది ఉంటారు. అదేవిధంగా “ఇల్లను నూతిలోబడి గృహవ్రతులైన” వారి “రిక్తవ్యర్థ సంసారముల్” కూడా ఉన్నాయి. కొందరు పత్రికలలో కన్పించిన మందులను పరమహంసక్రియలకై భ్రమతో తెప్పించి సేవించి అభినవమన్మథులం కావలెనని మథనపడుతూ ఉంటారు—సౌందర్యోపాసన ఎక్కువైనకొద్దీ సబ్బుల ఖర్చు ఎక్కువవుతుంది. స్త్రీవ్యామోహంతో ఇస్త్రీ వస్త్రవ్యామోహం తయారవుతుంది. సుగంధపరిమళాది ఉద్దీపనద్రవ్యముల ఉపయోగం ఎక్కువైనకొలదీ, అత్తరులో దీపం వెలుగుతుంది. సెంటులకు ఖర్చు హెచ్చుగా హెచ్చుగా సెంటు భూమికూడా మిగలక తైలం అయిపోవడం, దీపం ఆరిపోవడం సంభవిస్తుంది. ఉన్న ధనం ధన్వంతరులకే ధారపోయాలి. పూర్వం సంతానం లేదనితపించి నలుగురుభార్యలతో కాలక్షేపంచేసిన దశరథుడు పుత్రకామేష్టి చేశాడుగాని, ప్రకటనచేసిన మందులన్నీ తినలేదు. ఆ మందులో ఉన్న ప్రభావంకంటె మందుయొక్క ప్రకటనలో ఉన్న ప్రభావం ఎక్కువైనది. అసలు తారలో ఉన్న అందంకంటె తెరమీది తారలో ఎక్కువ అందం ఉంటుంది. ఇటువంటి మతిభ్రమ కలిగించే మందులు తినే భామందులు మందులుగాక మరెవ్వరు తెరమీది తారను చూచి యీ “మందయాన మెగ మందము మీరు నవారవిందమున్” అని అమందానందకందళిత హృదయారవిందులైనవారికిన్నీ, అడ్డమైన మందులూ దొడ్డవ నేవారికిన్నీ, వ్యత్యాసంలేదు. ఈ ఔషధాలు కూడా హిమాలయ పర్వతాలలో ఉన్న యోగిపుంగవులు కనిపెట్టిన మందులే అని మందుల ప్రకటనలో వ్రాయబడిఉంటుంది “ఇది అమూల్యమైన మూలికలు అరవై నాలుగు చేరినదై ఒక మహాయోగిచే ఉపదేశింపబడినది సాలామిశ్రీ, శియామిశ్రీ, పంజాబుమిశ్రీ, తాల్‌మఖానా, బీజ్‌బంద్, వదనమస్తు, గూమిమస్తగీ, రాతిమదం, గొబ్బివిత్తులు, బైమన్‌సఫేదా, రతన్‌పురుష్, కుల్కాంక్, అశ్వగంధ, శిలాజిత్, బాదం, అక్రోట్, పిస్తా, కుంకుంపువ్వు,



మూడు తలల తాడిచెట్టు

భీమవరం, అత్తిలి స్టేషన్లమధ్య రైలు ప్రయాణీకులకు ఇది కనపడుతుంది.

—ఛాయాచిత్రకారుడు శ్రీజి. యన్ భూషణ్.

పచ్చకర్పూరం, కస్తూరి, అంబర్, గోరోజనం, జాజికాయ, జాపత్రి, అపరంజి, ఖర్జూర్, కిస్మిస్, కల్కండ, వగైరా వగైరా దినుసులు చేర్చి తయారుచేసిన పరమహంసక్రియ యిది. నిత్యయౌవనముతో దేవేంద్రుడు ఇంద్రభోగం అనుభవించుటకు వీలుగా అశ్వినీ దేవతలు తయారుచేసిన ఔషధరాజం ఇది. దీనిని సేవించిన గంటలోనే శరీరం వజ్రకాయమవుతుంది. పురుషులు నవమన్మథులై నవమాసములలోనే పుత్రసంతానం పొందగలరు" అని హిమగిరి మహర్షి సుహిమచే కనుగొనబడి, అతడు దానిని ఉపదేశించిన పిమ్మట ఒకమందుల వ్యాపారస్థుడు లోకాన్ని ఉద్ధరించుటకై శ్రమయనక తులము పదిరూపాయలు చొప్పున ప్రసాదమును పంచియిచ్చినట్లుగా వి. పి. పార్సిలుగా పంపిస్తామని ప్రకటించాడు. మహాప్రసాదం అని పుత్రసంతానం లేని ఒక గృహమేధి తెప్పించాడు. మండలంపాటు సేవించినతర్వాత, అతనికి ప్రతిరోజూ యీ భూమండలం అంతా గిర్రున తిరుగుతున్నదనే విషయం ప్రత్యక్షానుభవం అయింది. ఇంకా మరికొన్ని దినాలకు మతికూడా గిర్రున తిరిగింది. అమూ ఉద్దీపన పదార్థాలుఅన్నీ ఆమందులో చేరినవో లేవోగాని, ఆ మందులో నల్లమందు బాగా చేరినదని తెలిసింది. అసలే ఆ బ్రాహ్మణుడు అమాయకుడు. శుద్ధశ్రోత్రియుడు. "బుద్ధిజాడ్య జనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్" అన్నంత పనీ అయింది. అల్లసాని పెద్దన్నగారి మనుచరిత్ర ప్రబంధంలో ఒక యోగి ఇచ్చిన పాదలేపనంతో వరూధినీ వేశ్యవీధికి వెళ్లి యిరుకునపడిన ప్రవరుని లాగున, యీబ్రాహ్మణునకుకూడా హిమగిరి మహర్షి ప్రోక్తమైన వాజీకరణయోగం మూలంగా అతని మతి కళ్ళెంలేని గుర్రం లాగున అయింది. ఆ మందుల పైత్య ప్రభావం అదే అని అసలు సంగతి తెలిసిన వైద్యులందరూ అన్నారు. అప్పుడు యీ ఉద్దీపన వైద్యం నిలిపివేసి, అతనికి ఉన్మాదవైద్యం చేయించారు.

అయినా, హిమాలయ పర్వతాలలో తపస్సు చేసికొనే యోగీశ్వరులకు కూడా యీవిధంగా మదనకామేశ్వరీ లేహ్యాలు తయారుచేయడమేనా పని? వాళ్లు హిమాలయ పర్వతప్రాంతాలలోకి వెళ్లి లేడిపిల్లలకు దర్భకబళములను మేత పెట్టకుండా, బీజ్ బంగు వగైరా వీర్యవృద్ధిమందులను తయారుచేస్తూ కాలక్షేపం చేస్తూఉంటారా? అక్కడికి వెళ్లినా ఎక్కడికి వెళ్లినా, కొండలలో ఉన్నా, కొంపలలో ఉన్నా, రాగులకు విరాగులకు కూడా, "లేడీ" ధ్యాసయే అన్నట్లుగా ఉంది.

శ్రీరామచంద్రునివంటి అవతారమూర్తి అడవిలో ఉన్న మాయబంగారు లేడిని చూచి దానికొరకై వ్యామోహపడి, దాని వెంటబడి తిరిగినందువల్ల ఆయన ధర్మపత్ని యైన లేడీ సీతాదేవిని రావణాసురుడు అపహరించడం సంభవించింది.

అసంభవం హేమమృగస్య జన్మ
తథాపిరామో లులుభే మృగాయ
ప్రాయస్సమాపన్న విపత్తికాలే
ధియోపి పుంసాం మలినీభవన్తి.

(హేమమృగస్య జన్మ)-బంగారులేడి అనేది పుట్టడం-(అసంభవం)-అసాధ్యం-(తథాపి) అయినప్పటికీ,(రామో మృగాయ లులుభే) రాముడు ఆ లేడికొరకై ఆశపడెను.(ప్రాయ స్సమాపన్న విపత్తి కాలే) విపత్కాలము సమీపించిన తరుణములో-(ధియోపి పుంసాం) ధీమంతులైన పురుషులు కూడా (మలినీభవంతి)బుద్ధి కళంకముగలవారవుచున్నారు-

రాములవారికి కలిగిన అనుభవాన్ని బట్టి చూస్తే అడవికి వెళ్లేటప్పుడు సొంత భార్యను వెంటబెట్టుకొని పోవడం అనర్థకం-అడవిలో ఉండే లేడిని దేనినైనా దగ్గరకు తీసికొని పెంచవచ్చునని ప్రయత్నిస్తే, అడవిలోకూడా మాయలేడి ఏదైనా తటస్థపడితే దాని మోహంలో మనమే పడవచ్చు.బంగారమే ప్రధానంగా కలిగి నటువంటి బంగారులేడీ ఒకటి వెంటబడినదంటే, దాని ఎత్తు బంగారం దానికి యిచ్చినా తృప్తి పొందదు. మాయ బంగారు లేడివంటి సినిమాతారలు కోరినంత ధనం లక్షలకొలదిగా సమర్పించి ఎంతమంది సినిమా డైరెక్టర్లు నష్టపడడం లేదు?

అడవిలోకి వెళ్ళినా, నడివీధిలోకి వెళ్ళినా, మాయలేడి అనేది ఎవరికైనా ఎదురుపడవచ్చు. లేడికి లేచిందే పరుగు అన్నట్లుగా దానివెంట మనము పడితే, ఆ లేడి పారిపోతుంది. "హాలో లక్ష్మణా" అనేస్థితి వస్తుంది, 'ఏదిరా నాసీత? ఏదిరా లక్ష్మణా' అనే ఆవేదనతో తరులార, గిరులార, లాంతరు స్తంభములార! బస్సులార! పోలీసు భటులార! నా బంగారు లేడీని ఎందైనా చూచితిరా!' అని వెర్రివానివలె వీధులవెంట తిరుగవలసివస్తుంది.

అడవిలోని లేడికన్న, అర్ధాంగి అనబడే లేడీకిన్ని హస్తిమశకాంతరం ఉంది. అడవిలో ఒక లేడిని కాదు, అనేక లేడులను దగ్గరకు తీసి మేత పెడుతూ సరదాగా కాలం గడపవచ్చు. కాని, ఇంట్లో ఒక లేడీకంటె ఎక్కువగా చేరిస్తే లేళ్ళు పోట్లేళ్ళు అవుతాయి. ఇల్లు వాకిళ్లు వదలిపెట్టి "జయ్! సీతారాం!" అని అడవులకు పోవలసివస్తుంది. ఇంట్లో ఉన్న లేడీకి లేత తమలపాకుల మేత పెట్టితే చాలునని పై పద్యంలో అన్నాడు గాని, ఆ లేత తమలపాకుల మేతతో

(55-వ పేజీ చూడండి)

ఆనాడు

శ్రీ బొమ్మిరెడ్డి

ఇంతకూ నేనావాడు ధోవతీకట్టి లాల్చీతొడిగి కండువా వేసుకోడం నాది ప్రథమ తప్పు. ఆ తరువాత తెలంగాణా రచయితల సమావేశానికి హాజరై, ఆలస్యంగా పదకొండుగంటల రాత్రి నిర్జనమయిన మా సితాఫల్ మండి వీధుల్లో (ముల్కీ నాన్ ముల్కీ గొడవ బయలుదేరింతరువాత రాత్రి తొమ్మిది గంటలు దాటితే వీధుల్లో యెవరూ వుండటం లేదులెండి) ఒక్కడినే పడి రావడం రెండవపొరపాటు. సరే యెలాగో తప్పదుగా! అందులో హైద్రాబాద్ సంస్థానంలో పుట్టిపెరిగిన నన్ను నాన్‌ముల్కీ క్రింద జమకట్టరు కదా అన్న ధీమాతో బస్సుదిగి యింటిదారి పట్టాను, తొందర తొందరగా అడుగులు వేసుకుంటూ. మెయిన్‌రోడ్డు దిగి ఒక వీధిలో జొరబడానో లేదో పక్కనే కల్వర్టుమీద యెలక్ట్రిక్ దీపపు వెలుతురులో కూర్చున్న ఓ చిన్న గుంపు నాకంటబడ్డది. ఇంతకు ముందక్కడ మాస్నేహిత బృందమంతా హాజరయి యేదో పిచ్చాపాటి సాగిస్తూ వుండేవాళ్లం. ఇప్పుడా చోటనే ఒక పదిమంది విద్యార్థులు - యీ మధ్యనే *H. S. G* పాసయ్యారు లెండి వాళ్లంతా - ఏదో గొప్పగా చర్చిస్తున్నారు. ఒకళ్లకొకళ్లు మాట్లాడుకుంటున్నట్లు లేదు వాళ్ళ విధానం. కేకలు వేస్తున్నారు. మధ్య మధ్య నవ్వులు. నే నామూల మలుపు తిరగడంతోనే "ఏయ్ గైర్‌వాలా", అన్న అరుపు వినబడింది. దాన్ననుసరిస్తూ "యేఁ నాన్‌ముల్కీ సాలా" అన్న కేక వినిపించింది. ఆ తరువాత "వొరే ఆంద్రా" అన్న కేక వినబడగానే నా కాళ్లెందుకో టక్కున ఆగిపోయాయి. ఒక్క క్షణం ఆలోచించాను. అక్కడున్నవాళ్ళందరూ తెనుగువాళ్లే. మరి వాళ్లు మాత్రం ఆంధ్రులు కారా? నన్నెకన్నారామాట? ఒక సమస్యనుండి యింకొక సమస్య యెలా బయలుదేరుతుందో ఆలోచించాను. ఈ మధ్య హైద్రాబాద్ పోలీస్ యాక్షను తరువాత ఇతర ప్రాంతాలవాళ్లు స్టేట్‌లోకి వచ్చిన మాట వాస్తవమే. అందువల్ల నిరుద్యోగ సమస్య మరీ విషమించింది. కాని ఆవచ్చినవాళ్లందరూ ఆంధ్రులుకారు. కాకపోతే తెలుగుదేశాలనుండి వచ్చినవారు యెక్కువమంది వున్నారేమో! అయినంతమాత్రాన నాన్‌ముల్కీ లనగానే ఆంధ్రులన్న నిర్ధారణకొచ్చి, ఆంధ్రుల్ని, ఆడిపోసుకోడం వుచితం కాదుగా? అందులో హైద్రాబాద్ తెలుగువాళ్లు, బయటనుండి వచ్చిన తెనుగువాళ్లను, "ఒరేయ్ ఆంద్రా" అనడం సబబునది కాదు. అలా అంటున్నారంటే వాళ్లు ఆంధ్రులు కారన్న మాటేగా మరి! అయినా వాస్తవికానికి వారు ఆంధ్రులే! ఈ విషయంలో ఆలోచించినకొద్దీ వాళ్ళ తెలివి చావుతెలివిగా మారుతుందన్న భావం ధృఢపడింది నాలో. వాళ్లకు అసలు విషయమేమిటో, అసలీ సమస్య యెలా బయలుదేరిందో, దీన్నెలా పరిష్కరించాలో వారికి నచ్చజెప్పాలనుకున్నా. అనుకోడమేమిటి నిశ్చయించుకున్నాను. వెనుతిరిగి వాళ్లవేపు నడిచి వెళ్లాను. నేను దగ్గరికి రావడం చూచి వాళ్ళందరూ తలలు వాల్చేశారు. ఎవరూ మాట్లాడలేదు. నేను కూడా యీ విషయాన్ని ముందెలా యెత్తుకోవాలని ఆలోచిస్తున్నాను. ఇంతలో ఒకడు లేచి "క్షమించండి సార్ ఎవరో గైర్‌గాడనుకున్నాము. పొరపాటు. వెరీ సారీ" అన్నాడు.

"అది కాదోయ్ అసలు..." అని నేను మొదలుపెట్టేటప్పటికి యింకొకడు లేచి "పోనీయండి సార్. తప్పు మాదే" అంటూ సగందూరం నెట్టుకొచ్చాడు నన్ను. వాడి మోటుతనం చూచి యిక మాట్లాడే ధైర్యం లేకపోయింది నాకు. మెల్లిగా నడవసాగాను. వెనుకనుండి పెద్దగా నవ్వులు వినిపించాయి. వళ్లు మండిపోయింది. కాని వాళ్లతో వాదించి లాభముండదని భావించి మెల్లిగా రోడ్డు కొలుచుకుంటూ నడవసాగాను.

నా బుర్రలో ఆలోచనలు పలు విధాలుగా పరిగెత్తుతున్నాయి. ఒకవేపు విశాలాంధ్ర కావాలన్న నినాదం. ఇంకొకవైపు విశాలాంధ్రలో ఒకభాగం కానున్న హైద్రాబాదులో ముల్కీ, నాన్‌ముల్కీ గొడవ. అందులో నాన్‌ముల్కీలంటే తెనుగుదేశాలనుండి వచ్చిన వారేనని భావించి "*Non-Mulkies go back*" అని ముందు గోడలమీద రాసి, యిప్పుడు "*Andhras go back*" అని గోడలు ఖరాబు చేస్తున్నారు. ఆంధ్రులందరూ కలిసి ఐక్యకంఠంతో ఆంధ్రరాష్ట్రం కావాలంటేనే అది తొందరలో ప్రాప్తిస్తుంది అంటున్నారు. నెహ్రూగారు రాయలసీమలో యీ విషయమై కొంత రభస జరుగుతూ వుంది. ఇక హైద్రాబాద్‌లో కూడా ఒకటి బయలుదేరదుకదా? అలా జరిగితే రాష్ట్ర విభజన తొందరలో సిద్ధిస్తుందా? నా ఆలోచనల కొక్కసారిగా అంతరాయం కల్గింది.

మొరుగుకుంటూ యెదురుగా వచ్చి నిలవేసింది నన్ను ఓ కుక్క. ముందడుగు వేస్తే యెక్కడ కాటేస్తుందో అన్న భయంతో ఆగిపోయాను. యెదురుగా ఫోకస్ చేసిన టార్చిలైటు కాంతి నాముఖం మీద పడ్డది. కళ్లు అమాంతంగా తమ ధర్మాన్ని నెరవేర్చడం మానుకొన్నాయి. ఏమీ కనిపించటంలేదు. కళ్లు మూసుకున్నాను. పోలీసువాడెవడయినా గస్తీ తిరుగుతూ వంటరిగా వస్తున్న నన్ను శంకించి అలా వేశాడేమో? కాని అదేమిటి ముఖం మీద వేయడం దేనికి? వాడు దగ్గరికొచ్చి ప్రశ్నించినప్పుడు అంతు కనుక్కోవాలనుకున్నాను. ఒక ఘరానా వ్యక్తిమీద టార్చి వేయడం సామాన్యవిషయం కాదు. చాలా అవమానకరమైనది. అది మర్యాద కాదు. ఇంతకూ వాడు పోలీసువాడై వచ్చే దెవరో తెలుసుకోవాలనుకుంటే రోడ్డుమీద టార్చి వేసి చూడాలికాని ముఖంమీద కాదు. నా కళ్లు పనిచేయకపోయినా చెవులు మాత్రం వాటి ధర్మాన్ని అవి నెరవేరుస్తున్నట్లున్నాయి. నా వైపుకే నడిచివస్తున్న వాళ్ళ అడుగుల చప్పుడు వినవస్తూ వుంది. కళ్లు గట్టిగా మూసుకునే వున్నాను. అడుగుల చప్పుడు దగ్గరవుతున్నట్లు చెవులు మెద

(55-వ పేజీ చూడండి)

సీరియల్ నవల

రెండు మహా నగరాలు

చార్లెస్ డికెన్స్

36

సెయింట్ జర్మెయిన్ ప్రాంతంలో ఒక విశాలమైన పెద్ద భవంతి; పారిస్‌లోవున్న టెల్‌సన్సు బ్యాంకు ప్రధాన కార్యాలయం, ఆ భవంతిలో ఒక మూలగా వుంది. అసలు ఆ భవంతి ఒక గొప్పప్రభువుది. ఆ మహామహుడు తన స్వంత వంటవాడి దుస్తులు వేసుకొని దేశంనుంచి పరారీ చిత్తగించాడు. ఆయన అధికారం మండవెడుతున్న రోజుల్లో, కాస్త చాకలెట్ పానీయం నోటిదగ్గిరికి అందాలంటే, ఆ వంటవాడు ఒక్కడూ చాలక మరో ముగ్గురు మనుషులు సాయం చేయవలసివచ్చేది. రోజులు మారినై; పరివారవిహీనుడై ప్రభువారు వేటగాళ్ళబారిబడ్డ అడవిమృగంలా, ప్రాణభీతితో ఏకాకిగా పరాయిదేశాలకు పలాయనం చిత్తగించవలసివచ్చింది.

ప్రభువుగారు తప్పుకున్నారు; ఆయన తాలూకు సిబ్బందీ ఆఖరి క్షణాలలో, దేశభక్తిపేర ఆయన పీకెను ఉత్తరించివేయటానికి సన్నద్ధులై, యిన్నాళ్ళుగా ఆయనదగ్గిర పెద్ద పెద్ద జీతాలు పుచ్చుకున్న మహాపాపంనుంచి విముక్తులై బయటబడ్డారు. పవిత్ర ప్రజలో చేరిపోయారు. అనంతరం ప్రజాప్రభుత్వం ఆ భవనాన్ని స్వాధీనం చేసుకుని, దఖలు పరుచుకుంది. దేశభక్త దళాల అధికారులు ఆ భవనంమీద స్వాతంత్ర్యచిహ్నమైన త్రివర్ణపతాకాన్ని ప్రతిష్ఠించి దాన్లో మకాం పెట్టారు. ఆ భవంతిచుట్టూ ఒక ఎత్తైన ప్రహారీగోడ, మధ్యలో, బందోబస్తయిన పెద్ద యినప గేటు వున్నయ్.

ఆ భవంతిచుట్టూ భోగలాలసత్వానికి అనువైన సొగసైన శృంగారవనం వుంది. మధ్యమధ్య ప్రణయాధిదేవతి పాలరాతి శిలాప్రతిమలు కూడా నెలకొల్పివున్నయ్. టెల్‌సన్సు బ్యాంకులాంటి వ్యాపారసంస్థ, అలాంటి విలాసమందిరంలో వున్నదంటే, ఏ ఇంగ్లండులోనో అయితే అల్లరిపడి పత్రికల్లోకి ఎక్కేది. పారిస్‌లో గనక సరిపోయింది.

ప్రస్తుతం టెల్‌సన్సు బ్యాంకులోవున్న తమ ఆస్తిపాస్తులను తిరిగి తీసుకునేవారెవరో తీసుకోనివారెవరో ఎవ్వరూ చెప్పలేరు. బ్యాంకులో దాచుకున్న నగలూ నాణాలూ, బ్యాంకులో వుండగానే వాటి కామందులు, ఏ చీకటి ఖైదులోనో మగ్గి మశానమై పోవచ్చు—చివరికి వాటిని తిరిగి యిమ్మని అడిగేదిక్కే వుండక పోవచ్చు. అలాంటి ఖాతాలను ఎన్నింటిని ముగింపు అంటూ లేకుండా, అనంతకాలం వరకూ బ్రాటోవరు ఖాతాలక్రింద వ్రాస్తూవుండాలో ఏ ఉద్యోగికీ అర్థంకావటంలేదు—చివరికి జర్విస్ లారీగారికి కూడా అర్థంకావటంలేదు. ఆ బాపతు ఖాతాలుకొన్ని ముందేసుకుని లారీగారు ఇటూ అటూ పేజీలు తిరగేస్తున్నారు. అయోమయంగావున్న ఆయన ముఖంమీద బల్లమీదవున్న దీపపుకాంతి పడి మరింత భీభత్సంగావుంది.

ఏళ్లు గడచినకొద్దీ చెట్టు బాగా వేళ్లు పాతుకుంటుంది. లారీగారంటే, టెల్‌సన్సు సంస్థలో అలా బాగా వేళ్ళు నాటుకుపోయిన మహావృక్షం. అందుచేత బయట యెన్ని ప్రభంజనాలు రేగుతున్నా, ఆయన నిబ్బరంగా కూర్చుని, తమాయించుకోగలుగుతున్నాడు. బ్యాంకు అద్దెకు తీసుకున్న భాగంలోనే, ఆయన ఒకటి రెండు గదులు ఆక్రమించి మకాం పెట్టాడు.

బ్యాంకు సింహద్వారానికి యెదురుగా, ముందున్న ఆవరణలో రెండు పెద్దలాంతరు స్తంభాలున్నయ్. వాటి రెంటికీమధ్య ఒక బ్రహ్మాండమైన సానరాయి అమర్చివుంది. ఆరాయి, నాటుకొయ్యలతో ఆదరాబాదరా తయారుచేసిన చట్రంలో అమర్చివుంది. దేశభక్తులు, ప్రక్కనున్న యే కమ్మరి కొలిమిలోనుంచో దొర్లించుకొచ్చి, ఆ సానరాయిని అక్కడ నెలకొల్పారు. ఆ కాతా పుస్తకాల బాదరబందీతో బుర్ర వేడెక్కిపోయి, లారీగారు, కాస్త ఊపిరి విడుచుకోవాలనే ఉద్దేశంతో బల్లదగ్గరనుంచి లేచొచ్చారు. ఇలా కిటికీ తెరిగి కాస్త తొంగి చూడంగానే, ఆసానరాయీ ఆ చట్రం ఆయన కంటబడ్డది. ఆజడపదార్థాన్ని చూస్తే, ఆయన యెందుకో గజగజావణికి, కిటికీ రెక్కలు మూసేశాడు. మళ్ళావచ్చి తన కుర్చీలో చతికిల బడ్డాడు.

ప్రహారీగోడకు అవతల వున్న రోడ్లమీదినుంచీ, వీధుల్లోనుంచి, రోజూ రాత్రిళ్ళు మామూలుగా వినిపించేమోస్తరుగానే యేదో రొదవినిపిస్తోంది. ఉంటుండి, మధ్యమధ్య, గందరగోళంగా యేదో కల్లోలం వినిపిస్తూ వుంటుంది. అలాంటి కల్లోలం వినిపించినప్పుడల్లా లారీ భగవన్నామస్మరణచేస్తున్నాడు.

'స్వామీతండ్రీ!—ఈభీభత్సంలో, ఈరాత్రి, నాకు ఆప్తుడైన ప్రాణి యెవ్వడూ ఈ నగరంలో లేకుండా రక్షించు నీకు వేవేల నమస్కారాలు చేస్తాను. ప్రమాదంలో చిక్కుబడి వున్నవాళ్ళందరి మీదా నీ మహాదయను వర్షించు'—

ఇలా దణ్ణాలూ దస్కాలూ పెడుతూవుండగానే, వీధిగేటు దగ్గిర గంట మోగింది. 'వాళ్ళు మళ్ళా వచ్చారు' అని పిల్లికూనలా దిగులుగా వింటూ కూర్చున్నాడు. కాని ఆయన అనుకున్నంత అలజడి యేమీ కనుపించలేదు. పెల పెలా గుల్లంతుగా జనం లోపలికి తోసుకొచ్చిన సవ్వడియేమీలేదు. గేటుదగ్గిరవాళ్లు బందోబస్తుగానే కాపలాకాస్తున్నారు. కాస్త అలా బయటికి వెళ్లి కాపలావాళ్ళతో పిచ్చాపాటీ యేదన్నా రెండుముక్కలు మాట్లాడివద్దామని బయలు దేరాడు. ఇలా తలుపు తెరిచి గడపలో నిల్చునున్న యిద్దర్నీ చూసి విభ్రాంతుడయ్యాడు.

లూసీ, లూసీ తండ్రీ!

అనువాదం: తెన్నేటి సూరి

★ రెండు మహానగరాలు ★

'ఆఁ!—ఏవిటి మీరా?—ఇక్కడికా?— ఎందుకూ?—ఏమైంది?' మాటమీద మాట కంగారుగా అడిగాడు

'బాబాయ్! ఆయన! ' లూసీ వలవలా యేడుస్తూ లారీ భుజంమీద వాలిపోయింది

'ఏవిటే లూసీ—మీ ఆయన—చార్లెస్ సంగతేవిటి?'

'ఇక్కడికి '

'ఇక్కడికా—ఎప్పుడొచ్చాడు?'

'నాలుగైదురోజులైంది—జైల్లో పెట్టారుట'—

'ఆఁ!—ఏవిటీ?—ఎంతపని జరిగిందీ!'—అంటూ లారీ గుండె బాదుకున్నాడు

ఇంతలో గేటుదగ్గిర మళ్ళా గణగణా గంట వినిపించింది గల్లంతుగా మాట్లాడుతో ఎవరో బిలబిలా లోపలికి వస్తున్నారు

'ఏవిటాగోల?—అంటూ డాక్టర్ మానెట్ కిటికీ వేపు నడిచాడు

'ఆగండాగండి!—అటు చూడకండి—కిటికీ తెరవకండి—కొంప మునుగుతుంది'—అంటూ, లారీ ఆయనకు అడ్డం వచ్చాడు

డాక్టర్ చిరునవ్వు నవ్వుతూ, వెనక్కి తిరిగి లారీవంక చూశాడు:

'లారీగారూ!—మరేం భయపడకండి — నేనంటే ఈ పట్నానికి ఒక మోజుంది—నేను కొంతకాలం ఇక్కడ బాస్టిల్లీలో ఖైదీగావున్నాను—నేను బాస్టిల్లీ ఖైదీనని చెబితే నావంటిమీద అలా చెయ్యివేయరు సరేగదా—నన్ను ఆలింగనం చేసుకుని ఆప్యాయపడని దేశభక్తుడుండడు ఈ పారిస్‌లో—పారిస్‌లో యేవిటి?—ఫ్రాన్సులో నా విషాదచరిత్రను చెప్పుకునే పారిస్ నగరంలో ప్రవేశించటానికి అనుమతి సంపాదించింది చార్లెస్ భోగట్టా సంపాదించగలిగింది కూడా అలానే—అలా జరుగుతుందని కూడా నాకు తెలుసు, చార్లెస్‌కు సహాయం చెయ్యగల్గునని

(52-వ పేజీ చూడండి)



శ్రీరంగంలో చీకటికొట్టు: ఇక్కడ, టిప్పుసుల్తాన్ ఖైదుచేసిన తెల్లవారిని నిర్బంధించాడని ప్రతీతి
—ఛాయాచిత్రకారుడు సినీయాక్టర్ శ్రీ ఏ. నాగేశ్వరరావు.

పరారి

(నాటిక)

జాన్ గాల్స్‌వర్దీ

ఆరో ఘట్టం

[అర గంట తరవాత. మైదానంలో కొత్త దంపతు లిద్దరు షికారు వెళ్లి ఒక బాటవెంట తిరిగి నడిచివస్తూ ఉంటారు. భార్య కొంతమేర కుంటుతూ నడిచి ఆగిపోతుంది.]

భార్య : నా జోడులో బొమ్మరాయి ఇరుక్కున్నట్టుంది. కొంచెం ఆగు ఫిలిప్.

భర్త : ఏమిటి?

భార్య : చెప్పులో గాయి.

భర్త : (ఆగిపోయి) తీసెయ్యి. (ఆమె వదకు వెనక్కు వస్తాడు.) నన్ను పట్టుకో.

భార్య : (జోడు తీసి గులుపుతుంది) జోడులో ఏం లేదే! మేజోడులో ఇరుక్కుందనుకుంటాను.

భర్త : ఇక్కడెల్లా కూచుంటావ్? నేలంతా తేమగా వుంది.

భార్య : ఇదుగో, ఇక్కడ నొక్కి చూడు.

భర్త : అవును. చేతికి తగుల్తోంది.

భార్య : (ఒక్క కాలిమీద నిలబడి) నన్ను పట్టుకో.

[అతడు ఆమెను పట్టుకుంటాడు. ఆమె గౌను కొద్దిగా పైకి ఒత్తిగించి మేజోడు ఊడదీస్తుంది. ఇంతలో కారు వస్తున్న చప్పుడు.]

భర్త : చూడు చూడు. కారేదో వస్తోంది.

భార్య : అబ్బ! ఇదోటా మళ్ళీ? (అంటూ చటుక్కున గౌను లాక్కుంటుంది. చేతిలో మేజోడు అలానే వుంటుంది. కారు ఆగిన చప్పుడు.)

భర్త : మనదగ్గిరికే వస్తున్నాడు.

[ఆమె కంగారుగా వొంగుని జోడు తొడిగేసుకుంటుంది. కాని చేతిలో మేజోడు అలాగే వుండిపోతుంది.]

డెనాంట్ : (ఇద్దరినీ సమీపించి) క్షమించాలి. ఇక్కణ్నించి దగ్గిర్లో వూరికి దారి చెప్తారూ?

భర్త : మాకూ ఈప్రాంతం కొత్తే. వెనక అడిగితే తెలిసేదిగా!

డెనాంట్ : ఈ కొండెక్కాలి కాబోలే!

భర్త : అంతే ననుకుంటా.

డెనాంట్ : అలా కొండెక్కితే ఊరు కనపడుతుందేమో.

భార్య : ఆ! కనపడుతుంది. మీరు కొండెక్కి కుడివైపు తిరగండి. తరవాత ఎడమవైపు తిరగండి.

డెనాంట్ : అక్కడ మళ్ళీ అడగాలి కాబోలు. (వెళ్లబోతుంటాడు.)

భర్త : మైదానం చక్కగా వుందండి. కాదూ? గాలివాటు సుఖంగావుందండి. (చప్పబడిపోయి)

డెనాంట్ : అవునండి చాలాబాగుంది. కాస్తంత మంచుపోయి కన్ను కనపడు తోంది. అది నయమే.

భార్య : (ఎందుకో నవ్వుకుంటుంది) నిన్న మంచు మరీ దట్టంగా పట్టేసింది.

భర్త : ఊరు బాగానే వుంటుందిట లెండి.

డెనాంట్ : అవునవును. మా మేనత్త లిద్దరున్నారక్కడ. బాగానే వుంటుంది.

భార్య : (మళ్ళీ నవ్వుతుంది) మేనత్తలా? మేనత్తలుంటే బాగుంటుందా?

డెనాంట్ : అదేలెండి. ఓ మోస్తరుగా వుంటుంది. కుట్లూ అల్లికలూ చేతనవును వాళ్లకి.

భర్త : అవును. బాగానే వుంటుంది.

డెనాంట్ : వెళ్లాలండింక. సెలవు తీసుకుంటాను. నాకోసం కనిపెట్టుకుని వుంటారు. ఇదేనంటారా దారి?

భార్య : అవును అదే, ఆ పక్కనే చర్చి కనపడుతుంది.

డెనాంట్ : మావాళ్ళూ అక్కడికి దగ్గిర్లోనే వున్నారు. ఇంక వెడతానండి.

(అతనివంక దంపతు లిద్దరూ తదేకంగా చూస్తారు.)

అనువాదం :

సూరంపూడి సీతారామ్

భార్య : చలాకీగా వున్నాడు.

భర్త : మేనత్తట! ఇంక మేజోడు తొడుక్కో.

భార్య : (వొంగుని జోడు తీస్తుంది) అసలిక్కడివాడు కాడనుకుంటాను. బస్తీ మనిషేమో.

భర్త : (ఆమెని పట్టుకుని) బస్తీ మొహంలాగే వుంది. అలాటి కొంగునడుపుతున్నాడేం?

భార్య : మంచివాడే లే. మొదట నా పాదంచూసి ముఖం తిప్పేసుకున్నాడు.

భర్త : వాడికి మేజోడొకటున్నట్టు! చిత్రమైన మనిషి లే.

భార్య : అదేమిటి? నేను కనిపెట్టనే లేదే (గౌను ఒత్తిగించి మేజోడు తొడుక్కుంటూ వుంటుంది.)

భర్త : అంతేకాదు. ఆ తొడుక్కున్న దుస్తులు అతనివి కావల్లేవుంది. అరె! ఎవరు? పోలీసు కాబోలు. సైకిల్‌మీద వొస్తున్నాడు!

[ఆమె చటుక్కున మేజోడు లాగేసి గౌను లాక్కుంటుంది. మేజోడుచేత్తో పట్టుకొని జోడు తొడుక్కుంటుంది. ఒగర్చుకుంటూ ఒక పోలీసు గబగబా సైకిల్ తొక్కుకుంటూ వచ్చి ఆగుతాడు.]

పోలీసు : ఖైదీ కనపళ్లామీకు?

భర : (తెల్లబోయి) ఖైదీయా? లేదే.

పోలీసు : ఎవరూ కనపళ్లా?

భర్త : కారొకటొచ్చింది.

పోలీసు : ఏం కారు?

భర్త : ఫోర్డ్ అనుకుంటాను.

పోలీసు : అందులో ఎవరున్నారు?

భర్త : ఎవరో ఒకతను.

పో : ఎలాటి మనిషి?

భర్త : ఎవరో పెద్దమనిషి.

పోలీసు : పెద్దమనిషా? ఎల్లా తెలుసు మీకు?

భర్త : మనిషి మాటనిబట్టి.

భార్య : మాతో మాట్లాడాడు.

పో : ఏమన్నాడు?

(౫౩-వ పేజీ చూడండి)

బాబూ రావింటికి నే నెప్పుడో కాని వెళ్ళడం పడదు. ప్రతాపరెడ్డిగారి ఆంధ్రుల సాంఘిక చరిత్ర వాడు కొన్నాడని తెలియగా, అది ఓ సారి పుచ్చుకోవాలని ఆవేళ వాళ్ళింటికి బయలుదేరా. తీరా వాడింటికి వెళ్ళేసరికి తలుపులు దగ్గఱగా వేసి ఉన్నాయి. వాడింట్లో లేడేమో అనుకున్నా. అయినా ఇంట్లో కనుక్కొని పోదామని, తలుపుదగ్గఱగా వెళ్ళి కేక వేసే సమయంలో—

'ఛీ నోరుముయ్' అన్న ముక్కలు వినవడ్డాయి. వెంటనే గాజుల గలగల, ఉన్న స్థానంలోంచి ఎవరో కదలి వెళ్ళిన సవ్వడి వినవచ్చాయి. నామనస్సు ఆశ్చర్యంలో మునిగిపోయింది. ఎవరా ముక్క అన్నది? బాబూరావు అర్ధాంగేనా? ఛీ ఉత్తది. నేను పొరపాటు విన్నానా? బాబూ రావే ఆ మాటలు అన్నాడేమో! అప్పుడామె అక్కడనుంచి వెళ్ళిపోయింది కాబోలు!

తరువాత అంతా నిశ్శబ్దం. గచ్చుమీద ఒలికినపాలు దుమ్మును కలుపుకొని సవ్వడి లేకుండా ప్రాకుతూన్నట్లుంది! ఇలాంటి సమయంలో వాడ్ని పిలవాలా పిలవగూడదా?

నే నెప్పుడు వాడింటికి వెళ్ళినా, గట్టిగా వాడి పేరుపెట్టి అరచే వాడ్ని. కాని ఆవేళ 'బాబూరావ్' బాబూరావ్' అని మెల్లగా పిలచాను. అయితే బాబూరావు వెంటనే వచ్చి తలుపు తియ్యలేదు. పోనీ పలకనూ లేదు. వాడు రావటానికి రెండునిముషాలు ఆలస్యమయింది. వచ్చి, తలుపు తీసిన వెంటనే, 'ఏం: ఇలా వచ్చావ్' అని విసుగుతో అడుగుతూన్నట్టుగా వుంది వాడి ముఖారవిందం. కాని వాడట్లా అనలేదు. 'రారా. ఏమిటి విశేషాలు. ఈ మధ్యారావటం మానేశావు' అన్నాడు. నాకు మతిపోయింది. వాడి మాటలు నేను సరిగ్గా వినే స్థితిలో లేను. నామనస్సు 'ఛీ. నోరు ముయ్' అన్న ముక్కమీదే పని చేస్తూంది. అది బాబూరావు కంఠమా? లేక అతని అర్ధాంగిదా?

ఆమాటలు ఈ మాటలు అయిన తరువాత 'ఏదిరా నువ్వు మొన్న కొన్న పుస్తకం' అన్నాను. ఒక్కసారిగా వాడు నిరుత్తరుడై పోయాడు. అయితే నే నన్న



'ఏం ఇలా వచ్చావ్' అని విసుగుతో అడుగుతూ
న్నట్టుగా వుంది వాడి ముఖారవిందం.

దుక్కల్లో ఏపదంమీద వాడి మనస్సు పనిచేసిందో కాని - వాడిచూపులు ఎందుకనో లోని గుమ్మంవైపు ప్రసరించాయి. ఈ శబ్ద జాలం ఎంతవరకూ ప్రయాణం చేయగలదో పరీక్షిస్తున్నట్లుంది ఆతనిముఖం! అయితే ఈ విషయం నాకప్పుడు తెలియలేదు.

వాడు నాకు పుస్తకం ఇచ్చాడు. నేను అక్కడనుంచి వెళ్లిపోయాను.

ఇంటికి చేరుకున్నానేగాని నామనసు మనసులో లేదు. అది ఎక్కడకో వెళుతూంది. ఏదో వెదుకుతూంది. దేనికో కారణాలు వివరించమంటూంది. అనేక రకాలుగా తర్కిస్తూంది. నిజానికి ఈ మనసు ఉన్నదే బహు చెడ్డది! అది ఇతరుల చెడ్డను



శ్రీ నంది సోమరాజు

గురించి తెగ తెలుసుకోమని చంపుతుంది. పీక్కుతినేస్తుంది. పోనీ ఇందులో పెద్ద తప్పేముంది? మగవాడా మాటను—ఓ స్త్రీని ఉద్దేశించి అంటే, సహించి ఊరుకోగల స్తోమతు ఉన్న నేను-ఓ స్త్రీ, ఎంతో కలసి మెలసి తిరిగే స్నేహితురాలు, సాక్షాత్తూ భార్య, ఆ మాటను- అనేక సంవత్సరాలు అతి సాన్నిహిత్యంతో కూడుకున్న హృదయంతో, భర్త చేసిన ఏ పెద్ద తప్పునో-అట్లా అని-నిరసిస్తే మధ్య ఏమీ సంబంధం లేని పరాయిపురుషుడైన నేను, ఇంతబాధలో తపించి పోవడమేమిటి! నిజంగా స్టుపిడిటీ. ఎంతకైనా మగజాతి మగజాతే! తన జాతిమీద ఈగనైనా వ్రాలనీయదు! పాపం! నిత్యం మగవాళ్లు అనే- ఇలాంటి మాటలతో ఆడవాళ్ళెంత కుళ్ళి కృంశించిపోతున్నారో-ఒక్కసారైనా ఊహించానా?

ఇంతలో మా ఆవిడ భోజనానికి లెమ్మన్నది. అయితే ఆమె లెమ్మన్న వెంటనే నేను లేస్తానా ఏమిటి? అప్పుడు నా గొప్పతనం ఏముంది? నేనింకా దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్నాను. ఆమె 'ఫస్టుబెల్' 'సెకండ్ బెల్' అన్నట్లుగా మళ్ళీ కేకేసింది. నాకు చికాకెత్తింది. దానితో 'ఫీ. నోరుముయ్' అన్నా. అలా అన్న తరువాత నాకు నవ్వొచ్చింది. నా నవ్వుచూసి ఆమె మూతి ముడిచింది. ఇదిచూసి నాకు దీర్ఘంగా ఆపుకోలేని నవ్వు తెరుముకొచ్చింది. ఇది చూసి ఆమె మూతి విరిచింది. ఆ విరుపు చూడగానే, 'ఎందుకే భామా! ఆ మూతి నస్తమానూ అట్లా విరుస్తావు. అలా అస్తమానూ విరిస్తే, కొన్నాళ్లకక్కడ పెళుసెక్కి విరిగి పోగలదు' అన్నా. ఈసారి ఆమె సుమనోహరమైన నవ్వు సన్నగా ప్రకటించకుండా ఉండలేకపోయింది.

నేను భోజనముదగ్గిఱ కూర్చొని 'అయితే ఆవేళ ఇందిర దగ్గఱకు వెళ్ళావుగదా—మరి ఆమె ఏమి మాట్లాడిందో నాకొక్క విషయమూ చెప్పావుగాదేం' అన్నా, బాబూరావు భార్యామణి నుద్దేశించి.

మా ఆవిడ 'ఇప్పుడావిడ సంగతి మీకెందుకూ' అంది. 'అబ్బే! ఊరకనే.' అనేసి ఊరుకున్నా; చెప్పితే చెప్పులేకపోతే మానేసెయ్ అన్నట్టు. అలా అనకపోతే ఆమెచేత వాగించడం బహుకష్టం లెండి

ఇక ఆమె చెప్పడం ఆరంభించింది.

మొట్టమొదటగా, 'ఇందిర ఎంత మంచిదనుకున్నారు' అంది. నా హృదయంలో కలుక్కుమంది. అయినా వినక తప్పింది. కాదు. 'ఆవేళ వాళ్ళింటికి వెళ్ళగానే ఎంతమర్యాద చేసిందనుకున్నారు. ఫలహారాలు చేసిపెట్టింది. కాఫీ ఇచ్చింది. ఏవేవో విషయాలు బోలెడన్ని చెప్పింది పాపం! వాళ్లాయన, సినిమాలకు పుస్తకాలకు, తెగ తగలేస్తూ వుంటాడట. డబ్బు కూడ ఎవరికి బడితే వాళ్ళకు అప్పుగా ఇచ్చేస్తూ ఉండటమో, దానాలు చేసేస్తూ ఉండటమో చేస్తూ ఉంటాడట! ఇలాగుంటే ఎలాగండీ మరి! అదేమైనా సంసారమా—ఇంకేమైనానా? ఇవ్వాళ ఉంది గదా అని ఊరికే కళ్లు మూసుకొని ఖర్చుపెట్టేస్తూ ఉంటే—ముందు గతి కానొద్దటండీ! ఇదంతా చెప్పి ఆమె ఎంత బాధపడిం దనుకున్నారు? ఆమె, అంతా మంచిదే కాని, కోపం వస్తేమాత్రం మనిషి గాదండీ! ఆవేళ వాళ్ళ పిల్లాడ్ని ఎంత గట్టిగా కొట్టిం దనుకున్నారు. ఆడుకుంటూ బంతి కుళ్లుకాలవలో పారేశాడని ఎంత గట్టిగా కొట్టిందో చెప్పలేను. వాడు ఒకటే ఏడ్పు. ఇంతకోపం ఉంటే ఎలా కాపురం చేస్తుందండీ? ఏమీ ఎరగని పసిపిల్లాడ్ని బాదుకుంటే ఏమొస్తుందీ!' అని మా ఆవిడ, ప్రక్కింటావిడ ఎందుకో పిలిస్తే, ఆ ప్రసంగం అంతటితో కట్టిపెట్టి వెళ్లిపోయింది. మళ్లీ ఈ ప్రసంగం మామధ్య రాలేదు.

నిజానికి బాబూరావు అద్భుతమైన సౌందర్యమూర్తి. ఇందిర అందాలరాణి. ఇట్లాంటి జంట కుదరడం చాల అరుదు. వాళ్ళు చక్కగా ముస్తాబై సినిమాకు పోతూవుంటే, వాళ్ళముందునుంచి పోయే వాళ్లు అప్పటివరకూ చూసింది చాలక వాళ్ళను దాటినతరువాత కూడ, కళ్ళు వెనక్కి కాళ్లు ముందుకీ పోనిస్తూ ప్రాణాల్ని సైతం లెక్క చెయ్యరు!

బాబూరా వెంత అందమైనవాడో అంత శాంతగా ఉంటాడు. అతని కంఠస్వరం విన్నవాడు భార్యతో ఇట్లాంటి మాట అనిపించుకుంటాడని కలలో కూడా అనుకోడు. మా ఆవిడ చెప్పినదాన్నిబట్టి ఎంతాలోచించినా, బాబూరావు భార్యమాట వినేవాడిలా కనుపించలేదు. ఆమెకు నిజంగా లొంగినవాడైతే ఆమె వద్దంటున్నా అట్లాంటి పను లెందుకు చేస్తాడు? అయితే ఆవేళ పుస్తకం ఇచ్చేటప్పుడు అట్లా చూసా డేమిటి? అప్పటికి జరిగిన మాటలమీదే నిలచిన ఆతని మనసు—ఆ మాటల మీదే పనిచేస్తూ అటువైపు చూపు నిలిపిం

★ నియంతృత్వం ★



అబ్బాయి :- అమ్మా! మా స్కూల్లో జరిగే పరుగు పందాలలో నా పేరుకూడా ఇచ్చాను.

అమ్మ :- ఇస్తే ఇచ్చావుగాని నెమ్మదిగా పరిగెత్తునాయనా; లేకపోతే ఏ కాళ్లో విరగ్గొట్టుకుంటావు.

దేమో! ఏమైనా వాడట్లాంటి మాటలు పడే మనిషిమాత్రం కాడు. ఎంచేతనో నా హృదయం ఈ విషయం ఋజువుచేసుకోమని బాధించడం మొదలుపెట్టింది. నిజానికిందులో ఒకర్ని ఒకరు తిట్టుకున్నారని కాదు కాని - అసలిల్లాంటి పరిస్థితికి ఎవరు కారకులై ఉంటారా అన్నది నాకు పెద్ద సందేహమై పోయింది.

అప్పటినుంచీ వాడితో ఎప్పుడు మాట్లాడినా - వాడ్ని జాగ్రత్తగా పరిశీలించడం మొదలు పెట్టా. కాని వాడెప్పుడూ తన ఇంటిసొద నా దగ్గర తేలేదు. ఆమె అంత ఏడిపించేదైతే, ఎప్పుడైనా ఏవిషయంమీదనైనా కొస్త కాకపోతే కొస్తయినా ఆమెపై ఉన్న అసహ్యమైనభావాన్ని వ్యక్తం చెయ్యకుండా ఉంటాడా అని నా అంతరాత్మ బాధించడం మొదలుపెట్టింది. కనీసం ఆమెను కాకపోయినా, ఇతర ఆడవాళ్ళనైనా ఆ బాధతో తిట్టకుండా ఉంటాడా అనికూడా వ్యథపడింది. ఓ రోజున నేనే ఏదోసందర్భంలో 'మా మిా ఇందిర చాలమంచిదని చెప్పిందోయ్! అవిడ, అల్లాంటి మర్యాద ఆమె మాయింటికి వస్తే తను చెయ్యలేనని కూడా. చెప్పింది' అని చెప్పి చూశా 'ఇల్లాంటి మర్యాద మీకూ మీకే గాని నాకేం చెయ్యదులే' అని ఏమైనా అంటాడేమోనని. కాని అతని దగ్గరనుంచి ఓ చిన్ని కనిపించీ కనిపించని నవ్వు తప్ప మరేమీ జవాబు పొందలేక పోయాను.

మరో రోజున, 'అబ్బబ్బ! ఈ ఆడవాళ్ళతో చచ్చిన చావోయ్. వేగలేక పోతున్నాను. ఇంటికి వెళ్లితే యమయాతన అనుకో. నిజంగా అనుకూలదాంపత్యానికి ఎంత పెట్టి పుట్టాలి! నువ్వు నయంరా. హాయిగా ఏ గొడవా లేకుండా ఉంటావు. దేనికైనా ఆ మాత్రం అర్థం చేసుకోగల భార్య ఉండటం నిజంగా భర్త అనే ప్రాణికి ఎంతసుఖం!' అన్నా; ఇప్పుడైనా—"ఆ...అ. అందరాడవాళ్లూ ఒక్కటే లేవోయ్"అని అంటాడేమోనని! కాని అబ్బే! వాడినోటివెంట అట్లాంటి మాట రానిదే! మళ్ళి మునుపటిలాగే ఓ నవ్వు బహుతమాషగా నవ్వేసి ఊరుకున్నాడు. ఇంత గుట్టుగా ఉంటేవాడి దగ్గర ఇంకీవిషయం గ్రహించటం ఎట్లాగో నా మనసు ఊహించలేకపోయింది.

ఇట్లా ఉండగా ఓ రోజున బాబూరావు మా ఇంటికి వచ్చాడు. వచ్చీరాగానే 'భయంకరం! ఇవ్వాళ చూశావా గూడ్సు బండిని ఢీకొని ప్యాసెంజరు బండి ముక్కముక్కలైపోయింది. ఎంతమంది చచ్చిపోయారో లెఖ్ఖలేదు' అన్నాడు.

నేనా భయంకరమైన దృశ్యాన్ని చూసి అప్పుడే ఇంటికివచ్చాను. 'అవును పాపం! చాలమంది చచ్చిపోయారు. ఒక్క మనిషి చేసే చిన్ని పొరపాటుకు ఎంతమంది ఆహుతి కావలసివస్తోందో' అన్నా. ఇది వింటూనే బాబూరావు, 'ఇవ్వాళ నారాయణరావు పూనా ప్రయాణం. వాడ్ని ప్రక్క స్టేషనుకు తీసుకువెళ్ళి ఎక్కించి వస్తున్నా. నిజానికి వాడి గుండెలు పీచు పీచుమంటూనే ఉన్నాయి. వాడితో అన్ని ట్రైనులూ గుద్దుకోవులేరా; అపాయాలు వచ్చేముందు కొన్నింటికి సర్దుకోగల తాహతు ఉంటుందిలే అని చెప్పి-ప్రయాణం ఆపుకోకుండా చేశాను.' అన్నాడు. ఇలా వాడంటూవుంటే నా మనస్సులో ఇథమిద్ధమనరాని భావమేదో కలిగి, చప్పున బయటనుంచి పాలవాడు వేసేకేకతో అణగారిపోయింది.

పాలవానికివ్వవలసినదేదో నేను పర్సు తీసి ఇస్తూవుండగా బాబూరావు 'అబ్బ! ఈ పర్సు నీదగ్గర ఇంకా ఉందిరా? మెడ్రాసులో మనిద్దరమూ ఆరోజున ఒకే రకం పర్సులు కొన్నాము. నా పర్సు మా చుట్ట మొకాయన కాజేశాడు. నీకు వీలుగా ఉంటే. ఇది నాకిచ్చేద్దూ' అన్నాడు ఏక బిగిని.

వాడిలాంటి వడగటమూ నే నివ్వక పోవడమూ ఎప్పుడూ జరగదు కాబట్టి 'ఏం. నీకంతగా కావలిస్తే తీసుకో' అన్నా. వాడు చప్పున 'థేంక్సురా' అంటూ పెద్ద కొండ దొరికినట్లుగా అందుకున్నాడు ఆ తరువాత 'ఇప్పుడు నాకు కొస్త పనొచ్చింది. ఓ యాభైరూపాయిలుంటే ఇలా ఇయ్యి. రేపు ప్రొద్దున్నే ఇచ్చేస్తాను.' అన్నాడు. ఇట్లా వాడెప్పుడూ ఎవ్వరినీ డబ్బు అడిగిన పాపాన పోలేదు. అట్టి ఛాన్సు నాకు రావడం నా అదృష్టంలా భావించుకొని, 'ఓ. తప్పకుండా!' అంటూ వాడికి ఆ డబ్బు ఇచ్చి పంపించాను. ఇక ఆరోజంతా వాడికి డబ్బెందుకు కావలసివచ్చిందా అనే ఆలోచించాను. కాని అంతు చిక్కలేదు.

ఆ మర్నాడే వాడా డబ్బుతీసుకొచ్చి నాకిచ్చేశాడు. 'అరె అప్పుడే ఇచ్చేసేవే!' అన్నా, ఇలా అనడం భావ్యం కాబట్టి. ఎందుకనో వాడింత త్వరగా బాకీ తీర్చివేయడం నా మనస్సుకు తృప్తి నీయలేదు.

ఆ తరువాత వాడూ నేనూ ఎప్పుడో కాని కలవడం పడలేదు. అది వాళ్ళింటి దగ్గర జరిగింది. మేమిద్దరమూ మాట్లాడుతూవుండగా, ఇందిర నవ్వుతూ వచ్చి కాఫీ ఇచ్చింది. నా మనసులో అప్పుడే వేవో విషయాలు గింజుకున్నాయి. అంత సుప్రసన్నమైన వదనంకల ఆమె నోట నుంచి ఛస్తే ఎప్పుడూ అంట్లాంటి మాట రాదని మనసులోని మనసు ఘాటుగా చెప్పింది.

ఇంతలో నారాయణరావు పెద్దగొడవగా లోపలికి వచ్చాడు. పెద్ద బెడ్డింగూ అదీ రిక్షావాడు లోనికి తీసుకవచ్చాడు. 'అబ్బ! వెధవ ప్రయాణం చావురా బాబూ. ఈ థర్డు క్లాసు ప్రయాణమంత చావు మరొకటి లేదు.' అంటూ కుర్చీలో కూలబడ్డాడు. బాబూరావు 'ఏరా. ఇన్నాళ్లుండిపోయేవేం? అప్పుడే వచ్చేస్తానన్నావు' అంటూ పరామర్శించాడు. 'అబ్బో బోలెడంత గ్రంథం జరి

నియంతృత్వం

గిందిలే. ముందు ఆ రిక్షావాడికి డబ్బు లిచ్చేయ్' అన్నాడు. బాబూరావు పర్సు తీసి సైలెంటుగా ఆ రిక్షావాడికి డబ్బు లిచ్చి పంపించాడు. ఇంతలో నారాయణ రావు బాబూరావు చేతిలోని నా పర్సు చూసి, 'అరె! నీకు మళ్ళీ ఈ పర్సు ఎట్లా దొరికింది? అదేనా...ఏదీ ఇలా ఇయ్యి... అవును అదే...బలే లక్కీ ఫెలోవే! ఆ యాక్సిడెంటులోనే దొరికిందా? నీకిలాంటి పర్సు కొని పంపాలని పూనాలో చాల ప్రయత్నించాను. కాని ఇలాంటిది అక్కడెక్కడా కనిపించలేదోయ్......అయితే ఇంతకీ ఇది ఎలా దొరికింది?' అని వాడు ఏకబిగిని వాగేస్తూ వుంటే బాబూరావు కాస్సేపు బిత్తరచూపులు చూస్తూ కూర్చుండిపోయాడు. నారాయణరావు అన్న మాటలు ఇల్లంతా ప్రతిధ్వనించాయి. అయినా ఈ మాటలు ఈ దళసరిగోడలు దాటి ఎంతదూరం పోగలవో తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నట్లుంది బాబూరావు ముఖము. బాబూరావు బాధ నిజంగా వర్ణనాతీతము. నావైపు వాడెంతో ఆమాకంగా చూశాడు. అలా చూసి నారాయణరావుతో మెల్లిగా, 'ఇది ఆవేళ, అక్కడే ఆ కొట్టుదగ్గరే దొరికిందిరా' అన్నాడు. అప్పుడే ఇందిర నారాయణరావుకు కాఫీ తీసుకొచ్చింది. ఈమాట ఆమె విన్నందుకు బాబూరావు మొగము తృప్తిని ప్రకటించింది. కాని ఇందిర నారాయణరావుతో, 'ఏమో అన్నాయ్! అది నిజంగా పోయే వుంటుంది. ఈయన ఇంకొకటి కొనే ఉంటారు' అంది. వెంటనే బాబూరావు 'ఛీ. నోరుముయ్' అన్నాడు. ఆమె లోనికి వెళ్ళిపోయింది. నారాయణరావు పకపకా నవ్వుతూ 'ఇది అలా దొరికే పర్సు కాదులే అమ్మాయ్' అంటున్నాడు.

ఇక నాగురించి బాబూరావు యమయాతన పడుతున్నాడు. నే నిక అక్కడ ఉండడం బాగుండదని 'వస్తా' నంటూ అక్కడనుంచి మెల్లగా జారుకున్నా.

నే నింటికి పోతూవుండగా బాబూరావునుగురించి నా కనేకమైన విషయాలు తట్టాయి. అయితే ఇక అవన్నీ మీకు కూడ కలగటంలో ఏమాత్రం అనుమానం లేదు. కాని 'పాపం! బాబూరావు ఎటువంటి నియంతృత్వపు బందిఖానాలో ఇరుక్కుపోయాడో!' అని మాత్రం మీరూ నేనూ విచారించక తప్పదు! అయితే అతని కా బాధ లేదులెండి! నిజానికిదేగా మనకు కావలసింది! ★

ఒకటో తారీఖు

శ్రీ జి. వి. జి. కృష్ణ

"ఏమిటోయ్ విశ్వం!...పోయిన నెలదీ, ఈ నెలదీ క్లబ్ చందా ఇంకా ఇవ్వలేదే నువ్వు" అని తోటి ఉద్యోగి పరమానందం పల్కరించేసరికి, అంతవరకూ ఫైలుకు అంటుకొనిపోయి వున్నవాడల్లా తెప్పరిల్లి, మళ్ళీ ఈ లోకానికొచ్చి పడి "ఎక్కడా!...జీతం డబ్బులు రానిదే!" అని పరమానందం కళ్ళల్లోకి జాలిగా చూశాడు.

"ఏంటీ!...నువ్వింకా జీతం తెచ్చుకోలేదేమిటీ?... ఇస్తున్నారోయ్... పద... చప్పునపోయి తెచ్చుకో" అని పరమానందం చెప్పేవరకూ, ఆ సంతోష సమాచారం చెవిలో పడ్డందుకు, ఒక్క క్షణకాలం కుర్చీమీద అలాగే మూర్ఛిల్లిపోతే బాగుండు ననిపించింది విశ్వానికి.

ఊరడిల్లి లేచి వెళ్ళి జీతం రాళ్ళు తెచ్చుకొని తన కుర్చీలో కూర్చొని లెక్కపెట్టుకొంటున్నాడు విశ్వం.

"జీతం పుచ్చుకున్నారేమిటి!... ఇప్పుడే ఇంటిబాడుగ ఇచ్చేస్తారా" అంటూ లేని నవ్వును తెచ్చుకొని విశ్వం టేబిల్ దగ్గర కొచ్చాడు వినాయకరావ్. తోటి ఉద్యోగి ఇంట్లో కాపురముంటే ఇదొక అవస్థ. మారు మాటాడక రెండు పది రూపాయల నోట్లను అతని చేతిలో పెట్టి, రసీదు పుచ్చుకొని ఒకపీడ విరగడ చేసుకున్నాడు విశ్వం.

"ఏంటి విశ్వం! నువ్వు కూడా అలా బెల్లం కొట్టిన రాయిమల్లే, చెవిలో వేసుకోకుంటే, పాపం...అర డజన్ బిడ్డలు గలవాడు. వాడి గతి ఏమైపోవాలి" అంటూ హెడ్ క్లర్కు—కూర్చున్న చోటినించే విశ్వంతో అన్నాడు.

అసలు సంగతేవిటో సరిగ్గా అర్థమయి చావక, కాస్సేపు తికమకలు పడ్డాక "ఏంటండీ!" అని క్వశ్చన్ మార్కు మొహంతో ప్రశ్నించాడు విశ్వం.

"ఇంతకీ నీకు తెలీదేమిటీ - మన ప్యూను సుబ్బరాముడు, ఆఫీసు సైకిల్ పోగొట్టుకున్న సంగతీ?" అని అడిగాడు హెడ్ క్లర్కు.

తెలీదన్నట్లు శిరఃకంపనం చేశాడు విశ్వం.

"మొన్న మధ్యాహ్నం ఆ దరిద్రుడు బేంకుకు వెళ్ళినప్పుడు, సైకిల్ బయటనే పెట్టి లోపలికి వెళ్ళాడట. పనంతా ముగిశాక బయటికొచ్చిచూస్తే అక్కడ సైకిల్ లేదు—ఎవరో కొట్టేశారు. వీడే దాన్నెక్కడో అమ్మేసి ఈ ఎత్తు వేసివుంటాడని మన బాస్ అంటున్నాడు. పైగా వాడిమీద రిపోర్ట్ కూడా ఇవ్వమంటున్నాడు. పాపం, సుబ్బరాముడు అలాటి వాడు కాదు... నేనీ ఆఫీసులో అడుగెట్టినప్పట్నించి వాడ్ని బాగా యెరుగుదును. అంచేత మన మందరమూ తలా కొంత చందా వేసుకొని ఏదో ఒహాటి చేయకపోతే వాడి సంసారంమీద రాయి పడుతుంది. ఇంతవరకూ సీతాపతిరావ్ గారు ఓ పది ఇచ్చారు. నేనూ ఒహ పది కలిపాను. నువ్వు ఎంత ఇస్తావో—ఇప్పుడే చేతిలో డబ్బుండేటప్పుడే ఇచ్చేసెయ్......వాడి సంసారాన్ని నిలబెట్టిన వాళ్ళమౌతాం" అని తన మామూలు ధోరణిలో ఓ పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు.

సందిగ్ధావస్థలో పడివున్న విశ్వం, ఏమాత్రం ఆలోచించేందుకు ఆ శక్తిలేనివాడౌటంచేత, వెంటనే లేచివెళ్ళి జేబులోంచి ఒక ఐదురూపాయల నోటు తీసి హెడ్ క్లర్కు టేబిల్ ముందుంచి వచ్చి యథాస్థానంలో కూలబడ్డాడు. ఆ అయిదు రూపాయలనూ సంతోషంతో పుచ్చుకొని, డ్రాయర్‌లో వేస్తూ "వెరీమెనీ థాంక్స్!" అన్నాడు హెడ్‌క్లర్కు.

విశ్వం మెదడులో ఎన్ని ఆలోచనలున్నా, ఓపిక లేకండా వుంది. అతను మాత్రం ఎన్ని విషయాలు ఆలోచించగలడూ? ఆ ఆలోచనలు ఒకటి కొకటి క్లాష్ అయితు తునియలు ఐపోవాల్సిందే కానీ విశ్వంమాత్రం వాటినిగురించి ప్రత్యేక శ్రద్ధతో ఆలోచించడు. అతని మనస్తత్వం అది.

★

"ఏంటోయ్!... తెచ్చుకున్నావా జీతం" అంటూ మళ్ళీ దాపురించాడు పరమానందం. "ఆఁ" అని జేబులోంచి నాలుగు రూపాయలు తీసి అతని చేతిలో పెట్టాడు. "థాంక్స్" అని అందుకొని రసీదురాసిచ్చి "ఇంకా ఏంటోయ్ కుర్చీకి అంటుకొని కూర్చున్నావ్—ఐదు గంటలు దాటిపోతేనూ...ఇహ చాలు రావోయ్ పోదాం. ఏది శాశ్వతం" అంటూ విశ్వం చేతులుపట్టి పైకి లేవదీశాడు పరమానందం. విశ్వం డ్రాయరుబీగం వేసి పరమానందాన్ని అనుసరించాడు.

ఇద్దరూ రోడ్డెంబడి నడిచిపోతున్నారు. "కాస్త కాఫీ పుచ్చుకుందాం రావోయ్" అని విశ్వాన్ని ఒక హోటల్‌లోకి పిలుచుకొని వెళ్ళాడు పరమానందం. ఇద్దరూ ఒక టేబిల్ ముందు కూర్చున్నారు. రెండు

★ ఒకటో తారీఖు ★

బోండాలు తెప్పించాడు పరమానందం. ఇద్దరూ తింటున్నారు...

"హల్లో! అదేంటి గాలీ, వానా ఒక చోట చేరిందే" అంటూ కామేశం ప్రవేశించి వాళ్ళప్రక్కన ఒక ఖాళీకుర్చీ వుంటే దానిమీద కూలబడ్డాడు. అతనూ రెండుబోండాలు తెప్పించుకున్నాడు. తర్వాత మూడుకాఫీలకు ఆర్డరిచ్చాడు పరమానందం.

"ఈవేళ మన ముగ్గురిలో లక్కీపర్సన్ ఎవరో తేల్చుకోవాలి" అన్నాడు కామేశం.

అతని భావం గ్రహించిన పరమానందం "మన విశ్వమే లేవోయ్!" అన్నాడు.

"ఒకవేళ నువ్వు కాకూడదూ? ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలిసేడ్చింది నా తండ్రీ!" అంటూ జేబీనించి ఒక కాగితం తీసిదాన్ని మూడుముక్కలుగా చింపి ముగ్గురిపేర్లూ ఒక్కొక్క దానిలో రాసి చుట్టచుట్టి బాగా కలిపాడు కామేశం.

"ఆఁ...వీటిలో ఏదో ఒక కాగితాన్ని ఎత్తవోయ్" అని పరమానందం అన్నాడు.

"ఎత్తితే!!" అని తికమకలు పడుతూ ప్రశ్నించాడు విశ్వం.

"ఎవరి పేరుంటుందో? వాళ్ళిచ్చుకోవాలి ఈ బిల్లు డబ్బులు" అంటూ అందుకున్నాడు కామేశం.

"ఊఁ...ఎత్తూ" అంటూ కాఫీ త్రాగుతూ—తొందర చేశాడు పరమానందం.

ఒకవేళ తన పేరు రాకపోతే పన్నెండణాలు దక్కుతుందికదా అని ఆశపడి విశ్వం ఒక కాగితం తీశాడు. ఆత్రంతో విప్పిచూశాడు. మెరుపు తీగలా మెరిసింది తన పేరు. క్షణమాత్రం అతని కన్ను చెదిరిపోయింది.

"కాఫీ పుచ్చుకోవోయ్-ఏది శాశ్వతం" అన్నాడు పరమానందం ఆఖుక్కడు కాఫీ నీళ్ళు గొంతులో పోసుకొని, బయటికి వచ్చాడు ఇద్దరు మిత్రులతోనూ. చచ్చినట్లు పన్నెండణాలు చెల్లించి బయటపడ్డాడు విశ్వం.

"వస్తానురోయ్...మా బావమరిది క్లాక్ టవర్ దగ్గర నాకోసం వెయిట్ చేస్తుంటాడు" అని వాళ్ళ జవాబుకు ఎదురుచూడకనే చల్లగా జారుకున్నాడు కామేశం.

"నువ్వటోయ్? ఇంటికేనా?" అడిగాడు పరమానందం.

"ఆఁ...నువ్వూ?"

"పిక్చర్ కెళ్దామనుకుంటున్నానోయ్. నువ్వూ వస్తావా?"

"సారీ. ఇంటిదగ్గర బోలెడు పనులున్నాయోయ్. నువు వెళ్లు" అని అతని ప్రత్యుత్తరానికి ఎదురు చూడక మెల్లిగా తప్పించుకున్నాడు విశ్వం.

మెయిన్‌రోడ్ మీద నడిచి వెళ్ళుతున్నాడువిశ్వం. తలలో ఏదో పోటు బయలుదేరింది. కాళ్ళల్లో ఆనికాయలు బాధపెట్టూ నడవనీకుండా చేస్తున్నయ్. బలవంతంగా అడుగుల్లో అడుగులేసుకుంటూ నడిచి వెళ్లుతున్నాడు విశ్వం. మనసులో ఏవేవిటో ఆలోచిస్తున్నాడు-అతని మనసులోని బాధ లేవిటో, అతనికే తెలీనప్పుడు నాకెలా తెలిసేడుస్తుందీ—రాసేడిసేటందుకు?

"పంతులుగోరూ!" అని వెనకనించి కేక వినపడ్డది. తృళ్లిపడి వెనుదిరిగి చూశాడు విశ్వం.

"జీతాలు వచ్చేసినాయిటగా" అని అంగడిలో నల్లటి విగ్రహంలా కూర్చొన్న పేరయ్యశెట్టి, చిఠ్ఠాపుస్తకం తెరుస్తూ గొణిగాడు.

"మరేనండీ" అంటూ దగ్గరికొచ్చి "ఎంతయిందండీ" అని అడిగాడు విశ్వం.

"ఈ నెలలో చాలా తక్కువేనండీ...ఇరవైమూడు రూపాయల అణాన్నర" అని పేరయ్యశెట్టి అనగానే, ఇరవైఅయిదు రూపాయలు తీసి అతని చేతిలో పెట్టాడు.

"చిల్లర ఇవ్వమన్నారా—అడ్వాన్సు కింద మీ ఖాతాలో జమరాయనా" అని అడిగాడు పేరయ్య శెట్టి.

"అక్కర్లేదు...చిల్లర యిచ్చేయండీ" అని చిల్లర పుచ్చుకొని, తన నడక సాగించాడు విశ్వం.

ట్రామ్ టెర్మినస్ దగ్గరకు వచ్చేవరకు కానీ, అతనికి తను ట్రాంలో ఇంటికి వెళ్లాలన్న సంగతి జ్ఞప్తికి రాలేదు. మనీపర్సు తెరిచి ట్రామ్‌పాస్ చూసుకున్నాడు. దాని డ్యూ డేట్ ఈ వేళతో అంతమౌతుంది. మళ్లీ వేరే పేస్ కొంటే కానీ, రేపు ట్రాంలో ఆఫీసుకి రావడానికి వీలు లేదు. అన్ని అవసరాలలో ఇది అతి ముఖ్యం గనక, వెంటనే దగ్గర నేవున్న సీజన్ టికెట్సు ఆఫీసు కెళ్లి, ఆరున్నర రూపాయలు చెల్లించి కొత్తపేసు తెచ్చుకున్నాడు విశ్వం. దాన్ని మనీపర్సులో పెట్టుకోబోతూ, డబ్బెంత మిగిలిందో చూసుకున్నాడు. నెలరోజులూ గాడిద చాకిరి చేసి సంపాదించిన అరవై రూపాయలూ అర్థగంటలో ఇత్తైకరిగిపోయింది. పదిన్నరణాలు

ఒకటో తారీఖు

మిగిలివుంది అతన్ని వెక్కిరించేందుకు. ఆ పరిస్థితుల్లో నాకయితే కళ్లు చెమ్మగిల్లేవి కానీ, గుండెనిబ్బరంగల మనిషవడంచేత, విశ్వానికి అలాటిదేమీ కలగలేదు. అతని జీవితంలో ఎన్నో కష్టాలు గడిచాయ్. వాటిలో ఇది ఏమాత్రం. ఇంతకీ రోజా చచ్చేవాళ్ళకు ఎవరేడుస్తాంటారు.

కాస్సేపట్లో ట్రాం రానే వచ్చింది. మంద లాగా ప్రోగయివున్న జనమంతా ఒకరి నొకరు తోసుకుంటూ జొరబడుతున్నారు ట్రాంలోకి. విశ్వంకూడా వాళ్లను అనుసరించాడు. ఎలాగైతే నేం, ఆ తోకు నూకళ్ళల్లో అతనికి నిలుచుకోటానికైనా దొరికింది.

ట్రాం బయలుదేరింది. పాపడికి బిస్కట్లు కొనుక్కొని పోవాలనిఅనుకుంటున్నాడు విశ్వం.

"టికెట్?" అన్నాడు కండక్టరు— విశ్వానికేసి చూస్తూ.

"పేస్ ఉంది!" అని జవాబిచ్చాడు విశ్వం.

"ఏంగే?" చూపించమని అడిగాడు కండక్టర్.

విశ్వం జోబీలోకి చెయి పోనిస్తే అక్కడేముంది? ఎప్పుడో ఎవడో కొట్టేశాడు తన పర్సు. లాగు జోబీలన్నీ తడివాడు విశ్వం. అదక్కడ ఉంటేగా అతనికి దొరికేందుకు?

"పోదుం పోదుం...ఇందట్రామా ఎల్లా నాపా త్తిరికేం...పెరియ జెంటిల్ మేన్లా వీరి వందిటాంగో...ఎరంగుడుంగో" అని గర్జించాడా కండక్టర్. విశ్వం వెనకాల ఎవ్వరో నవ్వుకుంటున్నారు. కండక్టర్ కు జరిగిన సంగతేమిటో, ఉన్నదున్నట్లు చెప్పుదామనుకున్నాడు కానీ, ఆ పరిస్థితుల్లో తానేమి చెప్పినా వాళ్లు వినేటట్లు లేనందున సిగ్గుతో తలవంచుకొని ట్రాం దిగేశాడు. ట్రాం బర్రున వెళ్లిపోయింది. బరువెక్కిన హృదయంతో విశ్వం కాలినడకనే ఇంటి మొహం పట్టాడు చచ్చినట్లు.

రెండురోజులు గడిచాక విశ్వం ఆఫీసులో కూర్చొనుంటే "నీకు ఏదో పార్సెల్ వచ్చిందోయ్ విశ్వం!" అంటూ కేకేశాడు పరమానందం...

"నాకా?"అని నమ్మలేక ఆశ్చర్యంతో ప్రశ్నించేడు విశ్వం...

"విశ్వం నువ్వు కాదేమిటి? వేళాకోళం ఆడుతున్నాననుకున్నావా?" అని సీరియస్ గా పరమానందం అనేసరికి, లేచివెళ్లాడు గేట్ దగ్గరికి. పోస్ట్ మేన్ అతనికి ఒక పార్సెల్ ఇచ్చాడు. అదెక్కడ్నించి వచ్చిందో అని ఆత్రంలో త్రిప్పిచూశాడు. "*From:*—పాంప్యన్... పాండీబజార్" అని వుంది. రసీదుమీద సంతకం పెట్టేసి, ఆ పార్సెల్ లోనికి తెచ్చి తన సీటులో కూర్చొని విప్పాడు. తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు విశ్వం. అది మొన్న ట్రాంలో పోగొట్టుకున్న అతని మనీపర్స్. ఒక చిన్న ఉత్తరం క్రింద పడింది. దాని నందుకొని చదివాడు.

దాని తెలుగు పరివర్తనం ఇది...

(25-వ పేజీ చూడండి)

దేవుడికీ దెయ్యానికీ భేదం లేదు

వేదవాక్యం వేద వాక్యమే- కాని దానిలోనే భేదవాక్యాలు ఉన్నాయి - వేదంలో అనేక ఋక్కులయందు "అసుర" అనే మాటకు దేవతలలో చేరినవాడని అర్థం కనిపిస్తోంది. దేవతలలో ఉత్తముడైన దేవతకు అసురుడు అనే మాట వాడబడి ఉన్నది. ఋగ్వేదంలో 10 మండలంలో 124 ఋక్కులో "వరుణ అసుర" అని చెప్పబడి ఉంది. వరుణ దేవుడు అసురుడని అర్థం- కాని, యీ ఋగ్వేదంలోనే మరికొన్ని ఋక్కులలో దేవతలకు "సురలు" అనే మాట వాడబడింది.

మన పురాణాలలో "అసురులు" అనే మాటను "రాక్షసులు" అనే అర్థంలో ఉపయోగించారు. సురలు అంటే దేవతలు అనిన్నీ, "అసురులు" అంటే "సురలు కానివారు" అనగా "రాక్షసులు" అనిన్నీ అర్థంచేసి, ఆ ప్రకారంగా ఉపయోగించారు. "అసు" అంటే "ప్రాణం" అనే అర్థంగల మూల ధాతువులో నుంచి అసుర శబ్దం పుట్టింది. కాని, యీ వ్యుత్పత్తిఅర్థం కాలక్రమేణ పోయింది.

మన వేదాలలోని దేవతలు కొందరు, పారసీ మతస్థులకు ప్రమాణమైన "ఛందో అవస్థా" గ్రంథంలో రాక్షసులుగా చెప్పబడినారు. ఉభయ మతాలకు మధ్య ఏర్పడిన తగాదాల వివాదాలవల్ల కొంత కాలానికి ఈ 'అసురులు','సురులు'అనే మాటలు తారుమారైనాయి-మనుష్యులలో భిన్నమతాలు ఏర్పడి, వారి దేవుళ్లు వీరికి దెయ్యాలు, వీరి దెయ్యాలు వారికి దేవతలు అయినట్లుగా అసుర శబ్దం కూడా వేదాలలో కొంత కాలానికి తల్లక్రిందులైంది. "దెయ్యం" అనే మాట కూడా "దైవం" అనే మాట యొక్క మరొక రూపం - బ్రహ్మ ముఖంలో నుంచి వచ్చిన వేదం కూడా తికమక పడింది ఈ విషయంలో.

ధర్మసూక్ష్మం

నిజానికి వడ్లగింజలోది బియ్యపుగింజ! అసలు - ధర్మమనే పదార్థమే అలా అతి సూక్ష్మంగా ఉంటుందేమో! అందరూ నిత్యకృత్యంగా భావించే దానిలోనించే ఒక్కొక్క మహా పురుషుడికి ఒక్కొక్క ధర్మరహస్యం చిత్రంగా స్ఫురిస్తూ ఉంటుంది. ఉప్పు సత్యాగ్రహం సంగతి చూడండి—గాంధీ మహాత్ముడు దండిసత్యాగ్రహానికి నడుం కట్టి బయలుదేరే వరకూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని హడలుకొట్టగల మహత్తరమైనశక్తి కానీ అయినా ఖరీదు చెయ్యని చిట్టెడు ఉప్పు తయారు చెయ్యటంలో ఇమిడి ఉందని ఎవ్వరైనా ఊహించారా?

అసలు జరిగిన సంగతి :

రోజూలాగ అయిదుగంటలకు ఆఫీసు విడవగానే 13 వ నంబరు బస్సులో కూలబడి కొంపచేరుకుంటే ఏ గొడవా లేకపోయేది! కాని, జీతండబ్బులు చేతిలో పడ్డరోజవటం మూలాన ఆడవాళ్ళకి పువ్వులూ, పిల్లలకు బిస్కట్లూ గట్రా కొనుక్కుపోదామనే సరదా పుట్టి, అవాళ చైనా బజారు వెళ్ళాను. అక్కడ అవీ ఇవీ కొనుక్కోటానికైనా సేపెంతో పట్టలేదు. మళ్ళీ ఆరు గంటలయ్యేసరికి హైకోర్టు దగ్గిర బస్ టెర్మినస్‌కి వచ్చేసి, మైలపూరు బస్సులో సీటు సంపాదించాను. కాని, ఆరు గంటలకు బస్సులో ఎక్కినవాణ్ణి రాయపేటలో కొంప చేరుకునేసరికి తొమ్మిది గంటలు తంగున కొట్టారు. త్రోవలో చెడిపోవటం గాని, కారు క్రింద ఎవరైనా పడటంవంటి సంఘటన గాని ఏదీ జరుగకపోయినా, ఆ గవర్నమెంటు ట్రాన్స్‌పోర్టు బస్సు ఆ రోజున హైకోర్టు దగ్గిర బయలుదేరిన మూడు గంటలకుగాని రాయపేట చేరుకోలేకపోయింది.

బస్సు చైనాబజారు స్టాప్ దగ్గిరికి వచ్చి నిలిచీ నిలవగానే 15, 20 మంది ఒక్కసారిగా జుమ్మనుంటూ తేనెటీగల్లాగ బస్సు మీదికి ఎగబడ్డారు. బస్సు వెనుక గేట్ దగ్గిర కండెక్టరు నుంచుని 'ఎట్టుపేర్ ఏరుంగో' (ఎనమండుగురు ఎక్కండి) అంటూ ఒక్కొక్కళ్ళే లోపలికి విడుస్తూ ఒణ్ణు, రెణ్ణు, మూణు అని లెక్కపెట్టుకుంటున్నాడు. ఇంతలో మధ్యవయస్సులో ఉన్న ఒక లలనారత్నం ఒక కన్నెపడుచును వెంటబెట్టుకుని ముందు గేట్లోనుంచీ చరచరా బస్సులోకి ఎక్కేసింది. బస్సు డ్రైవరు "ఇంగె ఏరాదమ్మా—పిన్నాలే పో అమ్మా" అని అరుస్తున్నా ఆమె లక్ష్యం చెయ్యలేదు. బస్సులో ఎక్కగానే ఇద్దరు నవనాగరిక యువక విద్యార్థులు తమ సీట్లు ఖాళీచేసి, అతిమర్యాదగా ఆ అబలాద్వయానికి ఆసనదానం చేశారు. కండెక్టరు తన లెక్క ప్రకారం ఎనిమిదిమందీ ఎక్కగానే వెనకవాళ్లని "ఎరంగిడు అప్పా!—ఎడమిల్లె అప్పా! పిన్నాలే బస్సువరది" అంటూ బలవంతాన ఫుట్ బోర్డుమీదనుంచి దించేసి "రైట్! పో అప్పా!" అని ఈలవేశాడు.

కాని, అప్పటికే డ్రైవరు తన సీటులోనుంచి దిగివచ్చి ఆ స్త్రీలను దిగిపొమ్మని జబర్దస్తీ చేస్తున్నాడు. ముందుగేట్లోనుంచి ఎక్కటం రూలుకి వ్యతిరేకమనీ, ఎక్కేవాళ్లందరూ వెనుకగేటునుంచే ఎక్కాలనీ, ముందుగేటు దిగేవాళ్ళకోసమేననీ చెప్పి ఎలాగైనా వాళ్ళని దించెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు. డ్రైవరు అరవం కొంతకి కొంతయినా అర్థమయిందిగాని, ఆ అబలారత్నం చెప్పిన జవాబుమాత్రం స్పష్టంగా నాకు అర్థం కాలేదు. అయితే ఆమె జవాబులోని తీవ్రతని చూసి—"నువ్వు అరిచి గీపెట్టుకున్నా నేను దిగేది లేదు. నువు చేసేదేదో చేసుకో!" అని అంటున్నదేమో అని ఊహించాను. ధర్మం కోసం తుదిదాకా పోరాడి తీరాలిసిందేననుకున్నాడో ఏమో డ్రైవరుకూడా ఏమీ తగ్గలేదు. ఆ స్త్రీలిద్దరూ దిగిపోతేనే తప్ప తాను కారు తోలేది లేదని కరాఖండితంగా చెప్పేశాడు.

కండక్టరుకూడా వచ్చి వాళ్ళను దిగిపొమ్మని ఆజ్ఞాపించాడు. ఓవర్ లోడ్ అయితే తనకు జుల్మానాపడుతుందని మొరపెట్టుకున్నాడు. ఒకరిద్దరు ప్యాసెంజర్లుకూడా కలిపించుకుని, ధర్మసూక్ష్మన్ని ఆమెకు విడమర్చి చెప్పటానికి ప్రయత్నించారు. ముఖ్యంగా ఆ స్త్రీలకు ప్రక్కసీటులోనే ఆసీనులై ఉన్న స్థూలకాయుడైన ఒక బడా సాహుకారూ, లాయరుపనిచేస్తున్న ఒక అయ్యంగారూ ఆమెతో గట్టిగా వాదించారు. "గవర్నమెంటు రూలుని వ్యతిరేకించటం గొప్ప పాపమమ్మా!" అని సాహుకారు హితబోధచేశాడు. "ఏ స్వతంత్ర దేశంలోను ఇలాంటి అనాగరిక సంఘటన జరుగదు. పేరుకి మనదేశానికి స్వతంత్రత వచ్చిందేగాని, మన మనస్సుల్లోమాత్రం ఏమీ మార్పురాలేదు. ఇంతమంది ప్యాసెంజర్ల పనులు పాడుచేస్తూ బస్సు కదలకండా చేశాననే బాధఅయినా లేదు చూడండి – ఆమెకు!" అన్నాడు న్యాయవాది. నామట్టుకు నేను కూడా – పైకి ఎటూ కలిపించుకుని మాట్లాడకపోయినా –

"ఏమండీ. మీరు ఈ మధ్య మీ పుస్తకాలన్నీ అచ్చు వేయించినట్టున్నారు. ఏ మాత్రం అమ్ముడు పోయాయి?"

"పుస్తకాలమ్ముడు పోలేదు గాని, ఆస్తంతా అమ్ముడు పోయింది.

* * *


నౌకరు:— సార్, సార్ ఈ కుర్చీలో కూర్చోకండి. దీన్నిండా నల్లులున్నాయి.

యజమాని :— ఈనల్లుల కుర్చీ ఇక్కడ వెయ్యకపోతే విజిటర్స్ రూమ్‌లో వెయ్యరాదురా. వాళ్ళ పీడా వదుల్తుంది.

శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

ఆ డ్రైవరు ధర్మబుద్ధికి మనస్సులో చాలా ఆనందించాను. అలా ఎవరో ఒకరు పూనుకోకపోతే స్వతంత్ర భారతదేశంలో ఉత్తమ సంప్రదాయాలు ఏర్పడటం కల్ల అనుకున్నాను.

కాని, క్రమంగా ఆ స్త్రీరత్నంకూడా తన వాదాన్ని బలపరిచేవారిని బస్సు ప్రయాణీకులలో కొంతమందిని సంపాదించుకో గలగటం నాకు ఆశ్చర్యమే వేసింది. ఇంచుమించుగా బస్సులోనివారందరూ రెండు పక్షాలుగా చీలిపోయి, రణగొణ ధ్వనిచేస్తూ వాదోపవాదాలకు దిగారు. క్రమంగా కాలం గడుస్తున్నకొద్దీ ఆ మధ్య వయస్సు లలనారత్నం ఎంత అసాధ్యురాలో నాకర్థమైంది. ఆమెకు తెలుగు, ఇంగ్లీషు కూడా వచ్చు. ఆమెను విమర్శించేవారి కందరికీ అన్ని రకాలుగాను, అంత గట్టిగాను ఆమె సమాధానాలు చెబుతున్నది. కేశబంధనపు వైఖరీ, రిస్టువాచీ, కళ్లజోడూ, హేండు–





డ్రైవరు తన సీటులోనుంచి దిగివచ్చి ఆ స్త్రీలను దిగిపొమ్మని జబర్దస్తీ చేస్తున్నాడు.

బ్రహ్మ వ్రాతకు మొదలెప్పుడు?

చైనాలో ఒక పురాతన గ్రంథం దొరికింది. ఈ గ్రంథం పేరు "పా-యువాన్-చి-లిన్". "బౌద్ధ ప్రపంచములోని ముత్యములు" అని ఆమాటకు అర్థం. ఈ గ్రంథమును టాయోషీ అనే బౌద్ధసన్యాసి సుమారు 1800 సం॥ల క్రిందట రచించాడు. ఈ గ్రంథంలో ఒక చోట యీక్రింది వాక్యములు కన్పించాయి—

"పురాతన కాలంలో వ్రాత అక్షరాల లిపి పద్ధతులను కనిపెట్టిన వాళ్లు ముగ్గురున్నారు - మొదటి వాడు "బ్రహ్మ" - ఇతడు కనిపెట్టిన వ్రాత పద్ధతి ఎడమవైపు నుంచి కుడివైపుకు సాగుతుంది. రెండవ వ్రాత పద్ధతిని "ఖరు" కనిపెట్టెను-ఇతని వ్రాత పద్ధతి కుడివైపు నుంచి ఎడమవైపుకు నడుస్తుంది. ఇక మూడవ వ్రాత' పద్ధతిని కనిపెట్టినవాడు "సాంగ్-చియా" - ఇతని వ్రాత పద్ధతి నిలువుగా పైనుండి క్రిందికి నడుస్తుంది. ఈ మూడింటిలో "బ్రహ్మ" వ్రాత మొట్టమొదట పుట్టింది. అటు పిమ్మట, "ఖరు" కనిపెట్టిన వ్రాత వచ్చింద. ఈ రెండున్నూ "టీంచూ"లో (అనగా భారత దేశంలో) ఉన్నాయి - సాంగ్ చియా కనిపెట్టిన వ్రాత పై మూడింటిలో చాలా క్రొత్తగా యిటీవల కనిపెట్టినది - ఇది మధ్య రాజ్యాలలో (అనగా చైనాలో) ఉన్నది"

చైనా భాషకు వ్రాత లిపిని కనిపెట్టిన వాడు "సాంగ్ చియా" - "హాంగ్ టీ" అనే ప్రాచీన చైనా చక్రవర్తి వద్ద ప్రభుత్వోద్యోగిగా "సాంగ్ చియా" ఉండేవాడు. "హాంగ్ టీ" అనే యీ ప్రాచీన చైనా చక్రవర్తి క్రీస్తుపుట్టక పూర్వము 2397 సం॥లో చైనా రాజ్యాన్ని పరిపాలించాడు- అనగా యిప్పటికి 2, 697 + 1952 = 4649 సం॥ క్రిందట హాంగ్ టీ పరిపాలించెను అప్పుడు అతని క్రింద సాంగ్ చియా ప్రభుత్వోద్యోగిగా ఉండెను-అతడే చైనాలిపిని కనిపెట్టెను. కనుక చైనా భాష లిపి పుట్టి 4, 649 సంవత్సరాలైనవి. కాని చైనా లిపి కంటె ముందు పుట్టింది "ఖరూ" లిపి అనగా "ఖరోష్ఠి" లిపి. దాని కంటె ముందు బ్రహ్మ కనిపెట్టిన వ్రాత అనగా బ్రాహ్మీ లిపి పుట్టింది. కనుక 4, 697 సం॥ల కంటె పూర్వం అనగా రమారమి 5 వేల ఏళ్లకంటె పూర్వమే సంస్కృత అక్షరాలతో కూడిన "బ్రహ్మ" వ్రాత పుట్టినదని యీ ప్రాచీన చైనా గ్రంథంలో చెప్పబడి ఉంది - ఇప్పటివరకు కొందరు చరిత్ర పరిశోధకులు చేసిన పరిశోధనలను బట్టి వేదములు క్రీస్తుకు పూర్వము 3 వేల సంవత్సరాల క్రిందటపుట్టినవని చెప్పుచున్నారు. అనగా వేదములు పుట్టి యిప్పటికి 5 వేల సంవత్సరాలు అని అర్థం - బ్రహ్మ వ్రాత కూడా 5 వేల సంవత్సరాల క్రింద పుట్టినట్లు తెలుస్తోంది. కాని, భారత యుద్ధం ముగిసి, శ్రీ కృష్ణుడు నిర్యాణం పొంది, కలియుగం ఆరంభమై 5 వేల సంవత్సరాల కంటె ఎక్కువ కాలం అయింది. తిలకు మహాశయుని లెక్క ప్రకారము వేదాలుపుట్టి 7 వేల సంవత్సరాలు పైగా అయింది. సింధు రాష్ట్రంలో భూగర్భంలో కన్పించిన మోహెంజోదారో పట్టణము 10 వేల సంవత్సరాల నాటిదని అనుచున్నారు. బ్రహ్మ వ్రాత యింకా పురాతనం కావచ్చు -

ధర్మసూక్ష్మం

బాగూ వగైరా వేషమంతా చూస్తే ఆమె ఏదైనా పెద్ద ఉద్యోగస్తురాలేమో అనిపించింది.

ఆమె వాదం సారాంశం సంగ్రహంగా ఇది :

తాను గంటసేపటినుంచీ అక్కడ నిరీక్షిస్తూంది. ఎన్ని బస్సులు వచ్చినా మొగవాళ్లు తోసుకుని వచ్చి ముందు ఎక్కేస్తూ ఉండటం, తీరా తను ఎక్కబోయేసరికి కండక్టరు "ఎడమిల్లె" అని తుంటెచెయ్యి చూపిస్తూ ఉండటం జరిగింది. ఆ పరిస్థితులలో గత్యంతరం లేక ఈసారి ఆమె ముందుగేట్లోనుంచి ఎక్కేసింది. ఎందరు ఎన్నివిధాల గింజుకున్నా తాను మాత్రం బస్సులోనుంచి దిగదలుచుకోలేదు.

ఆ స్త్రీలవాదమంటే సానుభూతి ఏర్పడిన నా ప్రక్క ఆసామీ నా జబ్బ పుచ్చుకుని కదుపుతూ "మాట్లాడవేమిసార్! మగవాళ్ళని తోసుకుంటూ వెనక గేటులోనుంచి ఆడకూతురు ఎలా బస్సు ఎక్కుతుంది చెప్పసార్ !" అన్నాడు. నాకూ ఒక సందేహం కలిగింది—"బస్సులలో స్త్రీలకు అతి మర్యాదగా ఆసనదానాలు చేసే ఈ నాగరిక యువకులు బస్సుస్టాపుల దగ్గిరకూడా అదే నాగరికతను ప్రదర్శించి ముందు స్త్రీలను ఎక్కనిచ్చి, ఆవెనుక ఎడం ఉంటేనే తాము ఎందుకు ఎక్కకూడదా!" అని.

ఈ రభస ఆరంభమై అప్పటికి దాదాపు రెండు గంటలు కావస్తూంది. చైనాబజారు రంగురంగుల విద్యుద్దీపాలతో, వివిధ వీధి వర్తకులఆరావాలతో, సీతాకోకచిలుకల్లాగ ముస్తాబై షాపింగ్ కి బయలుదేరిన పలు తరహాల అంగనాజనంతో అతి దర్శనీయంగా ఉంది. బస్సులూ, చిన్నకార్లూ అనేకం వస్తున్నవి, పోతున్నవి. కాని, మా బస్సు మాత్రం కదిలే సూచన ఎక్కడా కనిపించటం లేదు. మొదట ఉత్సాహంతో వాదోపవాదాల్లోకి దిగిన చాలామంది ప్రయాణీకులలో క్రమంగా విసుగుదల ఆరంభమై, బస్సు బయలుదేరదియ్యమని కండక్టరుని ఒత్తిడి చెయ్యటం మొదలుపెట్టారు. కాని, అటు డ్రైవరు గాని, ఇటు ఈ స్త్రీ గాని ఎవరూ తమ తమ ప్రతిజ్ఞలను లవలేశమైనా సడలించటానికి ఒప్పుకోటం లేదు.

ఆ విషమ సమస్యను పరిష్కరించేందుకు ఒక ఉపాయం నాకు తోచింది. మెల్లగా పక్క ఆసామీతో అన్నాను:

ధర్మసూక్ష్మం

"పోనీ—ఆ ఇద్దరు స్త్రీలూ ముందుగేట్లో నుంచి దిగిపోయి..."

"అది ఒక్క నాటికి కుదరదు సార్!"

"...చివరిదాకా విను! మళ్లీ వెనక గేట్లోనుంచి ఎక్కటం"

"డ్రైవరూ, కండక్టరూ ఒప్పుకుంటే నాకు ఇష్టమే సార్! ఈపద్ధతి" అన్నాడు నా ప్రక్క ఆసామి.

"అప్పుడే అవలేదు—విను! మరి ఓవర్ లోడ్ సమస్య ఒకటి ఉందిగదా! అందుకని 'ఈ స్టాప్‌లో ఎక్కిన ఇద్దరు ప్యాసెంజర్లు దిగిపోవాలి!"

"నీవు చెప్పి పిచ్చివాడు దా సార్! ఎక్కినప్యాసెంజర్లు ఎవళ్లో దిగమంటే ఎవడు దిగుతాడుసార్?"

ఇంతలో - డ్రైవరూ, కండక్టరూ దూరంగా పోయి ఏమిమాట్లాడుకుని వచ్చారో ఏమో - డ్రైవరు బస్సు స్టార్టు చేశాడు. 'అమ్మయ్య!' అని బస్సులో ప్రయాణీకులందరూ నిట్టూర్పు విడిచారు. అంతవరకూ తెగ ఉక్కిపోయి ఉన్న ప్రాణాలు బస్సుకదలగానే చల్లని గాలి పోసుకొని కొంచెం తేరుకున్నవి.

నిజానికి - అక్కడితో కథ ముగిసి పోవలసిందే! కాని, ఆ డ్రైవరు పట్టుదలలో భగీరథుడిలాంటివాడు. అంతతో పోనియ్యకుండా బస్సుని మౌంట్‌రోడ్‌లో గవర్నమెంట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు ఆవరణలోకి పోనిచ్చాడు. అక్కడా మళ్ళీ అరగంట! మళ్ళీ అదే భాగవతం! అక్కడి ఉద్యోగస్థులు వచ్చి ఆమెను దిగమనటం, ఆమె ససేమిరా దిగనని భీష్మించటం. ప్రయాణీకుల ఒత్తిడి ఎక్కువ కావటం మూలాన పాపం - చివరికి డ్రైవరే ఓటమి ఒప్పుకోవలసి వచ్చింది.

మళ్ళీ బస్సు బయల్దేరినతర్వాత - "డబ్బులిచ్చి టిక్కెట్టైనా తీసుకుంటావమ్మా? అదీలేదా?" అన్నాడు కండక్టరు వెటకారంగా. అమితకోపంతోను, అతి నిర్లక్ష్యంతోను ఆమె చేతిసంచిలోనుంచి డబ్బులుతీసి తమ రెండు టిక్కెట్లకూ మూడణాలు కండక్టరు చేతిలోకి గిరాటు వేసి, ఆ కన్నెపడుచుతో సహా పి. ఆర్. అండ్ సన్స్ స్టాప్ దగ్గిర దిగి వెళ్లిపోయింది.

'డ్రైవరు వాదనా, లేక ఆ స్త్రీరత్నం వాదనా - రెంటిలో ఏది నిజంగా సక్రమమైనది?' అన్న ధర్మసూక్ష్మం మాత్రం ఆ నాటికీ, ఈనాటికీ నాకు తేలనేలేదు. ★

> మంత్రిగారు ఉపన్యాసం ప్రారంభిస్తూ "మహాజనులారా! క్షమించాలి. ఇవ్వాళ నాగొంతిక పూడిపోయింది. ఉపన్యాసం ఇచ్చే ఓపిక లేదు, రేపెల్లాగూ అది పేపర్లో పడుతుంది గనక మీరది చదువుకోవచ్చు. ఇంతటితో విరమిస్తున్నాను."

ఒకటో తారీఖు

(19-వ పేజీ తరువాయి)

విశ్వంగారికి. { మద్రాసు 22-7-52

నమస్కృతులు.

మొన్న ట్రాంలో మీ మనీపర్సు కొట్టివేసింది నేనే. ఆ పర్సును ఇంటికి తెచ్చాక విప్పిచూస్తే అందులోపదిన్నరణా మాత్రమే వుంది. అప్పటికి కానీ మీరు నాకన్నా దరిద్రులన్న సంగతి తెలియలేదు నాకు. తోటి బీదవాని పర్సును దొంగిలించటం నాకు మనస్కరించనందున, ఇందుతో మీ మనీపర్సును పంపిస్తున్నాను. దైవవశాత్తు అందులో మీ విలాసం వున్నందువల్ల పంపించగలిగాను కానీ, లేకపోతే నామనస్సు చివుక్కుమనేది. మీ స్టాంపాస్ కూడా పంపించాను. చూసుకోండి. ఈవిషయంలో మీకేమాత్రం శ్రమ కల్గించినా క్షంతవ్యుణ్ణి. దారిలో మీ రెక్కడైనా కనిపిస్తే, దూరంనించి ఒక్క నమస్కారం విసిరివేసి, నా మనస్సుకు శాంతి కల్గించుకుంటాను.

ఇంతే...శలవు...

ఇట్లు
మీ మిత్రుడు
పాంక్యాక్.

పార్సెల్‌మీద స్టాంపులు చూశాడు. సరిగ్గా పదిన్నరణాల స్టాంపులు అంటించబడి ఉన్నాయి. ఆ దొంగ పెద్దమనిషి ఎక్కడసుఖంగా ఉన్నాడో ఏమో కానీ, ఇక్కడ్నించే మనస్ఫూర్తిగా నమస్కరించాడు మన విశ్వం. ★



విజ్ఞానవీధులు


"డాక్టర్"



46 సంధ్యాకాశపు వెలుగు దార.లు

"సంధ్యాకాశములో తరుచు నీలిరేఖలూ తెలుపురేఖలూ ఆకాశము మీదికి చిమ్మబడును. ఈ రేఖలు నడునెత్తిన అంతర్ధానమైనా తిరిగి తూర్పునందు కనపడును. ఏమిటీ రేఖలు? ఇవి ఎట్లు ఏర్పడును? మధ్యన ఎందుకు అంతర్ధానమవుతున్నవి?" అని గుంటూరునుంచి బి. నారాయణరావుగారు అడుగుతున్నారు.

ఇంటికప్పులో ఉన్న చిన్న కన్నము గుండా సూర్యరశ్మి చొచ్చుకువచ్చినట్లే సూర్యుని మరుగుపరిచే మబ్బు సందులలోంచి రశ్మి ప్రసరించి వెలుగుదారుల్ని ఏర్పరుస్తోంది. మనగదిలోని గాలిలో తేలియాడే ధూళికణాలు విరజిమ్మడమువల్లనే గదిలో ప్రవేశించిన కిరణపు దారి కనబడుతున్నట్లే, అంతరిక్షమందలి తేలియాడే ధూళీ-, బొగ్గూ-, నీరూ-మంచూ-కణాలు విరజిమ్మడమువల్లనే మబ్బు సందులలో నుంచి ప్రసరించే వెలుగు దారుల్లాగు మనకి కనబడుతుంది. ఈ దారులు స్వతహాగా సూర్యుని వెలుగుబట్టి తెల్లగానే ఉంటాయి. నీలముగా కనపడేవి వెలుగుదారుల్లో మబ్బు ముక్కల ఆటంకమువల్ల ఏర్పడ్డ నీడదారులు మాత్రమే.



ఈ నీడదారులలోంచి మన కంటివైపు విరజిమ్మబడే వెలుగేదీ లేదు కనక కింది నుంచి చూచే మనకి వీటిలో నీలాకాశమే కనబడుతుంది. వెడల్పైన వెలుగుదారుల నడుమనున్న నీడదారి వాస్తవానికి దానిలో ఏమీ వెలుగు లేకపోయినా ఆకాశపురంగు నించి నీలపు దారిలాగ కనపడుతుంది.

ఇక నీ వెలుగుదారి తూర్పు పడమరలలో చక్కగా కనపడి నడి నెత్తిమీద ఏల కనబడవు? అనీ.

పటములోని రెండు దీర్ఘరేఖలూ వెలుగుదారి అంచులు. 'యర' 'లవ' 'శష' అన్నవి పడమరనుంచీ, నడి నెత్తిమీది నించీ తూర్పునించీ మనకంటికి చేరే కిరణాలు. 'యర,' 'శష' లు 'లవ' కంటె పొడవు. అంటే వెలుగుదారిలోనుండి మనవైపు వెల్తురును విరజమ్మే కణాలు 'యర,' 'శష' లలో హెచ్చు. అంటే 'యర' 'శష' ల నుంచి ఎక్కువ వెలుగు మనకంటి కందుతుంది. 'లవ' లో కణాలూ తక్కువే, వెలుగూ తక్కువే. ఒకొక్కప్పుడు 'లవ' నుంచి వెలుగు వచ్చినట్లే వుండదు.

'విరజిమ్ము, విరజిమ్మే' అన్నాము. వాస్తవంగా జరిగేది పరావర్తనమే. 'కణాలు' అతి సూక్ష్మములైతేనే విరజిమ్మడం జరుగుతుంది. కాకపోతే కణాలు అద్దపు కణాలలాగ వెల్తుర్ని మనవైపు పరావర్తనము చేస్తాయి. అందుకే తెలుపే కనబడుతుంది వెలుగుదారుల్లో.

47. కాఫీ, టీ, కోకోల్లో ఏది మంచిది?

మనదేశంలో ఉత్తరాదిని 'టీ,' దక్షిణాదిని 'కాఫీ' పానీయాలు ఎక్కువగా వాడుకలో ఉన్నాయి. సామాన్యంగా ప్రతిఇంటా వాటిని అతిథి అభ్యాగతులకు ఇవ్వడము మర్యాదపైంది.

వీటికి సాయం 'కోకో' పానీయం పేరు కూడా మనకి అప్పుడప్పుడు వినపడుతోంది. మనదేశంలో అంత విరివిగా వాడుకలో లేకపోయినా దక్షిణ అమెరికా ఆఫ్రికా ఖండాల్లో దీనిదే పైచెయ్యి. సారాయి సంపర్కం ఏమాత్రమూ లేని బహుజనాదరణీయములైన పానీయాల్లో 'కాఫీ, టీ, కోకో' లు అగ్రేసరములు. మద్యపాన నిషేధవ్రతం పూనిన మనకి ఈ మూడు పానీయాల మంచి చెడ్డలూ తెలుసుకోవడం ఎంతో అవసరం.

టీని తేయాకు చెట్టు ఆకులనుంచీ, కాఫీని కాఫీ చెట్టుగింజలనుంచీ తయారు చేస్తారన్న విషయం మనలో చాలా మందికి తెలుసు. ముందుగా వాటి డికాక్షణ (కషాయం) తీసి దానికి పాలూ, పంచదారా చేర్చి సేవిస్తామన్న విషయంకూడా సర్వజనవేద్యమే. టీ, కాఫీలకి వాటి స్వాభావసహజమైన పరిమళమూ, రంగూ డికాక్షణ్వల్లనే లభిస్తాయి. తేయాకులోనూ, కాఫీగింజల్లోనూ ఉన్న పరిమళద్రవ్యాలూ, టానిన్లూ కెఫీను అనే ఆల్కలాయిడు పదార్థమూ డికాక్షన్లోకి దిగుతాయి. పరిమళద్రవ్యాలవల్ల గుబాళింపూ, రుచీ, టానిన్లవల్ల రంగూ, కెఫీనువల్ల వాటిని సేవించినప్పుడు కలిగే ఉత్సాహాతిశయమూ వస్తాయి. కెఫీను మన దేహంలో జీవరసాయనిక మార్పుల్ని కలిగిస్తుంది. ఆ మార్పుల ఫలితమే మనకి కాఫీ, టీ సేవనవల్ల కలిగే ఉత్సాహాతిశయము. కెఫీను నరముల కుత్తేజము కలిగిస్తుంది. అందులోనూ ముఖ్యంగా వాటికూ ఉలిస్థానమైన మెదడుని, మజ్జారజ్జువునీ (*Spinal chord*) రేపుతుంది. హృదయకోశాన్నీ కొన్ని రక్తవాహికల్నీ సంకోచింపజేస్తుంది. మూత్రపిండాల చురుకుని హెచ్చిస్తుంది. అందుచేతనే. మొత్తంమీద కాఫీ, టీలలో దేనిని సేవించినా ఉత్సాహకరంగా ఉంటుంది. ఐతే ఈ ఉత్సాహం ఎంతో సేపుండదు. తాత్కాలికము. కెఫీనువల్ల పురిఎక్కిన నరాలు కొంచెం సేపు కాగానే ఆ పురి సడలిపోయినట్లైపోతాయి.

అందుచేత ఈ పానీయాలకి అలవాటు పడ్డ

వారికి సామాన్యంగా వీటేని అతి తరచుగా సేవించాలనే ధ్యాస కలగడమూ, వీరు కాఫీ టీల కషాయం చిక్కగా ఎక్కువగా ఉండాలనడం జరుగుతోంది. వారి నరాలు కెఫీనుకి అలవాటు పడటంచేత అవి ఉత్తేజం పొందేటందుకు క్రమంగా దాని మోతాదు ఎక్కువ అవసరమవుతోండడమే దానికి కారణం అనడంలో ఏమీ సందేహంలేదు. అనేక వ్యాధులకీ, అందులోనూ ముఖ్యంగా మానసిక వ్యాధులకి నరాల బలహీనతే కారణమని ఆధునిక వైద్యులమతం. నరాలకి తరచు ఉద్రేకం కలిగించే కాఫీ, టీ, పానీయాలూ, ఇతర అనవసర ఆహార విహారాలూ నరాల బలహీనతకు దారితీస్తాయని నిర్మొహమాటంగా అనక తప్పదు. ఈ దృష్టితో విమర్శిస్తే కాఫీ, టీలను తరచు సేవించడం తగదనీ, ప్రీతి పాత్రులైన బంధుమిత్రులను కలుసుకున్నప్పుడు సహజంగా కలిగే ఉత్సాహానికి సాయం దాన్ని ఇనుమడించేలా చేసే కాఫీ, టీ పానీయాల్ని అతిథి మర్యాదకై ఇవ్వడమూ, పుచ్చుకోవడమూ కూడా అనుచితమేననీ తేలుతోంది.

ఇక కాగా పోగా మిగిలిన 'కోకో' పానీయం సంగతి ఏమిటి? అది మనకి అంత పరిచితమైంది కాదు కాబట్టి దాన్ని ఎలా తయారు చేస్తున్నారో చెప్పి మరీ దాని గుణ విమర్శన చేస్తాను.

కోకో థియోబ్రోమా కోకో అనే చెట్టు గింజలనుంచి తయారుచేస్తారు. ఆ గింజలు 'కోకోపాడ్స్' లో ఉంటాయి. కోకోపాడ్స్ పనసకాయల్లాగ చెట్టు మొదట కొమ్మలకే కాస్తాయి. అవి కొంచెంబాగా ఎదిగిన దోసకాయలంతేసి ఉంటాయి. ఒక్కొక్క కోకోపాడ్‌లో సుమారు 50 గింజలుంటాయి. వాటిచుట్టూ పీచు పీచుగా గుంజు ఉంటుంది. కోకో పాడ్స్‌ని పండిన తర్వాత కోసి గింజల్ని వేరుచేస్తారు. తర్వాత వాటిని చాలా రోజులపాటు ఉక్కిపోయేలా కొట్లంలో రాసులుగా పోసి నిలవ ఉంచుతారు. ఆ ఉక్కకి కోకోగింజల్లో ఒక రకమైన విపాకక్రియ (*Fermentation*) జరుగుతుంది. అప్పుడే వాటికి కోకో పరిమళమూ, రంగు సిద్ధిస్తాయి. తర్వాత ఆ గింజల్ని ఎండలోనో సన్నటి సెగలోనో ముందు ఎండబెట్టి తర్వాత దోరగా వేయిస్తారు. అసలు గింజల్లోనూ లోపలి పప్పుల్లోనూ ఉన్న పరిమళతైల పదార్థాల్లో రసాయనిక మార్పులు కలుగుతాయి. వాటి ఫలితంగా కోకో పరిమళం పరిణతి చెందుతుంది. అంతే కాకుండా గింజలపైనున్న పెచ్చు పప్పునుంచి విడిపోతుంది. అందుచేత వేయించిన గింజల్ని కచ్చాబిచ్చాగా కొట్టి చెరిగినప్పుడు పెచ్చు తెగిరిపోయి పప్పులు మిగులుతాయి. కోకో పప్పుల్ని కోకో నిబ్స్ అనే పేరుతో వ్యవహరిస్తారు. వాటిని అలాగే చాక్‌లేట్స్ తయారు చేయడానికి కొంతమటుకి వినియోగిస్తారు. చాలాభాగం కోకో పొడిని తయారుచేసేటందుకే ఉపయోగిస్తున్నారు. ఆవిరి వేడివల్ల వెచ్చగా ఉండే తిరగలి రాళ్ళల్లో కోకో నిబ్స్‌ని విసురుతారు. ఇలా విసిరినప్పుడు నలిగిన పదార్థం కరిగి ద్రవరూపంలో ఉంటుంది. దాన్ని అచ్చుల్లో పోసి చల్లార్చినప్పుడు గట్టిపడి కొంచం చిరుచేదుగా ఉండే కల్తీలేని కోకో తయారవుతుంది. వెచ్చగా ద్రవరూపంలో ఉన్నప్పుడు పంచదారనీ, 'వానిలా' పరిమళాన్ని కలిపి తీపిగాఉండే కోకోని తయారుచేస్తారు. సామాన్యంగా పొద్దున్నే పుచ్చుకొనే కోకో పానీయాన్ని తయారు చెయ్యడానికి కోకో పొడిని వాడుతారు. కోకోపొడిని తయారు చెయ్యాలంటే కోకోలోఉన్న తైలపదార్థాల్ని కొంతమట్టుకైనా తీసెయ్యాలి. అలా చెయ్యకపోతే కోకో అచ్చులు లభిస్తాయే కాని కోకోపొడి తయారవదు. బాగా కాచిన పాలల్లో కోకోపొడిని మోతాదుగా కలిపినట్లైతే మనోహరమైన పరిమళమూ, రంగూ కల పానీయం తయారవుతుంది. దానికి పంచదార చేర్చి చవులూరేలా సేవించవచ్చు. కోకోలో ఉన్న తైలపదార్థాల్ని కోకో వెన్న అనికూడా వ్యవహరిస్తారు. అదికూడా వెన్నలాగ పుష్టికరమైన పదార్థం అనడంలో ఏమీ సందేహంలేదు. ఇందులో థియోబ్రోమీను, కెఫీను అనే ఆల్కలాయిడులుకూడా కొద్దిగా ఉన్నాయి. వాటిలో కెఫీనుపాలు చాలా తక్కువ. అది మొత్తం ఆల్కలాయిడులలో పదోవంతుంటుంది. ఇక థియోబ్రోమీను రసాయనిక అణు విన్యాసంలో కెఫీనుని పోలిఉన్నప్పటికీ జీవరసాయన క్రియల్ని నడిపించడంలోమాత్రం వేరే పంథాని అనుసరిస్తుంది. థియోబ్రోమీను హృదయకోశాన్ని గాని, రక్తవాహికల్ని గాని సంకోచింపచెయ్యదు. అందుచేత దాన్ని సేవించడంవల్ల నరాల బలహీనత కలగదనే అనవచ్చు.

శాస్త్రీయదృష్టితో పరిశీలిస్తే కాఫీ, టీ కోకో పానీయాల్లో కోకో విశిష్టమైందని తేలింది. ఐతే అది మన దేశంలో తయారవడంలేదు. ఈ విషయం ఒక్కటే అది విరివిగా మనదేశంలో వాడుకలో లేకపోవడానికీ దాన్ని తాగండని ఎవరూ



భర్త :- ఏమేవ్, ఇవ్వాళ మా స్నేహితుడొకణ్ణి భోజనానికి పిలిచాను.

భార్య :- అదేమిటండీ? ఇంట్లో పప్పులూ, ఉప్పు, బియ్యం ఏమీ లేవే? ఇవ్వాళే ఎందుకు పిలిచారు?

భర్త:-అందుకే పిలిచానే! వాడి పెళ్ళి కాబోతోంది. సంసారం అంటే ఎల్లాఉంటుందో ప్రత్యక్షంగా చూపటానికే పిలిచాను.

ప్రచారం చెయ్యకపోవడానికీ కారణం. 'గతానుగతికో లోకః' అన్నట్లు, వీరిని చూసి వారూ, వారిని చూసి వీరూ కాఫీ, టీ పానీయాల్నే సేవిస్తున్నారు. కాని వాటిస్థానాన్ని కోకో ఆక్రమించడం అవసరం. కోకోచెట్టు ఉపోష్ణమండలంలో (*Sub-tropics*) పెరుగుతుంది. అందుచేత మనదేశంలో దాన్ని పెంచేటందుకు అవకాశం లేకపోలేదు. ఇకమీదైనా మన దేశంలో అన్నిరాష్ట్రాల వ్యవసాయశాఖ వారూ వారి రాష్ట్రాల్లో కోకోచెట్లని పెంచడానికి అనువైన పొలాల్నీ, పరిస్థితుల్నీ అన్వేషిస్తారనీ తదుపరి కాఫీ, టీ కషాయసేవన నిత్యకృత్యం కాక వైద్యుల సలహాప్రకారం మాత్రమే జరిగే రోజులు రావలెననీ కోరుతున్నాను. —హరి.



అలంకరణ

(బేలూరు దేవాలయంలోని శిలాప్రతిమ)

—చిత్రకారుడు: శ్రీ రమేష్ చంద్రా; హైదరాబాదు.

విజ్ఞాన వీధులు

48 కలలు ఏమిటి?

అని కాకినాడనుంచి బి. ప్రియదాసు గారూ, రాజమండ్రినుంచి మల్లిడి సూరిరెడ్డిగారూ అడుగుతున్నారు.

కలలలో మూడురకాలు కనపడతాయి సామాన్యంగా. అప్రాప్తమనోరథము అల్లిన కలలు మొదటిరకము. మన ప్రవర్తనని పరిశీలించుకుంటే మూడువిధాలుగా కనబడుతుంది. మనకు తెలియకుండానే మనము చేసేపనులు ఒకవిధము. గుటకవేయడము, ఉలిక్కిపడడమూ, పిట్టలు గూడుకట్టడమూ వంటివి. వీటిని నేర్చుకో నక్కరలేదు. కారణము ఏమిటో తెలియకుండానే ఇవి వచ్చేస్తాయి. జాగ్రదవస్థలో మనము ఎరిగి చేసేపనులు రెండోరకము. ఊహాలూ, ఉద్దేశాలూ, మనోరథాలూ, గాలిలో కట్టే మేడలూ ఇవన్నీ జాగ్రదవస్థకు చెందిన ప్రవర్తనలు. అయితే, పగటికలలు-కుర్చీలో కూర్చుని సిగరెట్టు కాలుస్తూ కళ్లు తెరుచుకుని వున్నా చూడకుండా మనం నడుపుకుపోయే ఆలోచనలూ ఆశయాలూ కూడా జాగ్రదవస్థలోని ప్రవర్తనలే. ఈ అవస్థలో మనం కోరుకునే అనుభవాలు అన్నీ మనకి లభ్యముకావు. ఉప్పూ పులుపూ తినే శరీరము కనక ఆశలకి లోటుండదు. పరిస్థితులు అనుకూలంగా లేకపోవడము వల్లనైతేనేమి సాంఘిక నియమావళి నిషేధించుట వల్లనైతేనేమి—శిక్షాభయము వల్లనైతేనేమి—మన కోర్కెలన్నిటినీ పొందడానికి జాగ్రదవస్థలో యత్నము చెయ్యలేము. ఇక్కడ మన కోరికలపై సంప్రదాయము 'శాస్త' అయి వాటిని అణగతొక్కేస్తుంది. తర్వాత మనస్సు ఈ విషయాన్ని-ఎన్నో ఇతర అనుభవాల్ని వలెనే-మరిచిపోతుంది. కలత నిద్రలో అనగా స్వప్నావస్థలో ఈ 'అనుభవాలు' పైకిలేస్తాయి. ఎప్పుడూ? పైన చెప్పిన 'శాస్త' తన కస్టీని సల్లించేసి నిద్రపోగానేను. ఈ ఆశలు అణగ త్రొక్కబడ్డాయి కాని నాశనము చేయబడలేదు. కనక, వింత వింత రంగులతో, మారిపోయిన వాతావరణముతో బయల్దేరుతాయి. ఇవి మూడోరకపు 'ప్రవర్తనలు.' జేబులనిండా బంగారు కణికలనో, బస్తాలలోని చిల్లులలోనుంచి కారిపోతూన్న రూపాయలనో నింపుకున్న తర్వాతనే కళ్ళు తెరిచాను నేను ఎన్నోమారులు! నాకు ఆశలులావూ;

(56-వ పేజీ చూడండి)

పరమహంసకు కోతిశోక

కలకత్తాకు సమీపంగా ఉత్తరంగా దక్షిణేశ్వరం అనే గ్రామం ఉంది. అక్కడ కాళికా దేవిగుడి ఉంది. ఆ గుడిలో రామకృష్ణ అనే ఆయన పూజారిగా ఉండేవాడు. ఇదంతా క్రీ॥ శ॥ 1875 సం॥ నాటి సంగతి—ఈయనకు భగవంతుణ్ని చూడాలని గట్టి పట్టుదల కలిగింది. ఈ ప్రపంచానికి అంతటికీ ఒక్కటే దేవత తల్లి వలె ఉండి కాపాడుతోంది అని ఆయన నమ్మకం - ఈ కాళి అనేది ఆ దేవి అనిన్నీ జగత్తు అంతటికీ ఆమె తల్లి అనిన్నీ ఆయన నమ్మి ఆ దేవిని పూజిస్తూ ఉండేవాడు. రోజు రోజుకు ఆయనకు దేవియందు భక్తి ఎక్కువై పోయింది - దేవికి వాహనం సింహం అని ఆయనకు తెలిసింది. కలకత్తాలోని జంతు ప్రదర్శనశాలలో సింహాలు ఉన్నాయని ఆయనకు ఎవరో చెప్పారు. దేవియొక్క జగన్మాత యొక్క వాహనమైన సింహాన్ని చూడాలని ఆయనకు కోరిక కలిగింది — ఈ విషయం తన స్నేహితుడైన పండిత శివనాధ శాస్త్రిగారికి ఆయన తెలియజేశారు - ఒక రోజున గుఱ్ఱపు బండీలో రామకృష్ణ గారిని ఎక్కించుకొని శివనాధశాస్త్రి గారు ఆ సింహాలు ఉండే శాలకు ఆయనను తీసికొనిపోతూ ఉన్నారు - రామకృష్ణగారు దేవివలె తలమీద ముసుగు వేసికొని తాను ఆడదానిని అని చెప్పి, ఆ దేవియొక్క వాహనమైన సింహాన్ని చూడబోతున్నాననే ఆనందంతో ఆగుఱ్ఱపు బండీలోనే పండిత శివనాథ శాస్త్రిగారి ప్రక్కనే మూర్ఛ పోయినారు.

దక్షిణేశ్వరంలోని కాళీ గుడికి భక్తులు చాలామంది వస్తూఉండేవారు. రాముల వారివద్ద ఆంజనేయుల వారు ఎటువంటి భక్తితో ఉండేవారో అటువంటి భక్తి అలవాటు కావాలి అని రామకృష్ణతో అక్కడ గుడికి వచ్చిన భక్తులు కొందరు అన్నారు-అది విని రామకృష్ణ ఒక గదిలోకి వెళ్లి హనుమంతునివలె తాను కూడా నడుముకు ఒక పెద్దతోక కట్టుకొని రామ భజన చేయడం ప్రారంభించాడు- తాను హనుమంతుణ్ని అనుకొని ఎగరడం దుమకడం ప్రారంభించాడు. ఈ విధంగా తాను మహాభక్తుడు కావాలని సాధకం చేసినటువంటి యీ రామకృష్ణ చిట్ట చివరకు దేవీ భక్తుడైనాడు - భగవంతుని దర్శనం అనేక పర్యాయములు ఆయనకు అయింది. ఆ సమయంలో ఆయనకు మూర్ఛ వచ్చినట్లుగా ఉండేది. తనఒళ్లూ ప్రపంచం కూడా మరచిపోయేవాడు. ఆయనము ఖంలో ఆసమయంలో ఒక దివ్యమైన తేజస్సు ఉండేది అని పండిత శివనాథ శాస్త్రిగారు స్వయంగా చూచి వ్రాశారు- ఈ రామకృష్ణుడే శ్రీ రామకృష్ణ పరమహంస. వీరి శిష్యులు వివేకానంద స్వామి-

బొమ్మరిల్లు

★ త్యాగం

రచన: మసూనా.

పాపల్లారా
పాపల్లారా
ఇది వింటారా
విని చెప్తారా ?

ఏరు మంచిది,
ఎందుకు మంచిది,

త్రాగేనీరూ
స్నానంనీరూ
పంటల నీరూ
తెస్తుందీ తెస్తుందీ-

చెట్టుమంచిది
ఎట్లు మంచిది?

కమ్మని పూలూ
కాయలు పండ్లూ
కలపాకట్టలు
ఇస్తుందీ యిస్తుందీ-

ఆవుమంచిది
ఏల మంచిది?

పాలూ పెరుగూ
నేయీ మజ్జిగ
జున్నూ వెన్నా
అన్నీ యిస్తుందీ-

అన్నీ ఎన్నో యిస్తాయి
ఎన్నో అన్నీ యిస్తాయి.
అన్నీ యిచ్చే పద్ధతినీ
అందరు త్యాగం అంటారు.

అన్నిటికీ మించిన సత్కార్యం
త్యాగం గొప్పది అంటారు—
ఎద్దులు దున్నుట కోసం
గుఱ్ఱం స్వారీ కోసం
ఆవూ ఏరూ చెట్టూ
అన్నీ మనుషుల కోసం
త్యాగం చేస్తూ వుంటే
మనుషులు మనుషుల కోసం
పని కొస్తామని చెప్తారా?

పాపల్లారా
పాపల్లారా
యిది వింటారా ?
విని చెప్తారా ?

★ మంచివెన్న

శ్రీ వేజండ్ల సాంబశివరావు

★

ఉట్టిపైన మంచివెన్న
అందకుండ ఉన్నది
మనసుఅంత దానిమీద
వేగనిలచి ఉన్నది

ఎత్తుబల్ల ఎక్కి నేను
వెన్నముద్ద తిందునా?
పిల్లికూన నడిగి వెన్న
ముద్దపెట్ట మందునా?

ఎత్తుబల్ల ఎక్కిచూడ
ఉట్టి అందలేదురా
పిల్లికూన చట్టిమూత
తీయలేక పోయరా

మంచితల్లి నాకు ఉండ
దొంగతనము కూడునా ?
వెన్నముద్ద పెట్టమంచు
అమ్మనిపుడె అడగనా?



డాన్ క్విక్సెట్

పూర్వకథ

లామంచా అనే గ్రామానికి చెందిన డాన్ క్విక్సెట్ అనే వెర్రివెంగళప్ప తానొక వీరుడుగా చెలామణీ కావాలనుకొని, శాంకో పాంజా అనే చదువురానివాణ్ణి తన బంటుగా చేసుకొని వీరవిహారాలకు బయలుదేరాడు. ఎవరో ఒక ఆడామెను చూచి ఆమెకు డల్సీనియా రాకుమారి అనే బిరుదాన్ని తన మనస్సులోనే యిచ్చేసి, ఆవిడను మెప్పించటంకోసమే తానీ ధర్మరక్షణమనే కఠోరదీక్షను స్వీకరించానని నమ్మాడు. లోగడ డాన్ క్విక్సెట్ గారు తాను జయించబోయే దీవుల్లో ఒకదానికి శాంకో పాంజాను గవర్నరుగా చేస్తానన్నాడు. వాడా మాట నమ్మి ఆరోజుకోసం ఎదురు చూస్తున్నాడు. ఇలా వుండగా ఒకరోజు వీళ్ళకు ఒక డ్యూక్ దంపతులు తారసిల్లారు. వారికి వీళ్ళిద్దరినీ వేళాకోళం చేయాలనే బుద్ధి పుట్టింది. ఆ స్వామినీ, బంటునీ తమ దేవిడీకి తీసుకుపోయి, తిండి అదీ పెట్టి బాగా ఆదరించారు. అప్పుడు జరిగిన ఆ మాటల సందర్భంలో శాంకోపాంజాను తానే ఒకానొక దీవికి గవర్నరుగా నియమించేస్తున్నానని ఆ డ్యూక్ సెలవిచ్చాడు. డ్యూక్ దంపతులు శాంకోపాంజాను వేళాకోళం చేయటానికి కావలసిన ప్లానుఅంతా కూడబలుక్కున్నారు.

17

డ్యూక్, డ్యూక్ భార్య యిద్దరూ కలిసి ముందుగా వేసుకొన్న ప్లాను ప్రకారం మరునాటి మధ్యాహ్నం శాంకో పాంజాగారిని గవర్నరు హోదాలో ఆ దీవికి పంపే ఏర్పాట్లన్నీ జరిపారు. శాంకో పాంజాను గవర్నరుగా నియమించటానికిగాను డ్యూక్‌గారు తమ జమీలోనే ఒక చిన్న పట్టణాన్ని ఎన్నుకొన్నారు. ఆ పట్టణానికి కావలసిన అన్ని లక్షణాలు వున్నాయి కానీ, అదీ దివిమాత్రం కాదు. కాకపోతే వచ్చిన నష్టమేమిటి లెమ్మని ఘనత వహించిన గవర్నరు శాంకో పాంజాగారు సరిపెట్టుకొన్నారు.

శాంకో పాంజాగారు తమ ముఖ్య పట్టణానికి పరివారసమేతంగా పటాటోపసంభరితంగా తరలిపోయే ఆ శుభలగ్నం సమీపించింది. అంతటి మహోన్నత బిరుదాన్ని స్వీకరించబోతున్న వ్యక్తి కనుక యీ శాంకో పాంజాగారు తొడుక్కొన్న బట్టలూ అవీ బాగా నదరగా వుండాలి కనుక డ్యూక్ భవనంలోని దాసీలు కొందరు మబ్బురంగు మొఖమల్ కోటు ఒకటి, యించుమించు అదేమాదిరి బూడిదరంగు కుచ్చుటోపీ ఒకటి పట్టుకొచ్చి, ఆయన తొడుక్కొని వున్న ఆ బట్టలపైనే తొడిగేశారు. ఈ మొఖమల్ కోటు బాగా మోకాళ్ల కిందివరకు వచ్చి మనిషి కదలటానికి వుతుకుష్టంగా వుంది. అయితే ఏం! అది మొఖమల్ కోటు! రాజులు, గవర్నర్లు తొడుక్కొనే కోటు! అలాంటి కోటును చూసి 'దీని రంగు బాగలేదా'ని



మూలం : సెర్వాంటెజ్ ★ అనువాదం : శ్రీ విశ్వాత్ముల నరసింహమూర్తి

★ డాన్ క్విక్ సెట్ ★

కానీ, 'యిది మోకాళ్లకిందికి వచ్చింద'ని కానీ ఆయన అనుకోరు. మనమెవరమూ కూడా అలాటి మాట అనరాదు; వినరాదు.

ఈవిధంగా వస్త్రాలంకరణాదులు ముగిశాక ఆయనను నలుగురు దాసీవాళ్లు పట్టుకొచ్చి ఒక కంచర గాడిదమీద అడ్డంగా కూర్చోబెట్టారు. ఈయనగారి చిరకాల వాహనమైన ఆ డాపుల్‌కు మెడలోనూ, తోకచివరనూ పట్టు రిబ్బన్లూ అవీ దట్టంగా కట్టి, కూడా పట్టుకువచ్చి శాంకోపాంజాగారు ఎక్కిన కంచర గాడిదకు వెనుకవైపున నిలబెట్టారు.

అన్నట్లు—యీయనగారు కంచరగాడిద నెక్కబోయేముందు డ్యూక్ వద్దకు, ఆయన భార్య వద్దకు వెళ్ళి ఒక్కొక్కళ్లదగ్గిర అరగంటకుపైగా వందనాదికాలు ఆచరించారు. తనవంటి నిరక్షరకుక్షిపై దయతలచి దీవికి గవర్నరుగా చేస్తున్నందుకు వారికి తానిక పది జన్మలవరకు ఋణపడివుంటానని చెప్పుకొన్నారు. ఆయన అంత అమాయకంగా వంగి వంగి దణ్ణాలుపెట్టి ఆ వరసను ఆనందబాష్పాలు కారుస్తూ వుక్కిరి బిక్కిరి అయిపోతూవుంటే, అది చూసిన ఆ డ్యూక్ దంపతులు యింత కపటమెరుగనివాణ్ణి పట్టుకు వేళాకోళం చేస్తున్నందుకు ఒక్కక్షణంసేపు తమ మనస్సులో తామే బాధపడ్డారు. మళ్లీ ఎందుకనో—ఆ భావాన్ని మనస్సులోనే అణిచేసుకొని అనుకొన్న ప్రకారం ఆతంతు అంతా నడిపించటానికే నిశ్చయించుకొన్నారు.

డ్యూక్ దంపతులతో వీడ్కోలు యీతీరుగా ముగిసింది కాని డాన్ క్విక్ సెట్ గారివద్ద శాంకోపాంజాగారు శెలవు తీసుకొన్నవైనం చాలా హృదయ విదారకంగా నడిచింది. వీరకేసరి డాన్ క్విక్ సెట్ గారు, యింతకాలం తనను నమ్మి కంటికి రెప్పవలె కాపాడుతున్న శాంకో పాంజా యిప్పుడు తనకు దూరమైపోతున్నందుకు, ఆ వియోగబాధను భరించలేక రెండుకళ్లనుంచీ జొటజొట అశ్రువులు రాల్చారు. ఆయన కార్చిన ఆ కన్నీటిలో ప్రతి బిందువూ ఆయనగారికి శాంకో పాంజాపట్లగల ఎనలేని ప్రేమకు ప్రబల తార్కాణంగా మనం ఎంచవచ్చు. శాంకో పాంజాగారు పడుతున్న ఆ బాధ, ఆ ఆవేదన మాటలలో వర్ణించి చెప్పలేం. కొత్తగా కాపరానికి వెళ్లుతున్న పల్లెటిదిక్కుపిల్ల ఏడ్చినంత కయ్యాళీగా ఏడ్చేశారు. ఎట్టకేలకు డాన్ క్విక్ సెట్ గారే ఎలాగో ఓలాగు మనిషి కొంచెం తెప్పరిల్లి "పోయిరమ్ము! శాంకో! తనువులు వేరైనా మన మనసు లొకటే!"...(ఒకటి రెండు గుటకలు మింగి) "క్షేమముగా నేగి, లాభముగా రమ్ము! నే నెందున్ననూ సతతమూ నీ ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధికై ఆ కరుణామయుని ప్రార్థించెదను. పోయి రమ్ము!" అంటూ శాంకో పాంజాగారి నెత్తిమీద రెండు చేతులు పెట్టి దీవించాడు.

ఆ మాటలతో శాంకో పాంజాగారి విచారం కట్టలు తెంచుకు ప్రవహించింది. ఆ హాలు హాలంతా వీరుభయుల కన్నీటితో కాలువలు కట్టింది. శాంకో పాంజాగారిని లేవనెత్తి బిగకౌగిలించుకొని, మరొక పది నిముషాల పాటు వెక్కి వెక్కి ఏడ్చి, కాలాతీతం అవుతున్నదన్న విషయం జ్ఞప్తికి రాగా శాంకో పాంజాగారిని జబ్బపట్టుకు నడిపించుకుని ఆ హాలు గుమ్మందాకా వచ్చాడు. ఆపినకొద్దీ ఆయన ఏడుపు ఎక్కువౌతున్నది. ఇక అక్కడ వుండలేక, శాంకో పాంజాగారు సాంతం కంచరగాడిద నెక్కే వరకూ చూస్తూ నిలబడలేక, ఆయన హాలుతలుపులను గభీమని వేసేసి, చకచకా పోయి మంచంమీద బోర్లబొక్కలా పడుకొని కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు. అలా ఏడుస్తూనే- తన చేతిలో గనక ఆ అధికారంవుంటే శాంకో పాంజా గవర్నరుగిరీని వెంటనేరద్దు చేసి పారేసి తనవద్దనే వుంచుకొందునుకదా- అని కూడా అనుకొన్నాడు. ఏమనుకొంటే ఏం లాభం! ఆ అధికారం తనకు లేదుగదా అని సరిపెట్టుకు వూరుకొని, కొంతసేపటికి తనకు తెలియకుండానే నిద్రపోయాడు.


వీరకేసరిగారు యీ వరసను వైరిగంగురులెత్తి తల్లికి దూరమైపోయిన, బిడ్డలా మొఖంపెట్టేసి, కాలుగాలిన పిల్లిలా యిల్లంతా అదేపనిగా తిరుగుతూ వుంటే డ్యూక్ భార్య మనస్సు చివుక్కుమన్నది.


వీళ్ళిదరికీ ఎడబాటు చేసినందుకు ఆవిడ చాలా పరితపించి తమ ఆస్థానంలో వుండే నౌకర్లలో కానీ, దాసీలలో కాని ఎవరు నచ్చితే వారిని యీ వీరకేసరిగారు యదేచ్ఛగా, తన యిష్టంవచ్చినంతకాలం బంటుగా అట్టే పెట్టుకొని యీ మనఃక్లేశాన్ని పోగొట్టుకొమ్మని నిద్ర లేచాక ఆయనను ప్రతిమాలింది.

ఆవిడ అంత యిదై చెప్పినా, తన శాంకో పాంజావంటి బంటు యిదివరకు పుట్టలేదనీ, యికముందు పుట్టబోడనీ చెప్పి, అలాంటి బంటు 'లేడు లేడని ముందు యుగముల పురుషులు తల లూపవలదె' అంటూ నిట్టూర్చాడు. అంతే కాదు,—తన శాంకో పాంజా తనవద్ద లేకుండాపోయినప్పుడు తనకు మరొక సేవకుడు ఎవరూ అక్కరలేదనీ, తనకు తానే సేవకుడుగా వుంటాననీ చెప్పి, ప్రస్తుతం డ్యూక్ గారు గానీ ఆయన భార్య కాని, తదితరులు కానీ తనకు చేయగలిగిన గొప్ప సహాయమల్లా, తనను మరికొంత సేపు ఒంటరిగా వుండనివ్వటమే ననీ సవినయంగా విన్నవించాడు.

ఘనత వహించిన గవర్నరు శాంకో పాంజా గారు కంచరగాడిద నెక్కి, అశ్వము లెక్కిన అంగరక్షకులు మేళతాళాలతో వెంటరాగా, మందగమనాన ముందుకు పోతున్నారు. ఆయన అంగరక్షకులలో ఒకడు కొంతసేపటికి ఎలాగో ధైర్యం తెచ్చుకొని యీయనగారి ప్రక్కకువచ్చి మాటలు మొదలు పెట్టాడు. వాడడుగుతున్న ఆ ప్రశ్నలకు యీయన మహాభావంగా సమాధానాలు చెప్పుతున్నారు. అలా కొన్ని మైళ్లదూరం ప్రయాణం చేశాక, తాను గవర్నరు కాబోతున్న బారటారియా పట్టణాన్ని యీయన సురక్షితంగా చేరుకొన్నారు.

డ్యూక్ గారు అంతకుముందే చేసిన ఏర్పాట్ల ననుసరించి ఘ. వ. గవర్నరుగారు పట్టణపొలిమేరల్లో కాలు పెట్టగానే పురప్రముఖులు, మేజిస్ట్రేట్లు ఎదురు





బొమ్మల ముగ్గులు

—బండారు శ్రీదేవమ్మ

జాంధ్రపేట.

డాన్ క్విక్ సెట్

వచ్చి స్వాగతమిచ్చారు. అధికారచిహ్నాలైన తాళం చెవుల గుత్తులను ఆయన చేతికి తాకించారు. చర్చి గంటలు గణగణ మోగించారు. పట్టణంలోని ప్రజలంతా వీధుల్లో నిలబడి క్రొత్త గవర్నరుగారికి ఘన స్వాగతమిచ్చారు. ముఖ్య వీధులలో సంచారం ముగిశాక, యీయనను స్థానికాధికారులు పెద్ద చర్చికి నడిపించుకు వెళ్లారు. అక్కడకూడా క్రొత్తగవర్నరుగారి ఆయురారోగ్యాభివృద్ధికై ప్రార్థనలు జరిగాక, అటునుంచి అటే న్యాయస్థానానికి తీసుకువెళ్ళి వున్నతమైన సింహాసనంమీద కూర్చుండబెట్టారు.

అప్పటికప్పుడే రెండు కేసులు విచారణకు వచ్చాయి. వాటిలో మొదటికేసు ఒక రైతుకు ఒక దర్జీకి వచ్చిన తగాదావిషయం. ముందు దర్జీ బోనులోకి ఎక్కి, ఆరైతు ఒక గుడ్డముక్క తెచ్చి తన చేతికి యిచ్చి 'యిది ఒక టోపీ తయారుచేయటానికి సరిపోతుందా' అని అడిగాడనీ, తాను సరిపోతుందన్నాననీ చెప్పాడు. అందుమీదట ఆరైతు 'రెండు టోపీలకు సరిపోతుందా' అని అడిగాడనీ, తను సరిపోతుందన్నాననీ, మళ్లీ 'మూడుటోపీలకు సరిపోతుందా' అని అడిగాడనీ, తాను అందుకూ సరిపోతుందని చెప్పాననీ, చివరకు 'ఐదుటోపీలకు సరిపోతుందా' అని ఆ రైతు అడిగితే తాను సరిపోతుందని చెప్పి ఆ ప్రకారమే ఆ గుడ్డలో ఐదుటోపీలు కుట్టేననీ న్యాయస్థానానికి విన్నవించాడు. రైతు కోరినప్రకారమే తాను ఐదుటోపీలు తయారుచేసినా, ఆయన తనకు న్యాయంగా రావలసిన మజూరీ యివ్వటం లేదని ఫిర్యాదు చేశాడు.

ఘ. వ. గవర్నరు శాంకో పాంజాగారు ఆ రైతువైపుకు తిరిగి 'నిజమేనా?' అని అడిగారు. ఆ రైతు వంగి వంగి మూడు దణ్ణాలు పెట్టి "నిజమేనండి. కానీ తమరు ఆ టోపీలను ఒక్కసారి తిలకించండి" అంటూ తన కోటుజేబులోకి చేతిని పోనిచ్చి ఐదు టోపీలనూ పైకి తీశాడు. అవి ఆ చేతి ఐదు వేళ్ళకు సరిపోయేటంతే వున్నాయి! ఐదు టోపీలను ఐదువేళ్లకు పదిలంగా తగిలించుకొని కోర్టులో వున్న వారికందరికీ కనిపించేలా చేతిని పైకి ఎత్తాడు. కోర్టులో వున్నవారందరూ ఘొల్లున నవ్వారు.

ఘ. వ. శాంకో పాంజాగారు కూడా చిన్న మందహాసంచేసి కోర్టునంతా నిశ్శబ్దంగా వుండమని చెప్పి ఈవిధంగా తీర్పు యిచ్చారు. "ఆ రైతుకీ, యీ దర్జీకీ ఏర్పడిన యీ తగాయిదాలను పూర్తిగా విచారించినమీదట, న్యాయాన్యాయాలను నిష్పాక్షికంగా పాటించినమీదట, దర్జీకి టోపీలు కుట్టినందుకు కూలీ గిట్టనక్కరలేదనీ, రైతు తాను కొనుక్కొన్న గుడ్డముక్కను నష్టపోవాల్సిందేననీ, తయారైవున్న యీ టోపీలు ప్రభుత్వ ఖైదులలో బందీలైవున్నవారికి వుచితంగా పంచిపెట్టాలనీ కోర్టువారు తీర్పు యిచ్చుచున్నారు. ఇంతటితో యీ తగువు తీరిపోయినట్లు కోర్టువారు భావించడమైనది."

రైతు, దర్జీల తగవు ఆ విధంగా పరిష్కారమైపోగా, యిద్దరు వృద్ధులు తమ కేదో తగువు వచ్చిందని ముందుకు వచ్చారు. ఆ యిద్దరిలో ఒకడు రెండోవాడికి కొంతకాలంక్రితం పది బంగారు నాణేలు అప్పుగా యిచ్చాడట. రెండోవాడు తానా బాకీ ఎప్పుడో తిరిగి యిచ్చేశానని బుకాయిస్తున్నాడట. తానా బంగారు నాణేలు అప్పుగా యిచ్చిననాడు చూసినవాళ్లు కానీ, మళ్లీ బంగారునాణేలు తిరిగి పుచ్చుకొన్నప్పుడు చూసినవాళ్లు కానీ సాక్షులు ఎవరూ లేరనీ, అలాంటి సందర్భంలో రెండోవాడిచేత న్యాయస్థానంవారు ప్రమాణం చేయించి బాకీ తీర్చినట్లుగా చెప్పిస్తే తాను తన ఫిర్యాదును వుపసంహరించుకొంటానని చెప్పుకొన్నాడు.

చేతిలో ఒక కర్ర విడవకుండా పట్టుకొనివున్న ఆ రెండో ముసలాయన వైపుకు తిరిగి ఘ. వ. గవర్నరు శాంకో పాంజాగారు "మీరేమి చెప్పుకొంటార" ని అడిగారు.

"అయ్యా! ఆయన నాకు పది బంగారు నాణేలు అప్పుగా యిచ్చారన్న మాట ఒప్పుకొంటున్నాను. తమరొక్కమారు మీచేతిలోవున్న ఆ

ధర్మదండాన్ని యిలా చాపి పట్టుకొంటే, దానిని తాకి, నేనా మొత్తాన్ని ఆయన చేతికి యిచ్చివేశానని ప్రమాణంచేసి చెప్పతాను." అని ఆ రెండో ముసలాయన అన్నాడు.

శాంకో పాంజాగారు ధర్మదండాన్ని చాపారు. దాన్ని తాకి ప్రమాణం చేస్తానన్న ఆ ముసలాడు, తన చేతిలోవున్న కర్రను కాసేపు పట్టుకోమన్నట్లుగా ఆ మొదటి ముసలాడిచేతికి అందించి తాను యివతలకు వచ్చి, ధర్మదండాన్ని తాకి "ఈ ధర్మదండమే సాక్షిగా, నేను ఆయనవద్ద తీసుకొన్న పది బంగారు నాణేలను ఆయన చేతికి యిచ్చానని ప్రమాణం చేసి చెప్పతున్నాను." అని యివతలకుచక్కా వచ్చాడు.

ఫిర్యాది అయిన మొదటి ముసలాయన యీ ప్రమాణంతో సంతృప్తిపడ్డాడు. ఆయన ఎప్పుడో ఆ మొత్తాన్ని తనకు తిరిగి యిచ్చివేస్తే, తానే ఆ విషయం మరచిపోయివుంటానని తన మనస్సుకు సమాధానం చెప్పుకొన్నాడు. ప్రమాణంచేసివచ్చిన ఆ ప్రతివాది యివతలకు వచ్చి, వాదిచేతికి యిచ్చిన తన కర్రను మళ్లీ తను పుచ్చేసుకొని కోర్టు బయటికి వెళ్లిపోబోతున్నాడు.

కర్ర పట్టుకొనివున్న ఆ ఆసామిని ఘు. వ. గవర్నరుగారు పేరుపెట్టి పిలిచి "ఏదీ—నీ చేతిలో వున్న ఆ కర్రను నన్ను ఒక్కసారి చూడనీ!" అంటూ చేయి ముందుకు జాపారు.

"చిత్తం; చిత్తం" అంటూ ఆ ఆసామి తన కర్రను తీసుకువచ్చి గవర్నరుగారి చేతిలో అతిభక్తితో పెట్టాడు.

కర్ర అందుకొన్న వెంటనే గవర్నరుగారు రెండో ముసలాయనను పిలిచి "నీ బాకీకి బదులుగా యీ కర్ర పట్టుకుపో" అని ఆయన చేతిలో యీ కర్రను పెట్టాడు.

ప్రతివాదిచేత ప్రమాణం చేయించిన తరువాత కూడా యింకా, బాకీకి బదులుగా యిది ఎందుకు పట్టుకుపొమ్మంటున్నారో అనీ-అథవా బాకీ తీరకపోయినా, యీ వెధవకర్ర ఖరీదు పది బంగారునాణేలు వుంటుందా అనీ వాది అనుమానిస్తూ, ఎటూ పాలుపోక విస్తుపోయి చూస్తూ "స్వామీ! అయితే యీ



ఒంటి గీత బొమ్మ

—బృందావన్ (15 సం.) పార్వతీపురం.

కర్ర ఖరీదు పది బంగారునాణేలు అవుతుందంటారా?" అని జంకుతూనే అడిగాడు.

"అవును. దాని విలువ పది బంగారు నాణేలు వుండితీరాలి. అలా కాకపోతే నా బుర్ర ఎందుకూ పనికిరాని మట్టిబుర్ర అన్నమాటే! కావాలంటే ఆ కర్ర పగలకొట్టి చూడు" అన్నారు గవర్నరుగారు చిరునవ్వు నవ్వుతూ.

వాది వెంటనే కర్రనుపట్టుకు, నడిమికి రెండుగా విరిచేశాడు. ఆశ్చర్యం! అందులోంచి పది బంగారు నాణేలు ఖంగున నేలమీద రాలాయి. కర్రను లోపల అంతా డొల్లగా చేసి, అందులో పెట్టాడు కాబోలు, ఈ పది నాణేలను! అక్కడవున్న వందమందీ ఆశ్చర్యపోయారు.

కోర్టు అధికారుల్లో ఎవరో ఒకరు వుండబట్టలేక ఘు. వ. గవర్నరుగారిని అడిగేశారు 'తమరా విషయాన్ని ఎలా కనిపెట్టా'రని. "ఏమున్నదీ? ధర్మ

(43-వ పేజీ చూడండి)

★ చిటికెలు ★

ఒకవూళ్లో ఒక కాపూ, ఆయన భార్యా కాపురముండే వారు. వాళ్లిద్దరూ ఎల్లవేళలా 'నే నెక్కువ పని చేస్తున్నానంటే, 'నే నెక్కువ పని చేస్తున్నా'నని తెగ వాదించుకొనే వారు.

"మీ ఆడవాళ్లు ఏం కష్టపడుతున్నారు? మొగవాడు నానా యాతనలు పడి, ఏగడ్డో కరిచి యింత సంపాదించి తెచ్చి యింట్లో పడేస్తే, వేళకు పట్టెడు అన్నం వండి పెట్టటమేగా మీరు చేసేది?. మొగవాడు బయట ఎండనక, వాననక కష్టపడి పనిచేస్తుంటే ఆడది యింట్లో హాయిగా కూర్చుని "అబ్బా! మేం ఎంత కష్టపడి పోతున్నాము" అంటారు. బయటకుపోయి పనిచేస్తే తెలుస్తుంది." అనేవాడు యీ మొగవాడు.

"అయితే నాలుగు డబ్బులు సంపాందించుకు రావటంతోనే తీరిపోయిందా? మా పని వండి వారిస్తేనే అయిపోయిందా? ఎన్ని సరిచూసుకోవాలి? ఇంట్లో వాళ్లకీ, యింటికి వచ్చిన వాళ్లకీ వేళకి అన్నీ అమర్చాలా? యీ పిల్లలను సరి తీయాలా? వాళ్లను పెంచి పెద్ద వాళ్లను చెయ్యాలా? ఒక్క రోజు యింటిపట్టున వుండి ఆడవాళ్లు చేసేపని చేస్తే తెలుస్తుంది–తమరెంత సుఖపడు తున్నారో?" అని ఎదురు సవాలు వేసేది యీ ఆడ పడుచు.

ప్రతిరోజూ యిలాగే మాటలతో మాత్రమే ముగిసే వాదన ఆరోజు పంతం కిందికి దిగింది. "సరే అయితే! రేపు నువ్వు పొలానికి పోయి పనంతా పూర్తి చేసుకురా! నేను యింటివద్ద వుండి వంటచేసి అక్కడ పారేస్తాను" అన్నాడు పౌరషం పెరిగిన ఆకాపు. సరే అంటే సరే అంది ఆయన భార్య.

మరునాడు తెల్లవారు ఝామునే కోడి కూతతో యిద్దరూ నిద్దర లేచారు. కాపు భార్య ఎడ్లను తోలుకొని పొలానికి వెళ్లిపోయింది. కాపు చీపురుకట్ట పట్టుకువచ్చి పాచిపని ప్రారంభించాడు.

కాపు భార్య పొలంలో నడ్డి వంచి పగలంతా పనిచేసింది. సాయంకాల మయ్యేసరికి ఎద్దులకు మేతకోసమని గంపెడు గడ్డికోసింది. గడ్డిఅయితే కోసి అక్కడ కుప్ప పెట్టింది కానీ, దాన్ని కట్టగా కట్టుకొనేందుకు మోకు ఏకీయింటి నుంచి తెచ్చుకోలేదు. ఊరికి మూడు మైళ్లదూరంలో వున్న యీ పొలాలలో మోకు అరువు యిమ్మని ఎవరిని అడుగుతుంది. ప్రక్క పొలాలలో పనిచేస్తున్న మనుష్యులు కూడా అప్పటి కప్పుడే యిళ్లకు మళ్లిపోయారు. ఏదీ చెయ్యటానికి దిక్కు తోచలేదు. గడ్డి అక్కడ వదిలేసి వెళ్లుదామా అంటే, రాత్రికి పశువులకు మేత వుండదేమో! కాకపోయినా 'ఆయన' పొలంలో మోకు లేకుండా చూసి తనను గడ్డికోసుకు రమ్మంటాడా అని ఆవిడగారికి చాలా కోపంవచ్చింది. ఇదంతా తనను ఏడ్పించటానికే ఆయన అలా చేశారని తెగ వుడుక్కొంది. ఆవిడ అసలే అలా వుడుక్కొంటూ వుండగా తనకు మధ్యాహ్నం భోజనం రానేలేదనీ, తాను యింత వరకూ భోజనమే చేయలేదని అప్పుడే జ్ఞాపక మొచ్చింది. దాంతో ఆవిడ నిప్పు తొక్కిన కోతి అయింది. ఆయన సంగతేమిటో కనుక్కొందామని గుప్పెళ్లు బిగించి యింటిదారి పట్టింది.

చెరువుగట్టు ఎక్కి చూసేసరికి 'ఆయన'గారే యిటు వస్తున్నాడు. ఆయన చేతిలో దుడ్డుకర్ర వున్నది. మనిషి వుగ్ర నరసింహావతారం దాల్చి, బుసలు కొట్టుతూ వస్తున్నాడు. ఆయనగారి ఆకారం కంటబడగానే ఆవిడ గుండె గతుక్కు మన్నది.

"చిటికెలు ఎక్కడ పెట్టావే దౌర్భాగ్యపు పీనుగా? ఇల్లంతా వెతకలేక చచ్చాను!" అంటూ ఆకాపు కోపం కక్కుతున్నాడు.

తనకు యింతవరకు అన్నం పంపించకపోగా, 'చిటికెలుట–చిటికెలు–అవి ఎక్కడ పెట్టావని' గుడ్లు

ఘురుము తాడేమిటా అని ఆవిడ మరింత కంటగించుకొంది. ధుమ ధుమ లాడుతూ అడిగింది - "చిటికెలు ఏమిటీ? చిటికెలు !"

"అవే నే - చేటలో బియ్యం చెరిగేటప్పుడు చప్పుడు అవుతాయే? అవే - ఆ చిటికెలు. వాటి నెక్కడో కనపడకుండా దాచేసింది కాక, చిటికెలు ఏమిటని కూడా అడుగుతున్నావ్; ఫుండా కోర్ !" అంటూ దుడ్డుకర్ర పైకెత్తాడు.

కొట్టటానికి ఆయన కర్ర ఎత్తితే ఆవిడ పకలబడి నవ్వుతున్నది. కాపుకు పరిస్థితి ఏమీ అర్థంకాలేదు "సిగ్గులేక నవ్వుతావేం?" అని ఆయన గద్దించాడు.

"మీ వంట ఎత్తుబారమల్లే వుంది చిటికెలు అంటే అదేదో ఒక వస్తువు అనుకొన్నట్లున్నారు. చేటలో బియ్యంపోసి చెరుగుతుంటే చేటవచ్చి చేతి వేళ్లకు తగిలినప్పుడల్లా, అల్లా చప్పుడు అవుతాయి. అంతేకాని మరేమీ కావు. ప్రొద్దుటి నుంచి వెతికినా మీకు అవి కనపడలేదు కాబట్టి యింత వరకు ఎసట్లో బియ్యం పొయ్యలేదన్నమాట. ఈ వాటికి మీ పంతం చాలించి వంటపని మీకు చేతకాదని ఒప్పుకోండి." అన్నది ఆవిడ తనదే పైచేయి అయినట్లు.

"నువ్వేం అఘోరించావు? గొడ్లకు మేత పట్టుకు రాకుండా, చేతులు రుఝాడించుకొంటూ వస్తున్నావేం ?" అని ఆయన అడిగాడు.

శ్రీమతి వి. విజయకుమారి



"అయ్యో నా రాత ! కోసినగడ్డి మూటకట్టి తెచ్చేందుకు తాడు ముక్క లేకుండా చేసి యింకా నన్నంటారేం ? తాడెక్కడ పెట్టారో అడుగుదామనే వస్తున్నా. ఇంతలో మీరూవచ్చారు చిటికెలు వెతుక్కుంటూ!"

"గడ్డిమోపు కట్టటానికి వేరే తాడెందుకే వెర్రి మొఖమా! నాలుగు గడ్డిపోచలు మెలివేస్తే అదే తాడు అవుతుందిగా ! ఈ పాటి తెలివి యని దానివి నువ్వేం పొలంపని చేయగలవు ? ఇకనైనా బుద్ధి తెచ్చుకొని ఎగిరి గంతులు వెయ్యక, వంటయింటి పట్టున పడివుండు"

"ఏమండోయ్ ! బుద్ధి తెచ్చుకోవలసింది నేనొక్కర్తినే కాదు. ఎందుకు వచ్చిందికానీ, రేపటి నుంచీ మామూలుగా మీరు పొలంపనీ, నేను యింటిపనీ చూసుకొందాం. పదండి యింటికి. ఆకలికి చెవులు ఘుడీయలు పడిపోతున్నాయి."

ఆనాటి నుంచీ నేటివరకు ఆ దంపతులు 'నేనెక్కువ' అంటే 'నే నెక్కువ' అని వాదించుకోవటం విరమించుకొన్నారు. ఈకథ విన్న యిరుగుపొరుగు అమ్మలక్కలు, అయ్యతమ్ములు కూడా యీ మాదిరి వాదనలవల్ల ప్రయోజనం లేదని తెలుసుకొన్నారు. ★

సైంటిస్టు

పిల్లల నాటిక

కమలాకరం = సైన్సు మాస్టారు
కాంతం = కమలాకరంగారిభార్య.
రామం=కమలాకరంగారి కొడుకు.

1 వ రంగం

(కమాలాకరం, వరండాలో అటూ యిటూ తిరుగుతుంటాడు, అతనిభార్య కాంతం, కూరగాయలు తరుగుతూంటుంది.)

కమలాకరం : కనిపెట్టాలి !... కపిపెట్టి తీరాలి !

కాంతం : ఏమిటండికనిపెట్టడం?


కమలా : మనపేరు సువర్ణాక్షరాలతో చరిత్రలో లిఖింపబడాలీ అంటే,...కనిపెట్టాలి...తప్పదు. కనిపెట్టాలి.

కాంతం : సువర్ణాక్షరాలతో లిఖించటమేమిటి ? కనిపెట్టడమేమిటి ? స్కూలునుంచి వచ్చారో, లేదో, యీ ధోరణి మొదలుపెట్టారేం ?

కమలా : మనకీర్తి కలకాలం నిలిచి పోవాలంటే ఏదో ఒక కొత్త విషయం కనిపెట్టాలి.

కాంతం : కొత్త విషయం ఏమిటండి? నాకేం అర్థం కావడం లేదు.

కమలా : ఏడిశావ్ ! కూపస్థమండూకంలా, వంటయింట్లో పడి ఏడిసేదానవు : నీకేం అర్థం అవుతుంది ? మాలాంటి సైంటిస్టులకు అర్థం అవుతుంది కానీ !-మార్కోనీ రేడియో కనిపెట్టాడు. రాంటజన్ ఎక్సరే కనిపెట్టాడు. స్టీవెన్సన్ రైలు యింజను కనిపెట్టాడు. ఎందరో ఎన్నో కనిపెట్టారు. ఎందరు ఎన్ని కనిపెట్టితే ఏం ? మనంకూడా ఏదో ఒక అత్యద్భుతమైన గొప్ప విషయాన్ని కనిపెట్టాలి కాని.



కాంతం: (నవ్వుతూ) చంపేశారు; కనిపెట్టడం అంటే అదా? యింకా ఏమిటో అనుకున్నాను. (యింట్లోకి పోయి కాఫీతీసుక వస్తుంది) కనిపెట్టడం అంటూ ఏదైనా వుంటే, తరువాత చూసుకోవచ్చునుకాని, స్కూల్లో వాగి వాగి అలసివచ్చారు - ముందు యీ కాఫీ త్రాగండి.

కమలా: నాన్‌సెన్సు!...... భోజనం, కాఫీ, విశ్రాంతి, నిద్ర యివేం వద్దు...ముందు ఏదో ఒక నూతన విషయం కనిపెట్టి ప్రపంచానికి విజ్ఞానభిక్ష పెట్టాలి! కమలాకరం పేరు కలకాలం నిలిచేటట్టు చేసుకోవాలి. అంతవరకు అహోరాత్రాలూ, అన్నహారాలు మాని కృషి చేస్తాను.

కాంతం: కనిపెడతారు-కనిపెట్టకేం? మీ అబ్బాయీ కనిపెట్టాడు, మారుతాళాలతో పెట్టెలు తెరచి డబ్బులు పట్టుకుపోవటం. యిక మీరేం కనిపెడతారో మరి? ఎందుకండి, మీకీ అనవసరపు చాదస్తం, శుభ్రంగా స్కూల్లో పాఠాలు చెప్పకుని, యేదో యింత తిని హాయిగా యింట్లో కూర్చోక.

కమలా: పిచ్చిదానా! అందరూ అల్లా అనుకుని యింట్లో కూర్చుంటే, యీ రైళ్లు, యీ విమానాలూ, యీ సినిమాలూ, యీ రేడియోలూ, యీ ఆటంబాంబులు, కిమిబాంబులూ, యివన్నీ ఎలా గొచ్చేవనకుంటావు? ప్రపంచంలో యీమాత్రపు విజ్ఞానం ఎలావచ్చేదనుకున్నావ్? అసలు దేశాన్ని బాగుచేసేది మాలాంటి సైంటిస్టులే! ఫలానా సైంటిస్టు శ్రీశ్రీశ్రీ కమలాకరంగారి భార్య 'కాంతం' అంటె నీకు ఎంత గౌరవం! ఎంత ప్రతిష్ట!! ఆ విషయం ఆలోచించావా?

కాంతం: అటువంటి గౌరవాలు నాకేం అక్కర్లేదు కాని, ముందు ఆ కాఫీ కాస్త తీసుకోండి; చల్లారిపోతోంది.

కమలా: అబ్బా! చంపేస్తున్నావే! (కాఫీ త్రాగుతాడు) అది నీ ఖర్మం! అటువంటి గౌరవాలు నీకెందుకు? నీ బ్రతుకంతే! నీ బ్రతుకు ఆ వంటయింట్లో యిల్లా తెల్లారిపోవలసిందే! గౌరవం, పేరు

శ్రీ కేతినీడి నరసింహారావు

ప్రతిష్టలు నీకు ఎందుకులే? కూపస్థమండూకంలా ఆ వంటగదిలోనే తగులడు, నా పనికిమాత్రం అడ్డు తగలకు.

కాంతం: మీకు ఏది పట్టుకుంటే అదే...ఒకటే రోద. కనిపెడతారట! కనిపెట్టకేం? (విసుకుగా వంటగదిలోకి వెళ్ళిపోతుంది).

కమలా: (తన ధోరణి మార్చుకోకుండా-తనలో) ఆరి వెధవ! ఎంత తెలివైన ప్రశ్న వేసాడు! నిజంగా వాడి తెలివితేటలకు మెచ్చుకోవాలి.

రామం: (అప్పుడే స్కూలు నుంచి వచ్చాడు) చేతిలో పుస్తకాలు వున్నాయి ఏమిటి నాన్నా అది? ఎవరూ ప్రశ్న వేస్తె?

కమలా: ఇంకెవరూ? ఆ రమణగాడే!

రామం: ఏమని ప్రశ్న వేశాడు?

కమలా: ఏం ప్రశ్నంటావా? "చేపనీటిలో వుంటుంది కదా?—దానికి రొంప పట్టదేమండీ" అని అడిగాడు, నిజంగా వాడి తెలివితేటలకి మెచ్చుకోవాలి.

(లోపలనుంచి కాంతం, వరండాలో రామం, పకపకా నవ్వులు)

రామం: (నవ్వుతూ) మరి మీరేం సమాధాన మిచ్చారు?

కమలా: సమాధానం యివ్వడానికి అది సామాన్యమైన విషయమా? ఇంతవరకూ ఆ విషయాన్ని ఏ సైంటిస్టు కనిపెట్టలేదు. ఆ విషయం కనిపెట్టడానికి ప్రాక్టికల్స్ చేయాలి. ఆ విషయం కనిపెట్టామా, అంటే, సైంటిస్టు కమలాకరంగారి పేరు సువర్ణాక్షరాలతో చరిత్రలో నిలిచిపోయిందన్నమాటే (ఇంకా బిగ్గరగా) కనిపెట్టాలి...అవును......తప్పకుండా కనిపెట్టి తీరాలి!

రామం: దానిలో కనిపెట్టడానికి ఏముందీ నాన్నగారూ! భూమిమీద జంతువులు, గాలిలో పక్షులు, ఎలా జీవించగల్గుతున్నాయో, నీటిలో చేపలూ అలాగే జీవించుతున్నాయి. అదంతా భగవత్ సృష్టి. అది దాని స్వాభావం. అలాంటప్పుడు దానికి రొంప పట్టడం ఏమిటి? మీరు కనిపెట్టడమేమిటి?

కమలా: ఏడిశావులే, పెద్ద తెలుసున్నట్లు, నాకు చెప్ప వచ్చావ్! గ్రుడ్డువచ్చి పిల్లను ఎక్కిరించిందట: చిన్నప్పటినుంచి సైన్సు పాఠాలు వల్లించాను. ఎన్నో ప్రయోగాలుచేసి ఎంతో అనుభవం

★ సైంటిస్టు ★

సంపాదించాను. ఆమాత్రం విషయం నాకు తెలియదనుకున్నావా?

రామం: మీాయిష్టం బాబు, మీాతో యేంచెప్పినా తంటాయే! నాకెందుకు? నే వెళ్ళిపోతాను. (వెళ్ళిపోబోయూడు.)

కమలా: ఒరోయ్! రామం! మాట.

రామం: ఎందుకండీ?

కమలా: నువ్వు ఒక పనిచేసి పెట్టాలి.

రామం: ఏమిటండీ అది?

కమలా: బజారుకెళ్ళి ఒకమంచి చేపనుకొని......

రామం: ఛా...చా. నేనెప్పుడూ ఆ బజారుకు వెళ్ళలేదండి. ఎవరైనా చూస్తే...

కమలా: తింటానికా, ఏమయినానా? ప్రాక్టికల్ చేయడానికే కదూ! ఫరవాలేదు: వెళ్లిరా. ఇదిగో డబ్బులు.

(డబ్బులు యిస్తాడు)

(రామం డబ్బులు తీసుకుని బయటకు వెళ్ళిపోయూడు)

2 వ రంగం

(కమలాకరంగారు అప్పుడే స్కూలునుంచివచ్చి, పుస్తకాలను కోపంగావిసరి పడేసి అటూ ఇటూ తిరుగుతున్నాడు.)

కమలా: ఓరోయ్! రామం! రామం!

కాంతం: (లోపలనుంచి) ఏమిటండి అది.

కమలా: ఏడీ, ఆ వెధవ, ఎక్కడ?

కాంతం: ఇంకా స్కూలు నుంచి రాలేదు. ఇంటికి రావడంతోనే ఎందుకు వాణ్ణి అలా తిట్టిపోసుకొంటారు?

కమలా: తిట్టాలా, చీల్చి ఎండెయ్యాలా! వెధవ... వెధవ... నా బ్రతుకంతా నవ్వులపాలు చేశాడు. తలెత్తుకు తిరుగటానికి వీల్లేకుండా పోయింది.

కాంతం: ఏమిటండీ? ఏం చేశాడూ?

కమలా: వాడు రానీ; చెబుతాను.

(ఇంతట్లో రామం స్కూలు నుంచి వచ్చాడు)

కమలా: ఓరోయ్! రామం, యిలారా!

రామం: ఎందుకండీ!

కమలా: నిన్న నువ్వు బజారు వెళ్ళినప్పుడు ఎవరితోనైనా మాట్లాడావా?

రామం: నిన్న నేను చేప కొని తెస్తుంటే రమణ కనిపించాడండీ.

కమలా: కనిపించి ఏమన్నాడు?

రామం: 'ఓరోయ్! రామం! మీారు చేపలు తినరుకదా; యిది ఎందుకురా పట్టుకెళ్ళుతున్నా'వని అడిగాడండి.

కమలా: నువ్వు ఏమన్నావ్?

రామం: 'చా, తినడానికి కాదురా; మా నాన్నగారు చేపకు రొంప ఎందుకుపట్టదో ప్రాక్టికల్స్ చేసి కనిపెడతారట. అందుకని పట్టుకెళుతున్నాను. అంతే' అని చెప్పానండి.

కమలా: దానికి వాడేమన్నాడు?

రామం: ఏమనలేదండీ, 'ఓహో! అలాగా,' అని వెళ్ళిపోయూడండి.


కమలా: అసలు అది నలుగురికీ కనిపించేలా ఎందుకు తెచ్చావురా, వెధవ! ... ఒకవేళ చూశాడే అనుకో, అలా ఎందుకు చెప్పావంట? ఎంత చెప్పినా బుద్ధిరాదేంరా వెధవ! (రామాన్ని కొట్టాడు. రామం పెద్దగా ఏడుపు మొదలు పెట్టాడు.)

కాంత: (వంటగదిలోంచివచ్చి) ఎందుకండీ, వాణ్ణి అలాగ కొడతారు?

కమలా: కొట్టాలా? చీల్చి పారేయూలా? ప్రొద్దున్నే స్కూలు కెళుతుంటే, ఏ గోడ మీాద చూసినా, "సైన్సుమాష్టారు చేప రుచి కనిపెట్టారోహో" అని బొగ్గుతో పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాసివుండె. ఆపని యింకెవరూ కాదు—ఆ రమణగాడే చేసి వుంటాడు. "చేపకు రొంప ఎందుకు పట్టదండీ" అని అడిగినవాడు కూడా వాడే. అయినా యీా వెధవ, ఆ వెధవకు చేప ఎందుకు చూపాడంట! అప్రతిష్ట! నలుగురులో తలెత్తుకుని తిరుగలేక పోయూను, తుంటరి వెధవలు!

కాంతం: వాడి తప్పేముంది? చేప ఎందుకంటే చెప్పి వుంటాడు. అయినా చేపకు రొంప పట్టడమేమిటి; దానిని మీారు కనిపెట్టడమేమిటి? నా బొంద! ★

(తెర)



జంతుకోటిలో మానవలక్షణాలు

ఏనుగను మచ్చిక చేసుకోవాలంటే మంచి మందు లంఖణమేనని అందరికీ తెలుసు. మచ్చిక చేసుకోవటానికే కాదు; దానికివున్న తెలివి తేటలను కనిపెట్టాలనుకొన్నప్పుడు కూడా యిదే మందు ప్రయోగించ వచ్చు. అయితే ఒక చిక్కు వుంది. ఏజంతువునైనా హద్దుకు మించి మాడ పెట్టితే, దానిబుర్ర అసలే పనిచేయకుండా పోతుంది. అందుకనే సామాన్యంగా జంతువుల తెలివి తేటలు కనిపెట్టటానికి పూనుకొనే శాస్త్రజ్ఞులు 24 గంటలకు మించి వాటిని మాడ పెట్టడం అనే తెలివి తక్కువ పని ఎప్పుడూ చేయరు.

కొన్ని జంతువులను తిండిపేరు చెప్పి అసలు మభ్య పెట్టనేలేము. పాముల విషయంలో యీపేచీ మరీ ఎక్కువగా వుంటుంది. పాములు తిండి తినటం చాలా అడ్డ దిడ్డంగా వుంటుంది. కొన్ని జంతువులు రోజు రోజంతా మేస్తునే వుంటాయి; మరికొన్ని రోజుకి రెండుసార్లు అనో మూడు సార్లు అనో లెక్కగా మేస్తాయి. పాములు అల్లాకాదు; ఒక్కసారి ఏకప్పనో చప్పరించిందంటే యిక ఒకటి రెండు రోజులదాకా తిండి జోలికిపోదు. కడుపునిండిన పాము పడగ నీడలో కప్పలు నిర్భయంగా ఆడుకోవచ్చు. కట్టకడపటి సారి తిన్నకప్ప తాలూకు భాగాలన్నీ పాము పొట్టలో సాంతం జీర్ణమయ్యే దాకా దీనికి తిండిపేరు చెప్పితేనే డోకు! కడుపులోవున్న కప్ప కరిగిపోయి, మళ్ళీ కడుపు ముడతలు పడటం ప్రారంభమైనప్పుడే పాముగారు పచారుకు బయలుదేరు తారు. (మనం కూడా అంతేకదండీ! ఏదైనా పని యావలో పడివున్నప్పుడు కడుపులో పేగులు కదలి కదలి గోలపెట్టితే కాని మనం కాలు కదిపి హోటల్ గుమ్మం ఎక్కం)

న్యూయార్కు మ్యూజియంలో ఒక డాక్టరుగారు తాబేళ్లను పట్టుకొని వాటికి తిండిఆశ చూపెట్టి చిక్కుదోవల గుండా నడిపిద్దామనుకొన్నాడు. తాబేళ్లు అంత తిండిపోతులు కావు. అందుచేత యీయన ఎంత వుసికొలిపినా ఆ తాబేళ్లు చిక్కుదారుల్లో జొరబడనే లేదు. అలా 39 సార్లు ప్రయత్నం చేసి చేసి విసుగెత్తి పోయాడు. ఈలోగా ఎప్పుడు యీ తాబేళ్లు చిక్కు దారుల్లో జొరబడుతాయోనని ఆహోరాత్రాలు కనిపెట్టుకు కూచున్నాడు. తను తిండి అయితే అక్కడికే తెప్పించుకు తిన్నాడు కానీ, నిద్రపోవటం ఎలాగు? తనకు నిద్ర వచ్చినప్పుడల్లా స్పిరిట్ లాంపు పట్టుకెళ్లి తాబేలు కాలికి చురుకు అంటించటం మొదలు పెట్టాడు. అప్పుడు అది కదులు తుందిగా! ఆ కదలిక వున్నంతసేపు తనకు నిద్ర రమ్మన్నా రాదు.

డాక్టర్ షినైర్లా అనే ఆయన చీమల విషయంలో ఒక చిత్రమైన విషయాన్ని కనిపెట్టాడు. పుట్ట నుంచి బయలుదేరి వెళ్లుతున్న చీమలకు వాటిదారిలో చిక్కులు పెట్టి చూశాడు. అలాగే ఎక్కడో

★ జంతుకోటిలో మానవ లక్షణాలు ★

యింత బియ్యపు గింజ సంపాదించి ముక్కున కరుచుకొని, ఆ బరువును మోయలేక మోసుకొని గూటికి మరలివస్తున్న మరికొన్ని చీమల దారుల్లో చిక్కులు కల్పించాడు. అలా చూడగా తేలిన సారాంశం ఏమిటంటే - బరువు మోసుకు వస్తున్న చీమలే, ఖాళీగా పోతున్న చీమలకంటె చప్పన చిక్కులు విడమర్చుకొన్నాయని.

చింపాంజీలు ఒకదానితో ఒకటి పోటీ పడేటట్లు చేయటం బలే తేలిక. అలా పోటీలు పడినప్పుడు ఒకదానికంటే మరొకటి తన తెలివితేటలను ఎక్కువగా వుపయోగిస్తుంది. రెండో చింపాంజీ చూస్తూ వుండగా ఒక చింపాంజీకి గనుక మనం ఎవరమైనా ఏదో ఒక బహుమతి యిస్తూ వుండటం తటస్థిస్తే, రెండో చింపాంజీ తాను కూడా అంతకంటే మంచిది కాకపోయినా కనీసం అదేమాదిరి బహుమానాన్నైనా పొందాలని మహాతంటాలు పడుతుంది.

కొందరు మానసిక శాస్త్రవేత్తలు చేరి జంతువులను ముఖ్యంగా కదిలించే విషయమేదో కనిపెట్టటానికి ఒక ప్రత్యేకరకమైన పరిశోధన చేశారు. కొన్ని ఎలుకలను పట్టి తెచ్చారు. ఒక బోనులో అవి కోరుకొనే వస్తువులు, దగ్గరకు పోయి చూడాలనుకొనే వస్తువులను విడివిడిగా పెట్టి వుంచారు. ఆబోనుకు పోయే మార్గంలో కొంత మేర యినపజల్లెడపెట్టి, అందులోకి కావలసినప్పుడు విద్యుత్ ప్రవాహం పంపే ఏర్పాట్లు చేసుకొన్నారు. అవతల బోనుల్లో ఆకలిగొన్న ఎలుకల కోసం తిండి, దప్పిగొన్న వాటి కోసం నీరు అట్టేపెట్టారు. ఆడ ఎలుకలను ఆకర్షించటం కోసం మొగ ఎలుకలను, తల్లి ఎలుకలను ఆకర్షించటం కోసం పిల్ల ఎలుకలను ఆబోనుల్లోనే పెట్టారు. ఆ ఏర్పాట్లన్నీ అయ్యాక విద్యుత్ ప్రవాహం ప్రవహిస్తున్న యీ జల్లెడ మీదుగా అన్ని ఎలుకలను వదిలిపెట్టారు. ఎలెక్ట్రిక్ షాక్‌ను తట్టుకొని అయినా తొందరగా ఏ ఎలుక అవతలి బోనును చేరుకొంటుందో చూస్తూ కూర్చొన్నారు.

వాళ్ల పరిశోధనల సారాంశం ఏం తేలిందంటే-పిల్ల ఎలుక గనుక యింకా పాలుతాగే దశలో వుంటేనే తల్లి ఎలుక దానిని చేరుకోవటానికి తొందర పడుతుంది. (మనుష్యులైనా యింతేగా!) మొగ ఎలుక కోసం ఆడఎలుక తొందర పడటమనేది, ఆ యిద్దరి వియోగం పదిగంటల కాలాన్ని పైబడి వుంటేనేనట! మళ్ళీ యీ రెండు ఆకర్షణాలను పోలిస్తే మొగ ఆడ సంబంధం కంటే, తల్లీపిల్లా సంబంధమే బలీయంగా తోచింది. ఆకలితో అలమటిస్తున్న వాటికంటే దప్పికతో దహించుకుపోతున్న ఎలుకలే వేగంగా ఎలెక్ట్రిక్ జల్లెడమీద నుంచి గెంతేశాయి.

పావురాళ్ల విషయంలో యిలాగే పరిశోధనలు చేసిచూస్తే, గ్రుడ్లను పొదుగుతున్నవీ, పిల్లలను రెక్కల చాటున కాపాడుకొంటున్నవీ అయిన పావురాలు గూటికి వేగం చేరుకోవాలని ఎక్కువగా తొందరపడి మధ్యలో ఎన్ని చిక్కులు పెట్టినా వాటి నన్నిటినీ తమ తెలివితేటలు వుపయోగించి దాటటానికే ప్రయత్నించాయి.

మరొక మానసిక శాస్త్రవేత్త కొంటెతనంగా ఒక కోడిపెట్టా, పుంజా కలిసి మెలిసి తిరుగుతూ వుండగా, మంచి అందంగానూ బలంగానూ వున్న మరొక పుంజును పట్టుకొచ్చి మొదటిపుంజు కండ్ల ఎదుటనే దాని జతఅయిన పెట్టను తీసుకుపోయి ఆ పరాయి పుంజుతో కలిపి ఒక ఆవరణలో పెట్టాడట. అలా కొంతసేపు ఆ మొదటి పుంజును వుడుక్కోనిచ్చి, తరువాత దానిని తన కారులో ఎక్కించుకుపోయి ఎక్కడో కొన్ని మైళ్ల దూరంలో విడిచి చక్కా వచ్చాడట. ఈయన కారులో తిరిగివచ్చి చూసేసరికి మొదటి పుంజు ఎప్పుడు వచ్చిందో, ఎలా వచ్చిందో కాని, అక్కడికే వచ్చి నిల్చొని, ఆ రెండో పుంజుమీద చూపులతో నిప్పులు చెరుగుతున్నదట. ! (ఆ రెండు పుంజులూ క్రిందటి జన్మంలో సుందోపసుందులేమో-కొంపతీసి !)

(ఇంకావుంది)

★ డాన్ క్విక్ సెట్ ★


(.వ పేజీ తరువాయి)


దండం పట్టుకొని ప్రమాణం చేయటానికి రమ్మన మంటే ఆ పెద్దమనిషి వెతికి వెతికి వాది చేతికే తన కర్రను యిచ్చి మరీ వచ్చాడు. ప్రమాణంలో కూడా ఏమన్నాడో గమనించారా! వాది 'చేతిలో పెట్టా నన్నా'డే కానీ, ఆయనకు తిరిగి యిచ్చేశానని కానీ, చెల్లించేశానని కానీ అనలేదు. అదీకాక ప్రమాణం చెయ్యటం పూర్తి కావటంతోటే, ఎంత సంభ్రమంతో పోయి వాడి చేతిలోవున్న తన కర్రను తిరిగి పుచ్చేసు కొన్నాడో మీరు చూచారా! ఇవన్నీ గమనిస్తే కేసు అంతా యిట్టే పట్టుపడిపోతుంది. ఇందులో ఏముంది?" అని నవ్వేశారు శాంకో పాంజాగారు.


డ్యూక్, డ్యూక్ భార్య శాంకో పాంజాగారిని గవర్నరుగా పంపుతూ ఆయన వెంట ఒక వుద్యోగిని ప్రత్యేకం పంపారు. గవర్నరుపదవిలో వుండగా యీాయన ఏ ఏ తెలివితక్కువపనులు చేస్తాడో, ఏ ఏ పరాభవాలు పొందుతాడో అదంతా ఎప్పటి కప్పుడు వ్రాసి పట్టుకురమ్మని ఆ వుద్యోగికి డ్యూక్ దంపతులు పురమాయించారు. అవన్నీ తరువాత ఎప్పుడో తీరికగా కూర్చొని చదివి సంతోషించవచ్చు గదా అని వాళ్లు అనుకొన్నారు. ఆ వుద్యోగి యీ వేళ కోర్టులో జరిగిన కథ అంతా వ్రాయటానికి కూర్చు న్నాడు. రెండు కేసులూ పూర్తి అయ్యేసరికి ఆవుద్యో గికి మతిపోయినంత పని అయింది. డ్యూక్ దంపతులు, తదితరులు చెప్పినదానినిబట్టి శాంకోపాంజా అంతటి శుద్ధ మొద్దు మరొకడు వుండటానికి వీలులేదని యీాయన అనుకొంటూవుండగా, యీ శాంకో పాంజాగారు యింత తెలివైనతీర్పులు ఎలా యిచ్చారో, వారికా ఆలోచనలు ఎలాతట్టాయో అతనికేమీ బోధ పడక, మనిషి సదమదమైనాడు.

(ఇంకావుంది)

★









రాజరాజేశ్వరీవారి "పేదరైతు"లో అంజలీదేవి

చార్లీచాప్లిన్

చార్లీచాప్లిన్ పేరు ఇటీవల మళ్ళీ దిన పత్రికల్లో కెక్కింది. నాలుగేళ్ళ కిందట "ముష్యూర్ వెర్డూ" అనే చిత్రం తీశాడు. అప్పటినుంచీ "లైమ్‌లైట్" అనే చిత్రం తయారు చెయ్యటంలో మునిగి ఉన్నాడు. ఈమధ్యనే ఈ చిత్రం పూర్తయింది. న్యూయార్కులో ముందు విడుదల చేశాడు. లండనులో విడుదలచేసేందుకని చాప్లిన్ భార్య, నలుగురు బిడ్డలతో సహా ఇంగ్లండు బయలుదేరాడు. 21 ఏళ్ళ తరవాత చాప్లిన్ స్వదేశమైన ఇంగ్లండు వెళ్లటం ఒక వార్తే అయినప్పటికీ ఇంత సంచలనం కలిగించగల వార్తకాదు. అసలు వార్త యిది:

చాప్లిన్ బయలుదేరేముందుదాకా అమెరికన్ అధికారులు అతనితో నవ్వుతూనే మాట్లాడారట. అతని ఓడ న్యూయార్కునుంచి బయలుదేరగానే అటార్నీ జనరల్ ఒక ప్రకటన చేశాడు: చార్లీ చాప్లిన్ దాదాపు నలభైఏళ్ళనుంచీ అమెరికాలోనే నివసిస్తున్నా అమెరికన్‌పౌరుడు కాడు. అందుచేత అతడు తిరిగి అమెరికాలో అడుగు పెట్టడానికి న్యాయచట్టం ఒప్పుకుంటుందో లేదో ఆలోచిస్తున్నాము, అని దీని అర్థం చార్లీచాప్లిన్‌ను అమెరికాకు తిరిగి రాకుండా చెయ్యాలని అమెరికన్ అధికారవర్గం ప్రయత్నిస్తున్నదన్నమాట

అసలు మూడు నాలుగేళ్ళనుంచీ చాప్లిన్‌ను అమెరికానుండి బహిష్కరించాలనే ఉద్యమం సాగుతున్నది. దీనికొక కారణం అతడు ఇన్నేళ్ళనుంచీ అమెరికాలో ఉంటున్నా, అమెరికన్ పౌరస్వత్వం తీసుకోలేదు ఎందుకు తీసుకోలేదని అంటే "నేను ప్రపంచపౌరుణ్ణి. ఏదేశానికీ చెందినవాణ్ణి కాను," అని చాప్లిన్ సమాధానం.



రోహిణీవారు నిర్మిస్తున్న "ప్రతిజ్ఞ"లో కాంతారావు, గిరిజ.

అతనిపై కక్షకలగడానికి మరొక కారణమేమిటంటే, అతడు కమ్యూనిస్టు పక్షపాతి అని కొందరికి నమ్మకం అమెరికన్ అధికారవర్గం దృష్టిలో శాంతి కావాలనే వారందరూ కమ్యూనిస్టులే చాప్లిన్ శాంతి ఉద్యమంలో పాల్గొన్నాడు. అందుచేత అతణ్ణి కమ్యూనిస్టు పక్షపాతిగా పరిగణించారు

ఈ కారణాలవల్ల అతనికి అమెరికాలో శత్రువు లేర్పడ్డారు. చార్లీచాప్లిన్ అమెరికాలో ఉండటంమూలంగా దేశంలో "నీతి నియమాలు" భ్రష్టమైపోతాయనీ, నైతికంగాను, రాజకీయంగాను అతడు అంగీకరించవలసిన మనిషి కాడనీ వారి అభిప్రాయం చాప్లిన్ ఇంగ్లండుకు బయలుదేరబోయేముందు ఒక పత్రిక ఇలా రాసింది. "చాప్లిన్ మనదేశంలో చాలాకాలం నివసించినా మనదేశపౌరుడు కాడు. పాతికేళ్ళుగా అతడు మనదేశపు ఆశయాలను, నీతి విధానాలను తూర్పారపడుతూ, సినిమా కళను భ్రష్టంచేస్తూ, మన నెత్తిమీదికెక్కి కూర్చున్నాడు అతడు ఇంగ్లండు ఎలాగూ వెళ్ళాడు కాబట్టి బ్రిటిష్‌ప్రభుత్వం చట్టరీత్యా అతడు ఆదేశంనుండి యావజ్జీవమూ కదలకుండా నిర్బంధించటానికి వీలున్నది. బ్రిటిష్‌వారు అలా చేస్తే చాలా బావుంటుంది కమ్యూనిస్టులు మొదటినుంచీ అతణ్ణి గొప్ప ప్రతిభాశాలిగా మెచ్చుకుంటూనే ఉన్నారు కాని అతడు చవకబారు హాస్యనటుడు తప్ప మరేంకాడు."

చాప్లిన్‌ను బహిష్కరించాలని అమెరికన్ పాలకవర్గం వాంఛిస్తుంటే అటు ఇంగ్లండులో అతడు కాలుపెట్టినప్పటి

నుంచీ బ్రిటిష్‌పత్రికలవారు బ్రిటిష్ సినిమా వర్గంవారు కూడా అతనికి బ్రహ్మాండమైన స్వాగతం ఇచ్చారు. చాప్లిన్ ఇంగ్లండులోనే పుట్టి పెరిగాడు. బాల్యంలో దారిద్ర్యం అనుభవించి బతుకుతెరువు చూసుకునేందుకై అమెరికా చేరాడు. ఇన్నేళ్ల తర్వాత చాప్లిన్ మళ్ళీ స్వదేశం తిరిగి వచ్చినందుకు అందరూ అతన్ని ఆహ్వానించారు. "అమెరికా మిమ్మల్ని తిరిగి రానివ్వకపోతే ఇక్కడే ఉండిపోయి చిత్రనిర్మాణం సాగించండి," అని వారంతా సూచించారు. ఈలింగ్ స్టూడియో అధిపతి సర్ మైకేల్ బాల్కన్ ఇలా అన్నాడు: "సినిమాపరిశ్రమ సృష్టించిన ఏకైక ప్రతిభావంతుడు చాప్లిన్. ఇక్కడివారు ఆయనను హృదయపూర్వకంగా ఆహ్వానిస్తారు. ఆయన ఇక్కడే ఉండి ఒకచిత్రం నిర్మిస్తాడని ఆశిస్తున్నాను." "చాప్లిన్ లాంటి కళాకారుణ్ణి ఏ దేశమైనా ఆహ్వానిస్తుంది," అని ప్రసిద్ధ దర్శకుడు ఆంథొనీ ఆస్క్విత్ అన్నాడు.

న్యూస్టేట్స్‌మన్ ఎండ్ నేషన్ వారపత్రికలో కాథలిక్ నవలా రచయిత గ్రాహాంగ్రీన్ చార్లీచాప్లిన్‌కు ఒక బహిరంగలేఖ రాస్తూ "ఒక గొప్ప సినిమా కళాకారుడే కాక ఒక గొప్ప లిబరల్‌వాది" కూడా అయిన చాప్లిన్‌కు స్వాగతమిస్తున్నానన్నాడు. "మీ చిత్రాలు బలహీనులపట్ల, కింది తరగతులవారిపట్ల ఎప్పుడూ ఆదరణ చూపుతూనే ఉన్నాయి...మీరు అమెరికా సరిహద్దులోపల నివాసం ఏర్పరచుకొని ఆ దేశాన్ని గౌరవించటం మాకు ఎంతో బాధనీ, ఆశ్చర్యాన్నీ కలిగించింది.

ఇప్పుడు మెక్‌కార్థీలాటివారి ఆజ్ఞలను శిరసావహించే తత్వంగల కొందరు అమెరికన్ అధికారులు మీ పట్ల అనుసరించే వైఖరి మాకు ఆశ్చర్యం కలిగించటం లేదు; బాధ మాత్రమే కలిగిస్తోంది" అని గ్రాహంగ్రీన్ రాశాడు.

ఆ పత్రికలోనే లిబరల్ తత్వవేత్త సి. ఇ. ఎమ్. జోడ్ మరొకలేఖ వ్రాస్తూ ఇలా అన్నాడు: "చార్లి అమెరికన్ చట్టాలను, ధర్మాలను అతిక్రమించాడని నిజంగా నిదర్శనమే ఉన్నట్లయితే అమెరికన్ అధికారులు అతనిపై తక్షణం చర్యతీసుకొని ఉండేవారు. అమెరికాలో ప్రస్తుతం అనుమానం అనేది ప్లేగులాగ ఎంత తీవ్రంగా వ్యాపించిందో, స్వేచ్ఛా ప్రపంచానికి నాయకత్వం వహించాలనుకుంటున్న అమెరికా అందుకు తగదని ఎలా నిరూపిస్తుందో చూడాలంటే చార్లీకేసు ఒక ఉదాహరణ. చార్లీచరిత్రను, వ్యక్తిత్వాన్ని, కళను ఎరిగినవారెవరూ అతను అమెరికన్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి కుట్ర పన్నుతున్నాడన్నిగాని, అమెరికన్ జీవనవిధానాన్ని ధ్వంసంచేయ ప్రయత్నిస్తున్నాడనిగాని భావించలేరు...గొప్పవాళ్లంటే ఎవరో నిర్వచించటం కష్టం. ఆనందం కలిగించటం అనేది ఒక నిర్వచనమే అయితే చార్లీ నిస్సందేహంగా చాలా గొప్పవాడు..."

ఏమైనా పాతికముప్పయ్ ఏళ్లనుంచీ ప్రపంచాన్ని హాస్య చిత్రాలలో ముంచెత్తి కళాదృష్ట్యా షేక్స్పియర్‌తో సమానస్థానం సంపాదించిన చార్లీచాప్లిన్‌ను అమెరికన్ అధికారవర్గం "అవాంఛనీయుల్లో" జమకట్టడం అన్యాయంగా కనిపిస్తుంది.

చాప్లిన్ చిత్రాలు "కిడ్" "సిటీలైట్స్" "మోడరన్ టైమ్స్" "గోల్డ్‌రష్" మొదలైనవి చూస్తే సినిమారంగంలో అతనికంటే గొప్ప మానవవాది లేడనిపిస్తుంది. ఆధునిక యుగంలో, యాంత్రిక నాగరికతలో, ప్రభుత్వాధికారం ఆకాశందాకా పెరిగిపోయిన ఈ రోజుల్లో, మానవుడు, ముఖ్యంగా సామాన్య దుర్బలమానవుడు ఎంత అధఃపాతాళానికి కుంగదీయబడుతున్నాడో చూపిస్తాయి అతని చిత్రాలు. ఈ సామాన్యమానవుడి పాత్రను చాప్లిన్ తనే ధరిస్తాడు. తన ఆకృతిలోనే ఆ మానవుడి వ్యక్తిత్వాన్నంతటినీ మూర్తీభవింపజేస్తాడు. సామాన్య మానవుడికి చార్లీ చాప్లిన్ ఇచ్చిన ఆకృతి ఒక గొప్ప కళాసృష్టి. చాప్లిన్ తన చిత్రాలద్వారా జీవితంమీద తన దృక్పథాన్ని ఏమాత్రం దాచుకోకుండా నిశితంగా వ్యక్తం చేస్తాడు. ఒకవంక పొట్టచెక్కలయ్యేట్టు నవ్విస్తూ మరొకవంక గుండెలు బద్దలయ్యే కరుణ కల్పిస్తాడు. "ముష్యూర్ వెర్డూ"లో ఇలాంటిదే ఒక గొప్ప సన్నివేశం ఉంది. చాప్లిన్ కొత్తరకం విషం తయారుచేస్తాడు. దాన్ని పుచ్చుకున్నవాడు మాట్లాడుతూ మాట్లాడుతూ కిందపడి చనిపోతాడు. ఎల్లా చనిపోయాడో ఏ డాక్టరూ భేదించలేడు. ఈ విషాన్ని దారేపోయే ఒక అభాగ్య యువతిమీద ప్రయోగంచేసి చూడాలని చాప్లిన్ ఆమెను ఇంటికి తీసుకువస్తాడు. సారాలో విషం కలిపి ఆమెకిస్తాడు. ఆమె అమాయికంగా ఆమాటా ఈమాటా చెబుతూ తన జీవిత కష్టాలన్నీ వెళ్ళబోసుకుంటుంది. మాటల్లో పడి విషపుసారా ఎంతసేపటికీ తాగదు. ఎంతకీ తాగదేమా అని చాప్లిన్ ఊరికే సతమతమవుతాడు. చివరికి ఆమె దారిద్ర్యకథ అంతా వినేటప్పటికి చాప్లిన్ మనస్సు కరిగిపోతుంది. మాట్లాడకుండా పోసి విషపుసారా పారబోసి మంచిసారా తెచ్చి ఇస్తాడు. ఆ చిత్రంలోకల్లా ఈ సన్నివేశం సూదిలాగ గుండెకు గుచ్చుకుని బాధపెడుతుంది.

"ముష్యూర్ వెర్డూ" చిత్రంలో చాప్లిన్ ప్రతిభ పరాకాష్ఠ పొందింది. అయితే ఈ చిత్రాన్ని అమెరికన్ విమర్శకులు చట్టి చెత్తకింద తీసివేశారు. దీనికి కారణం లేకపోలేదు. అందులో ఆధునిక జీవన విధానాన్ని, ముఖ్యంగా అమెరికన్ జీవనవిధానాన్ని బాగా విమర్శించాడు. ఈ చిత్రంలో చాప్లిన్ సంఘంలో ఘరానా మనిషిగా చెలామణీ అవుతూ డబ్బుకోసం చాలామందిని హత్య చేస్తాడు. చివరికి ఆర్థిక మాంద్యం వస్తుంది. అందులో తను సంపాదించిన డబ్బంతా పోగొట్టుకుంటాడు. బతుకుమీద నిరాశ చేసుకుని తనంతతనే పోలీసులకి చిక్కుతాడు. అతణ్ణి కోర్టులో పెట్టి విచారణ చేస్తారు. తను చేసిన హత్యలకు సంజాయిషీగా చాప్లిన్ "నేను న్యాయంగా బతుకుదామని ప్రారంభించాను. కాని దోపిడీవిధానం మీద నడిచే సంఘం నన్ను న్యాయంగా బతకనివ్వలేదు. అందుకే నేను కూడా అన్యాయమార్గాలకి దిగాను. అయినా నేను చేసిన హత్యలు మీ ప్రభుత్వాలు చేసే హత్యలముందు ఏపాటి? శాస్త్రీయ మారణాయుధాలతో వేలకొలది మనుషులను యుద్ధంలో చంపటం హత్యాకాండ కాదా?" అని నిలదీసి అడుగుతాడు. ఈ ప్రశ్న చాలా ఘాటైనది. అందుకే "ముష్యూర్ వెర్డూ" చిత్రాన్ని అమెరికాలో కొన్నిచోట్ల బహిష్కరించారట. ఈ చిత్రంతో చాప్లిన్ చాలా చవకబారు నిర్మాత అయిపోయాడని విమర్శకులు నిందించారు.

కాని చాప్లిన్ గొప్పదనాన్ని ప్రపంచం ఈనాటికీ గుర్తిస్తూనే వుంది. అతను కొత్తగా తీసిన "లైమ్‌లైట్"ను న్యూయార్కులో మొదటిసారిగా చూచినప్పుడు ప్రేక్షకులు, విమర్శకులు అసంఖ్యాకంగా వచ్చి చాప్లిన్‌ను చుట్టుముట్టి ప్రశంసించారట. ఈచిత్రంలో చాప్లిన్ గంటసేపు పైగా ప్రేక్షకులను నవ్వించి ఏడ్పించాడట. చాల ఏళ్ళపాటు ప్రేక్షకులను హాస్యంద్వారా వినోదింపజేస్తూ, ఆఖరికి ఘోర పరాజయంపొందిన హాస్యనటుని కథ ఈ చిత్రంలో వస్తుందట. ఈచిత్రం త్వరలో భారతదేశంకూడా రావచ్చును. అది రాబోయేముందు అతని పూర్వపు చిత్రాలన్నిటినీ డిస్ట్రిబ్యూటరు ఎవరైనా తెప్పించి మళ్లీ మన థియేటర్లో ప్రదర్శిస్తే బావుండును. ★



గజాననావారి "కోడరికం"లో
రేలంగి, ఎస్. వరలక్ష్మి

సినిమా వార్తలు

రేఖా ప్రొడక్షన్స్ అనే కొత్తసంస్థవారు గతనెల 29 వ తేదీన వాహినీస్టూడియోలో తెలుగు, అరవభాషలలో తీస్తున్న "అప్పగింత" అనే చిత్రానికి ప్రారంభోత్సవం జరిపారు. ఈ చిత్రానికి మాటలు, పాటలు ఆరుద్ర; సంగీతం ఘంటసాల.

* * *

ఫిలిమ్స్ డివిజన్‌వారు భారతీయ సంగీత కళపై వరసగా కొన్ని డాక్యుమెంటరీలు నిర్మించదలచారు. ఈ వరసలో మొదటిదైన "మ్యూజిక్ ఆఫ్ ఇండియా" అనే చిత్రంలో రవిశంకర్, ఆలీఅక్బర్ మొదలైన ప్రసిద్ధ వాద్యవిద్వాంసులు ఉచితంగా పాల్గొన్నారట. తరువాత వివిధ ప్రాంతాల్లోని జానపద సంగీతంలో చర్మ వాద్యాల పాత్రను నిరూపిస్తూ "డ్రమ్స్ ఆఫ్ ఇండియా" అనే మరొక చిత్రం తీస్తారట ఇదిగాక ఫిలిమ్స్ డివిజన్‌వారు మోనోపాక్ ఫిలింమీద "కుమావూన్ కొండలు" అనే వర్ణచిత్రం తీశారు. ఇది త్వరలో విడుదల కానున్నది.

* * *

అరుణాఫిలిమ్స్‌వారు తెలుగు, అరవములలో తీస్తున్న చిత్రానికి "గుమాస్తా" అని పేరు పెట్టారు. ఈ చిత్రంలో నాగయ్య, పండరీబాయి ముఖ్యపాత్రలు ధరిస్తున్నారు. ఇతర నటీనటులు జయమ్మ, రామశర్మ, పేకేటి శివరాం, వెంకయ్య, సి. కె. సరస్వతి, ఎమ్. సరోజ మున్నగువారు. కథ ఆత్రేయ రాశారు. దర్శకుడు కృష్ణస్వామి.

* * *


రాణి ఫిలిమ్స్ అనే కొత్త సంస్థవారు తెలుగు, అరవములలో "నమ్మిక" అనే చిత్రం నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం స్టార్ కంబైన్స్ స్టూడియోలో ఈ నెల 4 వ తేదీన జరిగింది.

* * *

కోడంబాకమ్‌లో గతనెల 27 వ తేదీన ఫిల్మ్ సెంటర్ లిమిటెడ్ అనే స్టూడియో ప్రారంభించబడినది. శ్రీ కె. రామనాథ్ అధ్యక్షతన దసరాపూజలు జరిగినవి. ★

రాఘవరావు బస్తీనుంచి ఇంటికి రాగానే తల్లి చీపురుకట్ట తీసుకుని దిష్టి తీస్తుంది.

రాజా ప్రొడక్షన్స్‌వారి "పుట్టిల్లు"లో
రాజారావు, సురభి కమల.



★ ప్రశ్నలు - సమాధానాలు ★

రావి సాంబశివరావు—తెనాలి.

వాన కురవగానే కప్పలు బెకబెకలాడుటకు కారణమేమి?

—ఎండ రోజులలో తమ నివాసానికి చాలినంత నీరు దొరకదని, కప్పలు భూబిలాలలోనూ, ఎండిన భూమికి ఏర్పడే నెరదుల అడుగునా చేరుకుంటాయి. అంతవరకూ అవి పెంచుకున్న కొవ్వు కరిగి వాటికి ఆహారములాగ ఉపయోగపడుతుంది.

వాన కురవగానే ఈ అజ్ఞాతవాసము విడిచి పైకి వచ్చి నీటి చలమలలో చేరుకుంటాయి కప్పలు. 'బెక బెక' మగ కప్పల అడ్వర్ టైజు మెంటు.

* * *

చెన్నా సూర్యనారాయణ - కాకినాడ.

ఏదయినా ఒక సంస్థ స్థిరముగా నిలవాలంటే (సినిమా సంస్థ కాని నాటక సంస్థ కాని) ఎక్కువగా ఎవరిమీద ఆధారపడి వుంటుంది?

—డబ్బు పెట్టుబడి పెట్టే వారిమీద.

* * *

టి. శంకరయ్య—యాపర్ల

వైద్యవిధానములలో ఏది ఉత్తమమంటారు?

—రోగకారణములను కనుక్కొని, నివారణా పద్ధతులను శోధించి కనుక్కొనేది ఉత్తమ వైద్యవిధానము, ప్రకృతి వైద్యము "రోగనివారణాశక్తి శరీరములోనే వుంది. దాన్ని సత్యమైన మార్గాలలోనడుపుకుంటే అన్ని రోగాలూ నివారణమౌతాయం" టుంది. ఇది పూర్తిగా సత్యము కాదు. హోమోపతి "శరీరములో కొన్ని లవణముల లోటువల్ల జబ్బులు వస్తాయి. ఆ లవణములు సరఫరా చేస్తే రోగనివారణ మౌతుంది" అటుంది. ఇదీ నిండు సత్యము కాదు.

అల్లోపతీ విధానము ప్రపంచమందంతటా వ్యాపించడానికి దాని పరిపూర్ణ ప్రయోగ శరణ్యతయే కారణము.

* * *

ఎమ్. మాధవరావుఆర్య—సికింద్రాబాదు.

మన హిందీ, తెలుగు చిత్రనిర్మాతలు ఇలా లక్షలకొద్ది డబ్బు వ్యయపరచి పట్టి చవకబారు చిత్రాలు తయారుచేసేకన్నా, గొప్ప గొప్ప కర్మాగారాలు నిర్మించి నాటి నాటికీ పెరుగుతూన్న నిరుద్యోగసమస్యను పారద్రోలి దేశోన్నతికి సహాయపడిన యెంతో బావుంటుందని నా సలహా. అందుకు మీరు నాతో యేకీభవిస్తారా?

—గొప్ప గొప్ప కర్మాగారాలున్న పాశ్చాత్యదేశాలలో మాత్రం నిరుద్యోగ సమస్య లేదనా మీ అభిప్రాయం?

* * *

శ్రీ కే. వి. చలపతిరావు—గుంటూరు.

"రెంటికి చెడిన రేవడు"—ఇందులో రెంటికి చెడినవారెవరు? ఎట్లు?

—రేవడు అంటే రేవులో బట్టలు ఉతికేవాడు (చాకలి). ఏటి నడుమ నిల్చుండి బట్టలు ఉతుకుతున్నాడు. ఉతకవలసిన బట్టలు ఒక గట్టుమీద ఉంచాడు. ఉతికిన బట్టలు ఇంకొక గట్టుమీద ఉంచుతున్నాడు. ఇంతలో హఠాత్తుగా ఏటికి వరద వచ్చింది. ఒక గట్టువైపుకు చూచి ఉతికిన బట్టలను భద్రం చేయడానికి కొంతదూరం ముందుకు వెళ్ళాడు. వెనక్కు తిరిగి చూచేసరికి రెండవగట్టున ఉతకవలసిన బట్టలు కొట్టుకొనిపోతున్నాయి. అందుకని వెనక్కు తిరిగి కొంతదూరం నడిచాడు. అటు యిటు తిరిగి కంగారుపడినందువల్ల ఆ గట్టుమీద బట్టలున్నూ, యీ గట్టుమీద బట్టలున్నూ రెండూ ప్రవాహంలో కొట్టుకొనిపోయినాయి. ఇట్టివాడు రెంటికి చెడిన రేవడు.

* * *

ఎమ్. ఎస్. ఆర్. శర్మ.—వాల్తేరు.

శాంతారాం, కిశోర్ సాహులతో సరితూగగల తెలుగు దర్శకు లెవరు?

—శాంతారాం లాంటి దర్శకులు బి. ఎన్. రెడ్డిగారున్నారు. కిశోర్ సాహూ లాటి దర్శకులు చాలామంది ఉన్నారు.

* * *

శ్రీ ఆర్. రాధాకృష్ణ—వెంకటగిరి.

చెప్పు దెబ్బ తిన్నవారికి అదృష్టం తిరుగుతుంది అంటారు అది ఎంతవరకు నిజమండీ?

—చెప్పు దెబ్బతినడంలోనే అదృష్టం తిరిగిందనే విషయం బోధపడటోంది అని చెవినిల్లు కట్టుకొని ఆ చెప్పు చెప్పకనే చెప్పుతున్నది.

* * *

పుల్లగంటి లక్ష్మీనరసింహారావు—ఒంగోలు.

డ్రామాలు ముందుకు రాకుండా వుండటం, ప్రపంచమంతా సినిమామయమవుటకు కారణమేమండి?

—మిల్లుబట్టలు చేనేతబట్టలకంటె ఎలా ఎక్కువ వ్యాప్తిచెందాయో అలాగే డ్రామాలకంటే సినిమాలు వ్యాప్తి చెందాయి.

* * *

శ్రీ జి. వెంకట్రావు—సికింద్రాబాదు.

ప్రపంచములో 8 వింత లున్నవనియు, వానిలో టాజ్ మహలు ఒకటి అని విన్నాను. మిగిలినవాటి పేర్లు ఎక్కడెక్కడ ఉన్నవో తెలియజేయవలెను?

—సుప్రసిద్ధ ప్రపంచాద్భుత నిర్మాణములు ఏడు కలవు. (1) టాజమహాలు (2) కాశ్మీరులో తెప్పలమీద తేలే తోట (3) ఇటలీలో పైసా పట్టణంలో వంగి స్థిరంగా ఉన్న గోపుర స్తంభము (4) యీజిప్టు ఎడారులలో నిర్మింపబడిన కొండంత శిలాసమాధులు (5) సముద్రంలోని ఒక జలసంధికి అవలి గట్టున ఒక కాలు, యీవలిగట్టున ఇంకొక కాలు మోపి నిలువబడిన రోడ్సువద్దనున్న రాకాసి లోహవిగ్రహము. (6) మనుష్యులు చేతితో మోగించలేని రష్యాలోని యమగంట. (7) చైనా దేశము చుట్టూ కట్టబడిన అతి ప్రాచీన ప్రాకారపుగోడ. వీటినే సప్తవింతలంటారు ఇంగ్లీషులో. అవి ఎనిమిది కాదు.

* * *

బి. యస్. ఆర్. ఆంజనేయులు-గుంటూరు.

నేను సినిమాలో నటించుటకు చాలా కుతూహలముగానున్నాను. ఇది లభించుటకు ఎవరితో సంప్రతించవలెనో తెలుపగోరెదను.

—మీకు జ్యోతిష్యం మీద నమ్మకం ఉంటే జ్యోతిష్కునితో సంప్రదించండి. తారకావటానికి తారాబలం లాటిదేదో ఉండాలి.

* * *

శ్రీ అన్నారావు—మెదక్.

స్త్రీ వంటకై సృష్టింపబడి యున్నదా? లేక విలాసమునకై సృష్టింపబడినదా? మరి దాస్య వృత్తికై సృష్టింపబడి యున్నదా?

—పైన చెప్పబడిన అన్నింటి

కొరకూ సృష్టింపబడింది. వానిలో వ్యర్థమైన నిరర్థకమైన దేదీ లేదు.

ప్రేమ అనగా నేమి? అది ఎన్నివిధములు? అందులో ముఖ్యమైన ప్రేమ ఏది?

—ప్రాణానికి ప్రాణం యివ్వగల్గినదే ఉత్తమైన ప్రేమ. ప్రతిఫలం కోరకుండా తనంతటతానే కారణ ప్రమేయం, లేకుండా నిష్కారణంగా, నిష్కామంగా ప్రేమించడమే ఉత్తమమైన ప్రేమ—భక్తి, దయ, దాక్షిణ్యం, అనురాగం, దుష్టులను బాగుచెయ్యడానికి వారియెడల కఠినంగా చూపించే సత్యాగ్రహం యివన్నీ ప్రేమ తత్వరూపాలే, కామం, మోహం యివి ప్రేమయొక్క అపరిశుద్ధ మలిన రూపాలు.

వర్షమెక్కువ పడే ప్రదేశములలో చెట్లు ఎక్కువ పెరుగునా? లేక చెట్లు ఎక్కువ ఉన్న ప్రదేశాలలో వర్షం ఎక్కువపడునా?

అడవులు దట్టంగా ఉంటే వాని మూలంగా వర్షాలు కురియగలవు - కనుక వృక్షసమృద్ధి వృష్టి సమృద్ధి పరస్పరాశ్రయాలే.

ఎమ్. వి. ఆర్. మనుమోహన్—పెనమలూరు.

ఈమధ్య భానుమతి ఏదో పిక్చరు డైరెక్టు చేస్తుందని విన్నాము. ఆ పిక్చరు పేరేమిటండీ? ఆ పిక్చరులో హీరో ఎవరండీ?

—భానుమతి "చండీరాణి" అనే చిత్రం తీస్తున్నది. దాని కామెయే డైరక్టరు. ఎన్. టి. రామారావు హీరో.

* * *

శ్రీ టి. వి. నాయుడు—గుంటూరు.

నేను చదవాలని ఎంత కుతూహలంతో పుస్తకము చదివినా, అదిలో ఉన్న ఉత్సాహము అంతమువరకు ఉండదు. ఎందుచేతనంటారు?

—మీకు ఉత్సాహం ఎన్ని నిమిషముల వరకు తెగకుండా ఉంటుందో ఒకటి రెండు సార్లు గడియారం దగ్గిర పెట్టుకొని గమనించి చూడండి. ఆ ఉత్సాహం ఒక గంట సేపయినా ఎడతెగకుండా ఉంటే చాలు. ఆపైన మీ మెదడుకు కొంత అలసట రావడంవల్ల ఉత్సాహము తగ్గవచ్చు. కనుక ఒక గంటసేపు అయినా, విశ్రాంతి తీసికొని చల్లని తియ్యనినీళ్లు త్రాగండి. అటు పిమ్మట తిరిగి చదివి చూడండి. వేడివేడి పాలు త్రాగుతూ ఉంటే మీ శరీరస్థితినిబట్టి ఒకటి రెండు నారింజపండ్లు తింటూ ఉంటే, మెదడుయొక్క అలసట తగ్గిపోగలదు. ఎక్కువ గంటలసేపు ఉత్సాహంగా చదవగలరు.

జ్ఞాపకశక్తి పెరగాలంటే అనుసరించవలసిన, ఆచరణయోగ్యమైన విధానము లేవి?

—సరస్వతీలేహ్యం తింటే జ్ఞాపకశక్తి వృద్ధి అవుతుందని వైద్యశాస్త్రంలో ఉంది. తలకు భృంగామలక తైలం మర్దిస్తే మంచిది. తరచుగా సినిమాలకు పోవద్దు.

శివకోటి నరసింగరావు—విశాఖపట్నం

'పూలలో పూలలో పూలూకనీగోనుకు' అనే పాట ఏ చిత్రంలోనిదండీ?

—వాహినీవారి మొదటిచిత్రం "వందేమాతరం" లోది.

* * *

వి. వేణుగోపాల్ రెడ్డి—ముత్తుకూరు.

యుద్ధాలవలన లాభములు, నష్టములు వున్నాయిగదండీ? మూడవ ప్రపంచ యుద్ధమే వస్తే, ఆ లాభా లేమిటో తెలియ చేస్తారా?

—ఇక ఆ తరవాత యుద్ధాలు చేసుకొనేందుకు బహుశా మనుషులంటూ ఉండరు.

* * *

శ్రీ టి. శంకరయ్య—యాపర్ల.

చెట్టుముందా? విత్తుముందా?

—సూక్ష్మమైన ఒక పరతత్వంలో నుంచి స్థూలమైన జగత్తు ఏర్పడిందని ఊహిస్తున్నాము. జడములోనుంచి సూక్ష్మమైన జీవాణువు ఒకటి మొదట ఏర్పడి దానిలోనుంచి సకల జీవరాసులు వృక్షవర్గము సహా పరిణామ వికాసం పొందినవి. మొక్క కొమ్మలే ఆజాతియొక్క మొక్కల సంఖ్య వృద్ధియగుటకు ప్రారంభంలో కారణభూతమైనాయి. కనుక చెట్ల సంఖ్యావృద్ధికి చెట్లే విత్తులవంటివై స్వజాతిని వేరే విత్తులేకుండా వృద్ధిచేశాయి. విత్తులేని స్థితిఅది. స్త్రీపురుషలింగ విభేదం లేని అనాది అవస్థలోని జీవాణువు స్వవంశ పరంపరాభివృద్ధికై తనకుతానే పెరిగి చీలిపోయి విస్తరిస్తుంది. స్వయంభువమైన సృష్ట్యాదికి విత్తులేదు. అదే విత్తు, అదే చెట్టు—చెట్టే విత్తు - విత్తే చెట్టు. విత్తు సూక్ష్మరూపం చెట్టు స్థూలరూపం - విత్తులోనే చెట్టు ఉంది. చెట్టులోనే విత్తుఉంది. నీటిపాచివంటిదే వృక్షప్రపంచానికి మూలబీజరూపం.

దేశం బాగోగులు ప్రభుత్వంపై ఆధారపడి వుంటుందా? ప్రజలపై ఆధారపడి ఉంటుందా?

—ఉభయులకు ధర్మమార్గంలో శ్రుతి కలిస్తే దేశం బాగుపడుతుంది. అలా శ్రుతి కలియకపోతే దేశం బాగుపడదు.

* * *

యన్. వి. వి. సత్యనారాయణ—(కాకినాడ)

ఫేడ్ ఇన్, ఫేడ్ అవుట్ అంటే ఏమిటండీ?

—తెరమీద బొమ్మ కనిపించేటట్లు చెయ్యటం "ఫేడిన్."; బొమ్మను అంతర్థానం చెయ్యటం "ఫేడ్ అవుట్"

* * *

పాలెపు భిక్షాలు—చీరాల.

పుట్టుమచ్చలవలన ఫలానా ఫలితమని మనవారు చెప్పుట వాడుక. ఆ ఫలితాలు నిజంగా జరుగుతవా?

—శకునాలూ, సాముద్రికమూ, జాతకాలూ లాంటివన్నీ జీవితంలో జరిగే ముఖ్య ఘటనలకి సూచకాలనే నమ్మకంతో ఎప్పటినుంచో మానవులు బతికివుంటారు. "మానవుడి జీవితము సంపూర్ణంగా నిర్ణయమైపోయే వుంటుంది. నటుడిలాగే సూత్రధారుడి ఆదేశానికి కట్టుపడి తన భూమిక నిర్వహించడమే మానవుడి పని" అనే నమ్మకమున్నవారు పై మూడింటినీ భవిష్యజ్జీవిత సూచనలని నమ్ముతారు. పురుషప్రయత్నమూ, భగవంతుని కరుణమూ కూడా జీవితాన్ని మార్చగలవని నమ్మేవారు పై మూడూ నిశ్చయం చేసేవి కావనీ, అపాయమును కేవలము సూచిస్తాయనీ నమ్మి, వీటినీ వీటి ఫలితాల్నీ శోధించి శాంతులు జరుపుకుంటారు.

మరికొందరు వీటిని గణించకుండా ప్రయత్నమూ ప్రార్థనా అవసరాన్ని బట్టి జరుపుకుంటూ జీవితపథంలో నడిచిపోతారు.

* * *

శ్రీ వి. రామకృష్ణారెడ్డి—నునుకుపాడు.

మనదేశం గౌరవం మరచిపోయి ఆదర్శవాదుల మనుకొని ఒక రకమైన బానిసత్వాన్ని ఆహ్వానించే మన తెలుగులోని దత్తపుత్రు లెవ్వరండీ?

—దేశగౌరవం పూర్తిగా మరచిపోయిన వారుగాని పూర్తిగా గ్రహించిన వారుగాని చాలా తక్కువ—అట్టివారు తరచు కన్పించరు. సగం మరచిపోయి సగం గ్రహించి, కొంత మరచి కొంత ఎరిగి ప్రవర్తించేవాళ్ళే ఎక్కువ — వారిని పూర్తిగా దత్తపుత్రులనుటకు వీలులేదు. ★




"సంక్రాంతి" లో శ్రీరంజని

సంక్రాంతి సమీక్ష

అనేక అవాంతరాలు గడిచి ఈస్టిండియావారి "సంక్రాంతి" దసరా పండగకు ఆంధ్రదేశంలో విడుదల అయింది. త్వరలో మద్రాసు శ్రీ కృష్ణాటాకీస్‌లో కూడా విడుదల కానున్నది.

కుటుంబంలో వచ్చే కలహాలు కుటుంబాన్ని ఏవిధంగా ఛిన్నాభిన్నం చేస్తాయో నిరూపిస్తుంది ఈ చిత్రం. కథావస్తువు పాతకాలపుది. చిత్రంలో చాలా పాత్రలు వస్తాయి. ప్రతి పాత్రకీ వ్యక్తిత్వం ఇవ్వటానికై కథ రాసినవారు చాలా ప్రయత్నించినట్టు తోస్తుంది. తల్లి: ప్రధాన పాత్ర; సాధుశీల; కుటుంబంలో ఐకమత్యం నెలకొల్పటానికై పాటుపడుతుంది. పెద్దకొడుకు: స్వతహాగా మంచివాడయినా భార్య మాటలు విని కుటుంబాన్ని ఛిన్నం చేస్తాడు. పెద్దకోడలు: అర్థంలేని క్రౌర్యం, నీచస్వభావం ప్రదర్శిస్తుంది. ఏ విషయంలోనూ మానవత్వమనేది ఎరగదు. రెండో కొడుకు: మనిషి మంచివాడే కాని వైరాగ్యంలో పడతాడు. భార్య చని



రాజరాజేశ్వరీవారి "పేదరైతు"లోని ఒక హాస్య సన్నివేశంలో లింగమూర్తి, రేలంగి, తులసి.



పంజాబ్ ఫిల్మ్ కార్పొరేషన్ వారి "లోరీ" హిందీ చిత్రంలో ముంతాజ్ శాంతి.

రికి నోట్లో నాలికవుండదు. అంతా కర్మ ఫలితం అనుభవిస్తున్నట్టు నీరసంగా ప్రవర్తిస్తారు.. అందులో మూడో కొడుకు మరీని. అప్పుడప్పుడు చొక్కా చేతులు పైకి తీసి ఎదిరించబోతాడు కాని అంతకంటే మరేమీ చెయ్యలేడు. యువకుడై ఉండికూడా పరిస్థితులను ఏవిధంగా తనకి అనుకూలంగా మార్చుకోలేడు. మార్చుకోటానికి ప్రయత్నించడు. ప్రేమించిన అమ్మాయితో నంగినంగిగా మాట్లాడ్డం తప్పితే మరేం ఉద్యోగమూ చేతకానట్టుంటాడు. అతనిపై హత్యానేరం మోపబడితే రక్షించటానికి అన్నగారు రావలసివచ్చింది. పోనీ ఆ అన్నగారైనా రక్షించినట్టు చూపిస్తే బాగుండేది. హంతకుడు పొరబాటుగా "కత్తిపై మరకలు అప్పుడే తుడిచేశాగా" అనటంతో అతడు రక్షించబడతాడు. మొదటినుంచి చివరిదాకా ప్రతి సంఘటనా దైవికమే.

మొత్తంమీద పాత్రలన్నీ తమ చేతకానితనం ప్రదర్శించి ప్రేక్షకులకు తమమీద జాలిపుట్టించుకోవాలని చూస్తారు.

దర్శకత్వం కూడా పురాతన ఫక్కీలో నడిచింది. నటీనటులు నాటకరంగంమీద ఉన్నట్టు, సెట్టు చాలా ఇరుకుగా ఉన్నట్టు నటించారు. క్లోజప్‌లకు అనుకూలించే ఘట్టాలు చాలా ఉన్నా కెమేరామన్ క్లోజప్పులను పొదుపుగా వాడుకున్నాడు. అవైనా "మూడ్"ను కట్టటానికి కాక వృథాగా వాడబడినాయి.

(54-వ పేజీ చూడండి)

పోయి, కుటుంబం అష్టకష్టాల పాలైన తర్వాత తిరిగి మన ప్రపంచంలో పడతాడు. రెండో కోడలు: కేవలం ఒకళ్ళ చేత మొట్టికాయలు తినటానికే పుట్టిన మనిషి. మధ్యలోనే ఆత్మహత్య చేసుకుని చనిపోతుంది. మూడో కొడుకు: మంచివాడే కాని ఈ పాత్ర కథాంశాని కేవిధంగానూ తోడ్పడదు. సావిత్రి ధరించిన పాత్ర కూడా ప్రయోజనంలేని పాత్రే. ఇంకా చిల్లరపాత్రలు చాలా ఉన్నాయి. కథ అంతటిలోనూ ఒక్క పెద్దకోడలు పాత్ర తప్పితే మిగతా పాత్రలన్నీ కీలుబొమ్మల లాగ నడుస్తాయి కాని ఏ పాత్రకూ జీవమూ, వ్యక్తిత్వమూ లేవు. పెద్దకోడలు కూడా తనకుమించిన ఏదో దుష్టగ్రహం ప్రభావంలోపడి ప్రవర్తిస్తున్నట్టుంటుంది కాని మానవ వ్యక్తిగా కనబడదు.

పెద్దకోడలూ, ఒక హంతకుడూ తప్ప మిగతావాళ్ళంతా మంచివాళ్ళే. అయినా వాళ్ళ మంచితనం సామాజికులకు ఆదర్శప్రాయమూ కాదు, ఆకర్షించేదీ కాదు. ఆ మంచితనంమీద జుగుప్స కలుగుతుంది. ఎవ



జెమినీవారి "చిన్నమ్మ కథ"లో దాసరి లక్ష్మయ్య, విజయలక్ష్మి, కృష్ణకుమారి.

★ రెండు మహానగరాలు ★

(11-వ పేజీ తరువాయి)

కూడా నమ్మకముంది; ఆ సంగతి లూసీకి చెప్పాను కూడా— అసలు ఇంతకీ ఆ గల్లం తేవిటి?' అంటూ మళ్ళా కిటికీ రెక్క మీద చెయ్యి వేశాడు.

'ఆః! ఆః!—అగండాగండి!—ఆ పనిమాత్రం చెయ్యకు!' అంటూ లారీ మళ్ళా అడ్డం వచ్చాడు, 'లూసీ! అలా బెంబేలు పడకమ్మా! నిజానికి చార్లెస్ ప్రమాదంలో చిక్కిన సంగతి నాకు రవ్వంతేనా తెలీదు—అసలు ఇక్కడికొచ్చాడన్న మాట కూడా వినలే—ఇంతకీ యే జైల్లో పెట్టారట?'—

'లాఫోర్స్'—

'లాఫోర్స్!—అహాః!—సరే!—ఇదుగో తల్లీ—నా మాట కొంచెం విను—నువ్వు తెలివిగల తల్లివి, చెప్పినమాట వినే తల్లివి, ధైర్యంగల తల్లివి. నువ్వుగా బెంబేలుపడి కాళ్లు తొక్కుకుని చేయగలిగిందేమీ లేదు—మనస్సు స్థిమితపరుచుకో!—అదీ నువ్వు చెయ్యాల్సిన పని—పోయి నువ్వు నా గదిలో పడుకుని హాయిగా నిద్రపోవాలి—నన్నూ మీ నాన్ననీ యిక్కడ కూర్చుని కొస్త యేకాంతంగా మాట్లాడుకోనివ్వాలి—అదీ నువ్వు చెయ్యాల్సిన పని'

'మీరు ఏమి చెయ్యమంటే అలా చేస్తాను—నేను చెయ్యగలిగిం దేమీ లేదని నాకు తెలుస్తూనేవుంది'

లూసీని గబగబా తన పడకగదిలోకి లాక్కుపోయాడు. గదిలోపల వదిలి పెటితలుపు మూసేసి, మళ్ళీ ఆదుర్దాగా డాక్టర్ మానెట్ దగ్గిరికి పరుగెత్తుకొచ్చాడు. డాక్టర్ భుజంమీద చెయ్యివేసి, రెండో చేత్తో కిటికీ తనే తెరిచాడు. ఇద్దరూ కలిసి కిటికీలోనుంచి బయటికి తొంగిచూచారు.

ఆ లోపలికొచ్చిన జనం, ఆవరణ యావత్తూ నిండిపోలేదుగాని, అడామగా అంతా కలిసి ఓనలభైమందిదాకా వున్నారు. వాళ్ళున్న లభైమందీ సరాసరి ఆకత్తుల సానచుట్టూ జేరి తమపని తాము చూచుకుంటున్నారు.

సానరాతికి రెండువేపులా రెండు కొయ్యపిడులు అమర్చి వున్నయ్. ఆకొయ్యపిడులను చెరోవేపునా చెరోమనిషిపట్టి, మహావేశంతో గిరగిరా తిప్పేస్తున్నారు. ఆ జీబు తలలూ వాళ్లూ, సాక్షాత్తూ యమభటుల్లా వున్నారు; ప్రక్కనున్న స్త్రీలువాళ్లకి అలసటరాకుండా, మధ్య మధ్య సారాగిన్నెలు నోటికి అందిస్తున్నారు. మిగతా జనం, ఆ తిరుగుతున్న సానరాతిమీద, ఒకరి తరువాత ఒకరు వచ్చి, కత్తులూ, యీటెలూ, బల్లాలూ, బరిసెలూ నానా రకాల ఆయుధాలూ పదును పెడుతున్నారు. సానరాతిలోనుంచి నిప్పురవ్వలు తోటాలోనుంచి లేచినట్లు లేచి చుట్టూవున్న వాళ్ళమీద అగ్నివర్షపు జల్లులా కురుస్తున్నాయి. ఎవరిఆయుధానికి వాళ్లు పదును పెట్టుకొని బయటికి వీధిలోకి వెళ్లిపోతున్నారు.

దీని అర్థమేమిటని ప్రశ్నిస్తూన్నట్టు డాక్టరు లారీగారి ముఖంలోకి చూచాడు.

'వాళ్ళూ, ఖైదీలను నరికేస్తున్నారు' అన్నాడు లారీ, వినీ వినిపించని మంద్రస్థాయిలో.

'మీకు ఏదో పలుకుబడి వున్నదన్నారే—నిజంగా అలాంటి పలుకుబడి వున్నదని మీకు నమ్మకముంటే—పోయి వాళ్ళతో పరిచయం చేసుకోండి; వాళ్లు లాఫోర్ జైలుకు మిమ్మల్ని తీసుకుపోగలరు. ఇప్పటికే ఆలస్యమైపోయిందేమో ననుకుంటాను—అయినా యేమో—ఇకమాత్రం ఒక్కక్షణం కూడా జాగు చెయ్యొద్దు వెళ్ళండి'—

ఆమాట చెవులబడగానే డాక్టర్ మానెట్, ఉన్నవాడు ఉన్నపళంగా, ఆదరాబాదరా బయటికి వెళ్లిపోయాడు.

డాక్టర్ వాళ్లంతా తనవాళ్ళే అయినట్టు పరాసరి, అమిత నిబ్బరంగా ఆ జనం మధ్యలోకి వెళ్ళిపోయాడు. తెల్లబడి పీచులు రేగి గాలిలో కదులుతున్న ఆయన జుట్టూ, అదో విచిత్రంగా కనుపించుతున్న ఆయన ముఖం, ఆయన చొరవా, క్షణంలో వాళ్ళలో యేకమైపోయాడు. ఒక రెండుమూడు నిమిషాలపాటు వాళ్ళతో యేదో మాట్లాడాడు. దాంతో వాళ్ళల్లో ఒక పెద్ద ఆనందకోలాహలం బయలుదేరింది. ఆయనను అమాంతం భుజాల మీదికి ఎత్తుకున్నారు :

'బాస్టిలీ ఖైదీకి జయ్!—డాక్టర్ మానెట్ జిందాబాద్!—లాఫోర్స్ జైలుకు పదండి!—డాక్టర్ బంధువును రక్షించండి!—డాక్టర్ మానెట్ జిందాబాద్!' అని కేకలు పెట్టుకుంటూ బయటికి వెళ్లిపోయారు.

లారీ, గబగబా కిటికీ మూసేసి, హడావుడిగా లూసీ వున్న గదిలోకి వచ్చేశాడు; గదిలోకి వచ్చిరావటమే లూసీతో జరిగిన వృత్తాంతమంతా చెప్పాడు. పసిపిల్లను ఒళ్ళో పెట్టుకుని మిస్ ప్రాస్ లూసీదగ్గిరే కూర్చునుంది. ఈ మాటలు వినగానే, లూసీ ఏదో మూర్ఛవచ్చిన మనిషిలా అతని పాదాలదగ్గిర పడిపోయింది. ఆ సైకంలో మధ్యమధ్య యేదో బాధగా మూలుగుతోంది. మిస్ ప్రాస్ కూడా చేతిలోవున్న బిడ్డను పక్కమీద పడుకోబెట్టి తను కూడా వాలిపోయింది. ఆ రాత్రి తెల్లవార్లూ అలాగే గడిచిపోయింది. పక్షుల కలకలారావం విని లారి కిటికీ దగ్గిరికి వెళ్లి తలుపు తెరిచి చూచాడు. రక్తపంకిలమైన సానరాయిలా, యెర్రగా, సూర్యబింబం తూర్పుదిశను పొటమరించుతోంది. ★

★ పరారి ★

(11-వ పేజీ తరువాయి)

భర్త: ఊరికి దోవ అడిగాడు.

పో: ఆ! వాడే! ఏం తొడుక్కున్నాడు?

భర్త: నలిగిపోయిన సూటు, అణిగిపోయిన టోపీ, మేజోళ్లు లేవు:

పో: (నుదుట చెమట తుడుచుకుంటూ) అలాగా? ఊరికి దారడిగాడా?

భార్య: అవును. అక్కడెవరో మేనత్తలున్నారుట.

పో: మేనత్తలా? మీరు దారిచెప్పారా?

భార్య: ఆ. కొండెక్కి వెళ్ళమన్నాం అదేగా దారి?

పో: అదే. వాడే పారిపోయిన ఖైదీ.

భర్త: (తొట్రుపాటుతో) నిజం? కాని...అబ్బే...

భార్య: పెద్దమనిషిలాగే వున్నాడే, మాటతీరూ అదీ...

పో: అలాగా? ఎంత దూరంలో వుంటాడో.

భర్త: ఎంత అయిదునిమిషాలౌతుంది... మాకసలు తెలియలేదండి. తెలిస్తే...

పో. (చెమట మళ్ళీ తుడుచుకుని, గొణుక్కుంటూ) దిక్కుమాలిన కొండ, వడుం విరుగుతోంది.

భర్త: ఆ ఊరికి టెలిఫోన్ చెయ్యకూడదూ?

పో: (మాట అందుకుంటూ) ఆ ఊరా? మీతో వాడెందుకు మాట్లాడాడనుకున్నారేమిటి? తను ఆ ఊరే వెడుతున్నట్టు నాతో మీరు చెప్పాలని. కాని నిజంగా వాడావూరు వెళ్ళడు.

భార్య: కాని అతను పెద్దమనిషేనే!

పో: అవునవును. అరగంటముందే ఇంకొకళ్ళ కారు కొట్టేసి వచ్చాడు.

భార్య: నమ్మశక్యం కాకుండా వుందే!

భర్త: కాకేం! అతనికాళ్ళు దుమ్ముటూ చూస్తేనే తెలుస్తోంది. (పోలీసు దృష్టి మేజోడులేని ఆమె కాలిమీదే వుండడం భర్త గమనిస్తాడు) అప్పుడే అనుకున్నాను పెద్దమనిషితరహా కాదని.

పో: అయితే మరి వాణ్ణెందుకు పట్టుకోలేదు?

భర్త: (కంగారు పడతాడు) ఏపాటి అనుమానం తగిలినా పట్టుకునేవాణ్ణే కాని...

పో: అబ్బే. ముందుపట్టుకుని తరవాత అనుమానం తీర్చుకోవాలి.

భర్త: నిజంగా పొరపాటే జరిగిందండి...నాకు ఏ కాస్త...

పో: ఇంకెందుకు దాటి పోయాడు. నేను గబగబా పోయి టెలిఫోన్ చెయ్యాలి. (పోలీసు సైకిలెక్కి వెళ్లిపోతాడు)

భార్య: (ఒంటికాలిమీద నిలబడి) నువ్వెందుకు నొచ్చుకుంటావ్! అతను పెద్దమనిషే.

భర్త: ఎవరైతేం, ఖైదీ ఖైదీయే. నియమాలూ శాసనాలూ అందరికీ సమానంగా వర్తిస్తాయి.

భార్య: మనం ఏమీ తప్పు చెయ్యలేదుగా! ఆ పోలీసు చూడు—కళ్ళన్నీ నాపాదంమీదే ఉన్నాయి.

భర్త: బాగుంది నువ్వు చెప్పేది. నేను పోలీసుతో తగువు పెట్టుకోవాలనా నీ ఉద్దేశం.

భార్య! నేనల్లా అన్నానేమిటి? బాగుంది. ఇందుకు కోపంకూడా ఎందుకు? నువ్వు అసలు కంగారు పడుతున్నట్టున్నావు. నన్ను పట్టుకోనక్కరలేదులే. నేనే నిలబడి సర్దుకోగలను.

(ఒంటికాలిమీద నిలబడి ఊగులాడుతూ మేజోడు తొడుక్కుంటుంది.

భర్త: ఎంతగుండె ధైర్యం. మేనత్తలున్నారట! వీడికోతలూ వీడూను.

భార్య: కోసినప్పుడు బాగుందేం మరి?

భర్త: ముందే తెలిస్తేనా...

భార్య: అవునవును. ముందే తెలిస్తే... పాపం పుట్టింది మొదలు నువ్వు ఎన్నడూ ఎలాటితప్పు చెయ్యలేదుగా మరి! నామటుకు నేనల్లా చెప్పలేను సుమా.

భర్త: అంటే? నేనలా అన్నానా?

భార్య: అనలేదులే. కాని...

భర్త: అరె! మళ్ళీ వస్తున్నాడే!

భార్య: ఎవరు? పోలీసా?

భర్త: కాదు కాదు. వాడే! ఖైదీ, పరారి.

భార్య: బలే!

భర్త: అదేమిటే? నీకు బలేగా వుందా? ఇప్పుడేం చెయ్యడం? అబ్బబ్బ! ఇది కష్టడి పెపరా బాబూ.

భార్య: (కరుగ్గా) ఏముంది? పరుగెత్తుకెళ్లి పట్టుకో.

భర్త: (పరవళ్లు తొక్కుతూ) అమ్మో! వీళ్లు ప్రాణాలకు తెగించే మనుషులు. మీద పడి చంపేస్తారు.

భార్య: పోన్లె. నేనే వెడతాను. వెళ్ళి పోలీసు వెంటాడుతున్నాడని చెప్పేస్తాను.

భర్త: అదేం పిచ్చి! అలాటి పేచీ పెట్టుకోకు. అరే. ఆగాడక్కడ. ఇప్పుడేం చెయ్యడం? ఏందారి?

(భార్య నవ్వుతుంది. కారాగిన చప్పుడు. డెనాంట్ మళ్లీ వస్తాడు.)

డెనాంట్: క్షమించాలి. కారు వదవడం లేదు. ఇక్కడింకో మలుపుండాలి కాదండి? ఏదో కుడివేపుని ఓ రోడ్డు కనపడిందే!

భర్త: ఓహో!...ఆ...అయితే...

భార్య: అవును. కాని ఆ దారిని వెళ్లకండి.

డెనాంట్: వెళ్ళక తప్పదనుకుంటాను. కొంతదూరం కొండెక్కిం తరవాత కారు వాలుకి వెనక్కి నడవడం మొదలెట్టింది.

భర్త: నేను మీతో మాట......చె... చెప్పాలి...

భార్య: (ముందుకు రాపుతూ) అటువేపు పోలీసున్నాడని చెప్తున్నాను.

డెనాంట్: ఓహో! (కళ్ళకి నీడగా చెయ్యి అడ్డుపెట్టుకుంటూ చూసి) అవును కనపడుతున్నాడు.

భార్య: ఇంక మీరు ఈపక్కగా వెళ్లిపోడం మంచిది.

డెనాంట్: అక్కడిద్దరున్నట్టున్నారండి! నా కారు మోటెక్కువ.

భార్య: అవునండి.

భర్త: జోన్! నువ్వుంటూ (డెనాంట్ వంక తిరిగి నిష్కర్షగా) మిమ్మల్ని గురించి మాకు పోలీసు చెప్పాడు. మీసంగతి తెలిసిపోయింది. మీరల్లా వుండండి. నేనా కారు తీసుకెడతాను. అది మీది కాదుట.

డెనాంట్: (వెనక్కి ఒకడుగువేసి) అది నిజమే. కాని అది మీదీ కాదుగా!

భర్త: కాదు నిజమే. అయితే ఏమంటారు? ఇంక లాభంలేదు. మీ ఆటకట్టింది లెండి.

డెనాంట్: ఓహో! నే నెవరను కుంటారసలు.

భర్త: తెలుసు తెలుసు! తప్పించుకున్న ఖైదీ మీరేనా?

డెనాంట్: కావచ్చు. అయినా నాలో ఇంకా సత్తా చావలేదు. మీరు చెప్పింది నాకర్థమైంది. కాని నా ఉద్దేశం వేరు.

భర్త. ఆ పోలీసు చూసి వెళ్లింతరవాత నేనింక ఊరుకోలేను.

డెనాంట్: ఇటు చూడండి. నాకో ఊహతట్టింది. మనం ముగ్గురం కలిసి ఆఊరు పోదాం, ఏం?

పరారీ

భర్త: (తేలికపడి) ఓ! అది బాగుంది. అలా దారిలోకి రండి.

డెనాంట్: అవును, మీరు కూడా వుంటే సులువుగా తప్పించుకోగలను. ఊళ్లో కూడా ఎవరూ అనుమానించరు. మిమ్మల్ని ఊళ్లో ఆ చివర దిగబెడతాను.

భర్త: కాని...అబ్బెబ్బే! అదెల్లా... అది కుదరదు.

డె: ఫరవాలేదులెండి. మీకేం ఫరవా లేదు. నన్ను కూడా తీసుకెళ్ళి ఊళ్లో దించండి. మీరింక తప్పించుకోలేరు. మిమ్మల్నిక్కడ పిస్తోల్తో కాల్చి చంపితే ఏంచేస్తారు? నామాట వినండి. మర్యాదగా రండి.

భర్త: వీల్లేదు. మే మెందుకు రావాలి? పరారీ! ఖైదీ.

డె: ఓహో! మీ రెవరో?

భర్త: ఏమిటీ? నేనా? నేను మామూలు మనిషిని.

డె: ఓహో! మామూలు మనుషులైతే ఎవరికీ సహాయం చెయ్యకూడదని ఎక్కడుంది?

భర్త: ఎక్కడా లేదు. కాని పోలీసొచ్చి ముందర మాకు వార్నింగిచ్చారు. నేనల్లా రాను.

భార్య: కార్లో నేనొస్తాలెండి. పక్కని మర్యాదైన ఆడదుంటే చాలు, ఎవ్వరూ అనుమానపడరు.

డె: థేంక్! రండిపోదాం. నిజంగా మీ ఋణం తీర్చుకోలేను.

భర్త: జోన్!

డె: ఆగండి. మీరే నాస్థితిలో ఉన్నారనుకోండి...

భర్త: ఇలా చూడు; అసలు నిన్ను పట్టుకు పడేసి కాళ్లూ చేతులూ కట్టేసెయ్యవలసింది.

డె: (ఛాతీ విరుచుకు నిలబడి) సరే. కానీ. చేసేదేదో వెంటనే చెయ్యండి.

భర్త: అహఁ - నేనలా చేస్తాననడం లేదు. అది మోటతనం.

భార్య: ఫిలిప్! అవేం మాటలు?

భర్త: సరే! కానీ! కారు నేను నడుపుతాను.

డె: అదెల్లా? వీల్లేదు...కారు కొట్టుకొచ్చింది నేను. (ఆమెవంక తిరిగి) ఇంక వెడదాం వస్తారా?

భార్య: నడవండి.

భర్త: ఇదేమిటి? దారుణం! ఇదుగో ఇటుచూడు. ఏమనుకుంటున్నావో...

డె: ఏమనుకుంటున్నానో చెప్తా (గంభీరంగా) నేనా నరకం చాలా అనుభవించాను. అదింక చాలు. నేనింక అక్కడ ఉండను. ఏమైనాసరే పోదల్చుకున్నాను. మీరు కాదు ఎవ్వరూ నన్నాపలేరు.

భర్త: చూస్తావుగా! ఎందుకాపలేరో!

భార్య: ఫిలిప్! నువ్వుండు.

భర్త: అదేం వీల్లేదు. (డెనాంట్‌తో) నీఅంతట నువ్వొచ్చి లొంగుతావా సరే. లేకపోతే అదేదో నేచూస్తాను.

డె: (ఈమాటు కోపంతో) ఓ హో! అల్లాగా (జేబులోనించి రెంచి తీస్తాడు)

భార్య: (ఇద్దరికీ మధ్య కొచ్చి నిలబడుతుంది. డెనాంట్‌తో) చాలింక. మీరు మీదారిని వెళ్ళండి.

డె: (తడబడతాడు) సరే. వెడతాను. ఛ! రౌడీలాగ ఈ లగు వేమిటి? (రెంచి జేబులో దాచేసి ఆమెతో) నే నేం అన్యాయం తలపెట్టలేదని మర్చిపోకండి. (నిట్టూర్పు విడిచి) ఇలాటి బతుక్కి సరసం రమ్మంటే ఎలా వస్తుంది, విరసం తప్ప! మీ మేలు ఎన్నడూ మర్చిపోనండి. వెళ్ళొస్తానండి. (వెళ్లిపోతాడు)

భర్త: (అతనివంక బిత్తరపోయి చూస్తూ) ఆగాగు. అలా పోడానికి వీల్లేదు. ఆగు.

భార్య: బలే! బాగుంది. ఊఁ. పరిగెత్తు. పట్టుకో. (వెక్కిరిస్తుంది)

భార్య: నిన్ను...

(కారు వెళ్లిపోతున్న చప్పుడు. ఇద్దరూ ముఖ ముఖాలు చూసుకుంటుంటే తెర పడుతుంది.)

సంక్రాంతి సమీక్ష

(51-వ పేజీ తరువాయి)

ప్రొడక్షన్ వాల్యూస్‌ను గురించిగాని, టెక్నికల్ వాల్యూస్‌ను గురించిగాని విశేషించి చెప్పవలసింది లేదు. చాలాచోట్ల కంటిన్యూయిటీ విషయంలో కూడా దర్శకుడు జాగ్రత్త తీసుకోలేదు.

దర్శకుడు: సి. పుల్లయ్య; మాటలు, పాటలు: బలిజేపల్లి; సంగీతం: అశ్వత్థామ; కెమేరా: సి. బాలకృష్ణన్.

శాంతకుమారి, శ్రీరంజని, సావిత్రి, విజయలక్ష్మి, రమణారావు, శివరావు, చంద్రశేఖర్, సదాశివరావు మున్నగువారు నటించారు.

* * *

మన నిర్మాతలు టెక్నికల్ మెరుగుల కోసం పాకులాడటంకంటే మంచి కథల కోసం, మంచి రచయితలకోసం ప్రయత్నించవలసిన అవసరం ఈ రోజుల్లో ఎక్కువ కనిపిస్తుంది. కేవలం టెక్నికల్ ప్రతిభపై ఆధారపడి ఇంతవరకూ ఏ చిత్రమూ విజయం పొందలేదు. టెక్నికల్‌గా ఎన్నో అద్భుతాలు సాధించిన హాలీవుడ్ చిత్రాలు కూడా ఈ రోజున ఇటాలియన్ చిత్రాలకు తీసి కట్టవుతున్నాయి. దీనికి కారణం ఇటాలియన్ చిత్రాల్లో ఉండే కథాబలమే. ఎప్పటికప్పుడు కొత్త కథావస్తువులు రావాలనే నిబంధన కూడా లేదు. ప్రపంచంలో ఉండే కథావస్తువులు ఇవల హెచ్. ఎమ్. రెడ్డిగారన్నట్టు చాలా కొద్ది. ఎవరు ఎంచుకున్నా నాటిల్లోనుంచే ఎంచు[illegible]వాలి. అయినా కథావస్తువుకు ట్రీట్‌మెంట్ ఇవ్వడంలో ఎంతయినా భిన్నత్వం సాధించవచ్చు. ఉదాహరణకు ప్రేమ మీద అనేకమంది ప్రసిద్ధరచయితలు నవలలు రాశారు. అయినా ప్రతి రచయితా ప్రేమవిషయంలో తన ఊహ, తన ప్రత్యేక దృక్కోణమూ ప్రదర్శించటం వల్ల ఆనవలలకు భిన్నత్వం సిద్ధించింది. అలాగే సినిమాలలో కూడా అత్తా కోడళ్ళ సమస్య, బీదరికం సమస్య మొదలైన ఏ సమస్య తీసుకున్నా రచయితయొక్క దర్శకునియొక్క ప్రత్యేక దృక్కోణం ప్రదర్శించవలసి ఉంటుంది. అటు టెక్నికల్ ప్రతిభగాని ఇటు కథాబలంగాని లేని చిత్రాలు ఎందునా కాకుండా పోతాయి.

ఆనాడు

(8-వ పేజీ తరువాయి)

డుకివార్త లందిస్తున్నాయి. ఒక ళ్లిద్దరూ కాదు, పదిమంది నడిచివస్తున్నట్లుంది.

నా వీపుమీద చరుపు పడ్డది. ఉలిక్కిపడి కళ్లు తెరిచి చూచాను. నా యెదుట వున్న ఆకారాలు మసక మసకగా కనిపిస్తున్నాయి. అద్దాలు తీసి కళ్లు నులుముకొని చూడాలనుకున్నాను. అద్దాలు తీస్తూవుండగానే యెవరో దాన్ని లాక్కున్నారు. నాకేమీ తోచిరాలేదు యీ చర్య. నా యెదుట వున్నవాళ్లు పోలీసులు మాత్రం కారు. కళ్లు నులుముకొని చూడక తప్పింది కాదు. యెదుట "జగ్గు" ప్రత్యక్షంగా కనిపిస్తున్నాడు. ఈ జగ్గు యెవరో నేను బాగా యెరుగుదును. పోలీసు యాక్షనుకు ముందు కనబడకుండా మాయమై, ఆతరువాత బయటపడిఅప్పటికి చచ్చిన పాముల్లా అనిపించుకున్నవాడు. వున్న ముస్లిములను తన్ని "వీరరౌడి". వాడు కూడా నన్నెరుగును. అయితేమటుకేం మెడమీద చెయ్యేసి కండువా లాగేసుకున్నాడు. నాకు వీళ్ళచర్యలు అర్థంకావటంలేదు. అందరూ గూండాగిరికి దిగినట్లున్నారు. మొత్తానికి వాళ్ళందరూ మా బస్తీలో బేవారసులుగా తిరిగేవారే! ఒకడు కళ్ళద్దాలు లాగేశాడు. వీడేమో కండువా తీసేశాడు. ఏమిటీ వ్యవహారం? నావళ్లు వణుకెత్తింది. కోపం కుతికెలవరకొచ్చింది.

"ఏమిటి జగ్గూ యిదంతాను" అని అడిగాను ఉండబట్టలేక.

"నోరు మూయరా ఆంధ్ర......" అన్నాడొకడు తన హైద్రాబాద్ వుచ్చారణకు కృష్ణాజిల్లా వుచ్చారణ పదునుపెడుతూ వెక్కిరింతగా.

"ఏమిటీ దౌర్జన్యం...ఇదితగదు... అన్యాయం.' తెలిసిన నన్నే యిలాచేస్తే యితరులగతేమిటి...ఏమిటి జగ్గూ యిదంతాను." అన్నా - తిరిగి ఒకేసుక్కలో.

"జర్ర వుండుసార్ సెయ్యిమీద వజన్ తగ్గిసామ్" అన్నాడొకడు.

"గైర్ సాలే గాండ్లు పోకపోతే అందరిక్కి యిదే. తన్నులు." అన్నాడొకడు. యిక నాస్థితి వేరే చెప్పాలా! రెండు పిడిగుద్దులు నా వీపుమీద పడ్డాయి.

అటు నలుగురూ, ఇటు నలుగురు కలిసి నా రెక్కలను విరిచి పట్టుకున్నారు. చేతి గడియారం, వుంగరం లాక్కున్నారు. జేబులు తడిమిచూచారు. ఏమీ లేదు. వున్న చిల్లర ఖాళీచేసేశారు. ఇక నేనుమాత్రం మిగిలాను. వాళ్లు వుంగరం తీస్తున్నప్పుడూ, గడియారం విప్పుతున్నప్పుడూ గింజుకున్నందుకు, తన పిడికిలిలో నాలాల్చిని చిక్కించుకొని గుండెలకదిమిపట్టి యెదురుగానిలుచున్న జగ్గు చేతుల్లో, నా సిల్కు లాల్చి చినిగి పేలికలయింది. మెడపట్టుకున్న పార్కరుకలం క్రిందపడ్డది. అంతే. యిక అదికూడా నాకు కనబడకుండా పోయింది. చివరికి నా ధోతినికూడా లాగేశారు. బనియను, డ్రాయరు, పైన చినిగిన పేలికలు వేలాడుతున్న లాల్చితో నేను మాత్రం మిగిలాను.

"ఛోడ్ రె సాలేకూ" అన్నాడు జగ్గుచివరకు నన్ను వదులుతూ. చేతులు పట్టుకున్న వాళ్లు వదిలేసి వెనక్కి తగ్గారు.

లోపల హృదయం మండిపోతూవుంటే:

"అంతా గూండాలు. లుచ్చాలు...నిలువుదోపిడి, కేవలం పనిచేయడం చేత కాక బేవారసు లందరూ కూడి పొట్టపోసుకోడానికి ప్రజలను దోచుకోడానికి పన్నిన పన్నాగం యీ ముల్కి నాన్ ముల్కి గొడవ అంతానూ." అని అనకుండా వుండలేకపోయాను. అంతే. కళ్లు మళ్లీ మూసుకపోయాయి. తిరిగి కళ్లు తెరిచి చూచేటప్పటికి శ్వేతాంబర ధారియయిన హాస్పిటల్ నర్సు ప్రత్యక్షమయింది నవ్వు మొగముతో. అంతే. ★

కాలక్షేపం

(7-వ పేజీ తరువాయి)

తృప్తి కలుగదు. ఆ తమలపాకులకు అనేక పరిమళద్రవ్యాలు అనుపానంగా కావాలి. పిడివక్కలు, లవంగాలు, ఏలక్కాయలు జాపత్రి, జాజికాయలు, పచ్చకర్పూరం, చలువమిరియాలు, కాచు, ఎండుకొబ్బరి కూడా కావాలి. నాలుక ఎర్రగా పండిందో లేదో చూచుకొనడానికి నిలువుటద్దాలు కావాలి. తాంబూలచర్వణానంతరం కొంచెం తిక్కగా ఉంటే నడుము వాల్చి పరుండుటకు పరుపులు పందిరిమంచాలు కావాలి. పంకాలు, వింజామరాలు, విరజాజి పూల బంతులు కావాలి. ఇంకా చెమటపోస్తూ ఉంటే, సన్నని రవసెల్లాలు, బంగారు జరీచీరెలు, పట్టురవికెలు కావాలి. ఆ చీరెకు పసందైన బంగారుగజ్జలవడ్డాణం, దానికి యీడుజోడైన యితర కెంపుల రత్నాల ఆభరణాలు కావాలి. అగరువత్తులు సువాసన తలనూనెలు, సెంటుసీసాలు, గంధం, పన్నీరు వగైరాలతో తాపం చల్లారకపోతే సినిమా ప్రదర్శనాలకు వెళ్ళి బాక్సులో భద్రాసనం స్వీకరించి, కథపట్టులో అయిస్ క్రీం వగైరా హిమపాయసం సేవించాలి. పచ్చిత్తులు ద్రాక్షారసాలు కూడా కావాలి. దీనితో ఉగ్రామావులంటివాళ్ళూ కూడా ఉల్లాసీదా అవుతారు. పాదుపాలు కూడా పైగంబరులవుతారు. లేత తమలపాకుల మేతఅంటే అది దేవికి లంకమేత. దేవరకు ఏటియీత.

హరితతృణాగ్రముల్ మెసవి
యంబర వీధిని గ్రెళ్లుదాటు మేల్
హరిణచయంబు; నృత్యసమ
యస్ఫుట పింఛము లౌమయూరముల్."

(హరితతృణాగ్రముల్) దర్భగడ్డికొనలు మెసవి, (అంబరవీధిని) ఆకాశవీధిలో (గ్రెళ్లుదాటు) గంతులువేయు మేలైన (హరిణచయంబు) లేళ్ళసమూహమున్ను నృత్యసమయానికి పింఛములు విప్పి ఆడెడి నెమళ్లున్నూ విహరించేటటువంటి కానన సీమలో ఆశ్రమం ఉంటే చాలా ఖులాసాగా ఖుషీగా హుషారుగా ఉంటుంది. అటువంటిచోట ఏర్పాటుచేసికొనిన కణ్వాశ్రమంలోనికి మేనక అనే గంధర్వాంగన ప్రసవించి విడిచిపెట్టిన శకుంతల చేరింది. ఆపిల్ల అక్కడే పెరిగి పెద్దమనిషి అయింది. ఒక లేడిపిల్లను కూడా ఆశకుంతల పెంచింది. ఆమెకు చెలికత్తెలుగా అనసూయ, ప్రియంవద అనేవాళ్లు తయారైనారు. ఒక లేడిపిల్లను పెంచుకుంటూ అడవిలో కాలక్షేపం చేస్తున్న కణ్వమహర్షి ఆశ్రమంలోకి లేడిపిల్లలతో బాటు ఆడపిల్లలు కొందరు చేరి చాలా పెద్దనాటకం ఆడినారు. దానినే శాకుంతల నాటకం అంటారు.

మహర్షికి ఒక ఆశ్రమం. బావాజీకి ఒక మఠం. సన్యాసికి ఒక పీఠం. ఈ మఠానికి, ఆ పీఠానికి భక్తులిచ్చిన కానుకలతో కొంత స్థిరాస్తి. అదంతా ఒక ధర్మాదాయం, ఒక ఎస్టేటు అవుతుంది. ఈ ఎస్టేటుకు ఏనుగులు, లొట్టిపిట్టలు, గుర్రాలు, గుమాస్తాలు, దాసదాసీ పరివారజనం చేరుతాయి. స్వాములవారిగోచీ ఉతికిఆరబెట్టితే రాత్రిళ్లు ఎలుకలు ఆగోచీని కొరికివేయడం ప్రారంభించాయి. ఎలుకలను చంపడానికొక పిల్లిని పెంచాడు. పిల్లికి పాలు కావాలని ఆవు - దానికి గడ్డి కావాలని పొలం - పొలంకోసం పాలేర్లు, ధాన్యంకొట్లు, గుమాస్తాలు, చిఠాలు, ఆవర్జాలు, తాణా ఆఫీసు ఏర్పడ్డాయి. సర్వసంగపరిత్యాగికి ఏమిటీ యీజంబాల పటలం, యీపటాలం అంటే, "కౌపీన సంరక్షణార్థం అయం పటాటోపః" అన్నాడు. గోచీ సంరక్షణకోసమే యీ ఆడంబరం అంతా అన్నాడు.

కనుక, అయోధ్యలో ఉన్నా, అడవిలో ఉన్నా, మాయలేడీ వ్యామోహం లేకుండా నళినీదళగతజలము వలె ప్రవర్తిస్తే, చక్కగా, శాంతంగా కాలక్షేపం చేయవచ్చు. ★

★ విజ్ఞాన వీథులు ★

(23 వ పేజీ తరువాయి)

పీక నన్ను [illegible]. [illegible] ఎవరు తూన్నట్టూ [illegible] నన్ను వింతగా చూస్తూన్నట్టూ అనుచు [illegible] కలలు నాకు. కొన్నిపిన్నటి [illegible] కన్ను [illegible] కనిపించె యువతి ఒక [illegible] కనబడ్డది. ఒకరిద్దరు మిత్రులకు ఆమెను చూపినాను కూడాను. నాటి రాత్రి కలలో ఆమె 'కురూపి' [illegible] నిరూపించాను [illegible]! [illegible] తెలి [illegible]! నా మిత్రుడికి ఎప్పుడూ [illegible] ఒకటు [illegible] నుంచి [illegible] అని భయము. నాకు [illegible] చెప్పవలసుకొండి. అతను ఎప్పుడూ [illegible] పడి పోయినట్లు [illegible]. ఈ రకపు కలల్నే [illegible] మనోవ్యాధి మునకు [illegible]-కలలన్నారు. ఇవి మానసిక స్వప్నాలు.

ఒకనాడు నిద్రలో పరుపుమీది దుప్పటి ముడతపడింది. నాకు కలలో పక్కమీద పాములున్నట్లు కలవచ్చింది. భోజనము ఎక్కువై కడుపులో వాయువులు గుండె వైపు ఒత్తిడిచేశాయి కొబోలు, ఎవరో నాకు ఇష్టములేని వాడే గుండెమీద కూర్చుని గుద్దుతున్నట్లు కలవచ్చింది. మూత్రవిసర్జనకి లేవడానికి బద్ధకించాను కాబోలు, పరుపుమీదే మూత్రవిసర్జన చేశేశినట్లు కల! మా అన్నగారి కూతురు నాలు గేండ్లపిల్ల నా మంచముమీదే పడుకున్ని చేతిని ముక్కుమీద వేసినది. ఆనాటి ఉదయము మ్యునిసిపల్ కొలవబమీద కూలివాళ్లు పదిలముగా పరిచే కంకరరాళ్ళ సిమెంటు పలక ఒకటి నా ముక్కుమీద అంత పదిలముగానూ [illegible] కల వచ్చింది. నిద్రలో సంభవించే భౌతిక కారణములవల్ల వచ్చే ఈ కలలు భౌతిక స్వప్నాలు.

నా మిత్రుని 'దినము [illegible]' బండికింద పడేనట్టు అతని తల్లి కలగన్నది.

"అదేమి భాయ్! తలంతా నెరిసి పోయిందేం నీకు?"

"ఏముందోయ్ ఎప్పుడూ ఒకటే విచారం."


"ఏం విచారం?"

"తల నెరిసి పోతుందేమో నని."

నాటికి నాలుగోరోజున ఆ దారుణము జరిగి పోయినది. మరియొక మిత్రుని 'ఫ్లైం' తల్లి "నీ వంశేను నాశనము చేస్తాన" ని ఒక పాము తనతో అన్నట్టుగా కలగన్నది. మూడోరోజున రాత్రి ఒక త్రాచుపాము కప్పుమీదనుంచి ఆమెపై పడినది. ఏదో త్రాడనుకొని ఆమె చేతితో తొలగించబోగా కాటువేసినది! ఆమె లేచేసరికి పాము ఆమె కుమారులవైపు ప్రాకుతోంది. వెంటనే ఆమె [illegible] ముష్టితో పామును పట్టిలాగినది. పాము మరి [illegible] కరిచింది. ఆమె [illegible] వేసి పామును పట్టినారు. చంపినారు. మాత్రుడవి పట్టుకి పాము నష్టి అప్పుడే [illegible] పోయినది. పాప మామె గతించినది. మూడో ఉదాహరణము! బాంబుల భయం రోజుల్లో పల్లెటూటకు పుట్టింటికి వెళ్ళినది. మానాన్నగారికి మా కుటుంబము వలసపోయినప్పుడు [illegible] కల్లలను మా అమ్మ [illegible] గొయ్యితీసి, ఇత్తడి [illegible] పెట్టి [illegible], కప్పివేసి [illegible]. రెండు నెలలు గడిచిపోయినవి. ఒకనాటి రాత్రి కామేశ్వరిదేవి ఆమెపక్కలో కూర్చుని తట్టి, చెవిలో "నోట్లు తడిసిపోతున్నాయి!" అని చెప్పినట్లు కల! [illegible] తవ్వి తీసే నోట్లు తడిసిఉన్నవి. మరియొక్క ఉదాహరణము. నా భార్య [illegible] కను ఒకనాటి రాత్రి తెల్లవారుగట్ల లేచి, మా అమ్మను లేపి "అబ్బాయికి కొడుకు పుట్టిన దని కల వచ్చినది. ఏంచేస్తు [illegible]?" అని కబుర్లకి కూర్చొన్నారు. అక్కడ తెనాలులో నా భార్య అర్ధరాత్రే ఆవేళకే ఆడబిడ్డను కన్నది. ఇవి భవిష్యత్స్వప్నాలు.

విటినిగురించి ఒక హెచ్చరిక. మన మనసులోని కోపాలూ, భయాలూ, వాంఛలూ, కలలరూపాన్ని వ్యక్తిత్వము చేస్తాయి. వచ్చిన పీడకలలన్నీ భవిష్యత్స్వప్నాలు కావు. ఇది అందరికే అనుభవమే. ★

Edited. Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras.



పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
"ఉహూహూ ఉహూహూ చలి చలి బాబోయ్!... ఈ దగ్గిర్లో నిప్పు దొరికితే చలి మంటేసుకు చలికాగచ్చును. వెదకండర్రా నిప్పుందేమో!"
నిప్పుకోసమై ఆ వనమంతట వానరాలు తెగవెదికాయి
వెదుకగ వెదుకగ ఒకచోటా మిణుకు మిణుకుమను మిణుగురు పురుగులు కంటపడినవొక కోతిగాడికి
వాట్లో ఒక దానిని తెచ్చి "అన్నా, బావా, చెల్లీ, వదినే, ఇదుగోనర్రా, తెచ్చానర్రా, చక్కని నిప్పుల కణికొకటి"
అంటూ కేకలు వెయ్యగనే మిగతా కోతులు కిచకిచమంటూ చంకలు కొట్టుతు గంతులు వేస్తూ చెంగు చెంగుమని వచ్చాయి
సూచీముఖమను వృద్ధ విహంగము ఈ వింతంతా గమనించినది. "ఇదేమిటర్రా తిమ్మనలారా! మిణుగురుపురుగును పట్టుకువచ్చి నిప్పనుకుంటే చలిపోతుందా? అదుగో అక్కడ మంటదగ్గిరికి పోయి చక్కగా చలి కాగండి"
"శకునపక్షిలా నువ్వెవరయ్యా? ఇంత పొడుగు ముక్కేసుకునొచ్చావ్, నిన్నెవరడిగారయ్యా సలహా?"
ఈ మాటలు విని మిగతా కోతులు కిచకిచ గొల్లున నవ్వాయి
మర్కటమొక్కటి వచ్చి, చటుక్కున పిట్టను గట్టిగ పట్టేరది!
పిట్టముక్కు నొక రాతి బండపై విరిగేదాకా కొట్టి చంపినది
కరటకుడు: "ఏదో పాపం సలహా యిస్తే పక్షికి పట్టిన గతి చూశావా!"
"అందుకనే ఓ దమనకుడా! బుద్ధిహీనులగు వారికి బుద్ధులు నేర్పగబోవుట బుద్ధి తక్కువే!"
"అయినా నిన్ననపని యేముందో' నీ చెడు సలహా పాటించిన ఆ పింగళకునిదే తప్పంతా! పూర్వం సురథుడు అను ఒక రాజూ కపటయోగి వలలో పడలేదా!"
"ఏవరా రాజు? ఏమా కథ?"
33

Rgd. No. M. 4479

Andhra Patrika Illustrated Weekly